ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
22-5-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 110 పేజీలు: 10+4 వెల: 6.50

మహారాష్ట్రలో 106 మందికి కొవిడ్, ఇద్దరు మృతి 2
కన్నడ రచయిత్రి భానుముస్తాక్‌కు బుకర్ ప్రైజ్ 5

# 'మాఢ్'లో భారీ ఎన్‌కౌంటర్



## అగ్రనేత నంబాల కేశవరావు సహా 27 మంది నక్సల్స్ హతం

**గణపతి రాజీనామా తర్వాత ఉద్యమ సారథిగా ఉన్న కేశవరావు, అతడిపై కోటిన్నర రివార్డు**

కేశవరావు మృతిని స్వయంగా ప్రకటించిన అమిత్‌షా

భారీగా ఆయుధాలు, మందుగుండు సామాగ్రి స్వాధీనం

2026 మార్చిలోగా మావోయిస్టుల అంతం తథ్యం: కేంద్ర హోంమంత్రి

ఘటనలో డిఆర్జీ జవాన్ మృతి, పలువురికి గాయాలు



### ఐదు దశాబ్దాల ఉద్యమ యాత్ర..

**చర్ల, మే 21 , ప్రభాతవార్త:** మాఢ్ ఏరియాలో జరిగిన ఎన్ కౌంటర్‌లో మృతిచెందిన నంబాల కేశవరావు(70)ది ఆంధ్రప్రదేశ్‌లోని >>2

**చర్ల, మే 21 , ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ లో భాగంగా ఆపరేషన్ బ్లాక్ హిల్స్ చేపట్టి నేటికి నెలరోజులు కావస్తుంది. ఈ నెల రోజుల వ్యవధిలో వేల మంది బలగాలు బ్లాక్ హిల్స్ (కర్రిగుట్టల)ను చుట్టు ముట్టి భారీ ఆపరేషన్ చేపట్టింది ఈ క్రమంలో భారీగా ఆయుధాలు మందుగుండి సామాగ్రి ఇతర రాకెట్ లాంఛర్లను స్వాదీనం చేసుకొని మావోయిజానికి భారీ నష్టం చేకూర్చారు. కరిగుట్టల ఆపరేషన్ 36 మంది మావోయిస్టులు హతమైయ్యారు. అనుకోకుండా పహాల్గా ఉగ్రదాడి నేపధ్యంలో కేంద్రం ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. అందులో భాగంగా కేంద్ర బలగాలను వెనక్కి పిలిపించింది. దీంతో ఆపరేషన్ బ్లాక్ హిల్స్ కొంత బ్రేక్ పడిందని సర్వత్రా భావించారు. అయితే సింధూర్‌ఆగిపోవడంతో సెర్చ్ ఆపరేషన్ మరింత ఉధృతం చేసారు. ఈ క్రమాంలో భారీ ఆపరేషన్ చేపట్టారు భద్రతా బలగాలు. ఛత్తీస్‌ఘడ్ నారాయణ్ పూర్ జిల్లా ఓర్చా పోలీస్ స్టేషన్ పరిధిలోని మాడ్ అడవులలో పెద్ద ఎత్తున మావోల ఉన్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందటంతో మావోలే లక్షంగా సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు తో సహా 27 మంది మావోయిస్టులు మృతిచెందారు. మృతిచెందిన కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు కోటిన్నర రివార్డు కలిగి ఉన్నాడు. మృతుల్లో వివిధ కేడర్ >>2

## మావోయిజం మూలాలను చెరిపేస్తున్నాం: ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, మే 21:** ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలో బుధవారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో 27 మంది మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఎన్‌కౌంటర్‌పై ప్రధాని నరేంద్రమోడీ ఎక్స్‌వేదికగా స్పందించారు. ఆపరేషన్‌లో పాల్గొన్న భద్రతా బలగాలను ప్రశంసించారు. మీ అద్భుత విజయాన్ని చూసి గర్విస్తున్నా అని మావోయిజం ముప్పును నిర్మూలించి ప్రజలకు శాంతి పురోగతితోకూడిన జీవితం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని అన్నారు. మావోయిజం మూలాలను >>2

## మావోయిస్టుల నిర్మూలనలో కీలక మైలురాయి..

### కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



**న్యూఢిల్లీ, మే 21:** ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. ఎన్‌కౌంటర్‌లో నంబాల కేశవరావు మృతి చెందాడంటూ అమిత్ షా ట్వీట్ చేశారు. మావోలపై మూడు దశాబ్దాల పోరాటంలో ప్రధాన కార్యదర్శి స్థాయి నేత చనిపోవడం ఇదే ప్రథమమన్నారు. ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టుల మృతి చెందారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ట్విట్టర్‌లో తెలియజేశారు. >>2

# కృష్ణా జలాల కోసం న్యాయ పోరాటం

మూడు ఎత్తిపోతల పథకాలతో 71 వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యం

ముత్యాల బ్రాంచ్‌కి ఇందిరాగాంధీ ఎత్తిపోతల పథకంగా నామకరణం: మంత్రి ఉత్తమ్



బుధవారం చింతలపాలెం మండలంలో ఎత్తిపోతల పథకాలపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్

**హుజూర్‌నగర్ (గరిడేపల్లి), మే 21, ప్రభాతవార్త:** గతపాలకుల తీరుతో కృష్ణాజిల్లా పంపకంలో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నలమాల ఉత్తంకుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చింతలపాలెం మండలం అంజలి సిమెంట్ ఆడిటోరియంలో నియోజకవర్గ పరిధిలోని మూడు ఎత్తిపోత పథకాల పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌తో కలిసి ఇరిగేషన్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరక్ష్య ధోరణితో కృష్ణ జలాల నీటి వాటాల విషయంలో అన్యాయం జరిగిందని తెలిపారు. కృష్ణా జలాల పంపకంలో బ్రిజేష్ ట్రిబ్యునల్ పై గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో దక్షిణ తెలంగాణ ఎడారిలాగా మారిందని తెలిపారు. తెలుగు రాష్ట్రాలకి ఎనిమిది వందల పదకొండు టిఎంసిల కృష్ణా జలాలను కేటాయించగా 512 టిఎంసి (66%!) ఆంధ్ర రాష్ట్రానికి, 299 టిఎంసి (34%) తెలంగాణ రాష్ట్రానికి కేటాయించే విధంగా జరిగిన లిఖితపూర్వక ఒప్పందంపై గత పాలకులు ఒప్పుకొని తెలంగాణకి తీవ్ర అన్యాయం చేశారని ఆయన ఆరోపించారు. ఈ ఒప్పందంపై కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులకు వచ్చిన అనంతరం తీవ్రంగా వ్యతిరేకించామని, దీనిపై ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రిగా తాను, నిపుణులు న్యాయ కోవిదుల సలహాలు తీసుకొని న్యాయపోరాటం చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి కృష్ణాజిల్లా పంపకాన్ని 70 శాతం వాటాగా తీసుకొచ్చేందుకు కేసు రి ఓపెన్ చేయించి ట్రిబ్యునల్ ద్వారా తానే స్వయంగా పాల్గొని న్యాయపోరాటం చేస్తున్నట్లు తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో 38 వేల కోట్లతో తుమ్మడి హట్టి వద్ద >>2



## 4, 5 రోజుల్లో రుతుపవనాలు

**ఈదురుగాలులతో వర్ష సూచన**

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** రాగల 4,5 రోజులలో కేరళ భూభాగంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉంది. తూర్పు మధ్య అరేబియన్ సముద్రంలో కర్ణాటక తీరానికి సమీపంలో ఉపరితల చక్రవాత ఆవర్తనం ఏర్పడుతోంది. తూర్పు మధ్య అరేబియన్ ప్రాంతంలో ఈ నెల 22న అల్పపీడనంగా మారి క్రమేపీ ఉత్తర దిక్కుగా కదులుతూ బలపడే అవకాశం ఉంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న దక్షిణ ఆంధ్ర కోస్తా, ఉత్తర తమిళనాడు తీరం సమీపంలో సగటు సముద్రమట్టానికి 1.5కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుంది. దీని ప్రభావంతో రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తెలంగాణలోని అన్ని జిల్లాలలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. కొత్తగూడెం, >>2

# 'ముందస్తు వాన'లో మునక

రాష్ట్రంలో పలుచోట్ల పిడుగులతో కూడిన వర్షం; ముగ్గురు మృతి

అధికారులు అప్రమత్తంగా ఉండాలని సిఎం రేవంత్ ఆదేశం

1200 మందితో ఎన్‌డిఆర్‌ఎఫ్‌లను సిద్ధంగా ఉంచిన సర్కార్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే21:** తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షం పడుతోంది. వర్షం జోరుగా కురుస్తుండటంతో తెలంగాణ ప్రభుత్వం అలర్ట్ అయింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులకు బుధవారం కీలక ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు పడుతున్నందున అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ ఇచ్చిన సూచనలకు అనుగుణంగా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లలో ఉన్న ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, కాంటాలు వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. హైదరాబాద్ సిటీలో వర్షం కురుస్తున్న ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలని, ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్తు సమస్యలు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్, విద్యుత్తు విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సీఎస్‌ను ఆదేశించారు. కాగా, ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలంగాణలో పలు చోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. బుధవారం రాష్ట్రంలో పలు జిల్లాల్లో వర్షంతో పాటు ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. పలుచోట్ల పిడుగులు పడిన ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పిడుగుతో పాటుతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. కొత్తగూడెం మండలం ఓటాయి వద్ద పిడుగుపాటుతో గొర్రెల కాపరి మృతి చెందారు. గూడురు మండలం గుండెంగ వద్ద పిడుగుపడి మహిళ మృతి చెందింది. నల్లగొండ మండలం అప్పాజీ పేట వద్ద బావి >>2

## పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పడంలో ప్రధాని వెనకడుగు


**అమెరికా ఒత్తిడికి తలొగ్గిన మోడీ ప్రభుత్వం**

**ఆ సమయంలో కిషన్ రెడ్డి బయటకు రాలేదు**

**దేశానికి వన్నె తెచ్చిన మహానాయకుడు రాజీవ్‌గాంధీ**

**రాజీవ్ వర్ధంతి సందర్భంగా సిఎం రేవంత్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే21:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాటాలకు తలొగ్గి కేంద్ర ప్రభుత్వం సువర్ణాకాశం చేజార్చుకుందని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని >>2



నేషనల్ హెరాల్డ్ కేసు:

**రాహుల్, సోనియాలకు**

## రూ.142 కోట్ల లబ్ధి

ఇడి ఆరోపణలు

**న్యూఢిల్లీ, మే 21:** నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సంచలన ఆరోపణలు చేసింది. వీరిరువురికీ రూ.142కోట్లు లబ్ధి జరిగిందని పేర్కొంది. ఆ ఆదాయాన్ని వాళ్లు ఉపయోగించుకున్నట్లు తెలిపింది. దిల్లీ ప్రత్యేక కోర్టులో బుధవారం జరిగిన విచారణ సందర్భంగా వాదనలు వినిపించిన ఈడీ ఈ మేరకు ఆరోపణలు చేసింది. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారనే ఫిర్యాదు మేరకు ఈడీ, >>2

# బాంబుల తయారీకి సిరాజ్, సమీర్ ప్లాన్

ప్రత్యేక ల్యాబ్ ఏర్పాటు.. ఆర్‌ఎస్‌ఎస్ నేతలే టార్గెట్

'సిందూర్' తర్వాత భారత్‌లో ఉగ్రదాడులకు ఐసిస్ కుట్ర



పోలీసులకు పట్టుబడ్డ ఉగ్రవాదులు సమీర్, సిరాజ్

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** పాక్‌పై భారత్ చేబట్టిన ఆపరేషన్ సిందూర్ తరువాత భారత్‌లో ఉగ్ర దాడులకు పథకం వేసి ఎపి, తెలంగాణ పోలీసుల జాయింట్ ఆపరేషన్‌లో పట్టుబడిన ఐసిస్ ఉగ్రవాదులు సమీర్, సిరాజ్‌ల వ్యూహాలు పోలీసులను షాక్‌కు గురిచేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా పలు నగరాలలో పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల తరహాలో వరుసగా పేలుళ్లకు పాల్పడడంతో పాటు ఆర్‌ఎస్‌ఎస్ నేతలను హత మార్చడం వీరి లక్ష్యంగా పోలీసులు గుర్తించారు. దీంతో పాటు యూట్యూబ్‌లను పరిశీలించి బాంబులు, రాకెట్ లాంచర్లను ఎలా తయారు చేయవచ్చనే దానిపైనా ఇద్దరు ఉగ్రవాదులు భారీ కసరత్తులు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇందు కోసం ఏకంగా ఒక ల్యాబ్‌ను ఏర్పాటు చేసేందుకు ఇద్దరు నిర్ణయించినట్లు పోలీసుల విచారణలో వెల్ల డయ్యింది. తప్పుడు పాస్ పోర్టులో వీరిద్దరు పలుమార్లు గల్ఫ్ దేశాలకు వెళ్లి వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. సౌదీ అరేబియాతో పాటు దుబాయ్‌కు వెళ్లిన సమయంలో ఐసిస్ అగ్రనేతలను వీరిద్దరు కలిసి భారత్‌లో విధ్వంసం సృష్టించేందుకు ఎలాంటి వ్యూహాలు అమలు చేయాలనే దానిపై చర్చించినట్లు పోలీసులు గుర్తించారు. ఆర్‌ఎస్‌ఎస్ నేతలను టార్గెట్ చేయడం ద్వారా విధ్వంసాలకు తెరలేపడంతో పాటు హైదరాబాద్, వరంగల్, ఢిల్లీ, ముంబాయి సహా దేశవ్యాప్తంగా పేరున్న నగరాలలో వరుసగా బాంబు పేలుళ్లకు పాల్పడి అమాయకులను చంపాలని, శాంతికి భంగం కలిగించాలని సమీర్, సిరాజ్‌లు లక్ష్యంగా చేసుకున్నారని పోలీసుల విచారణలో వెలుగు చూసింది. బాంబులను ఇతర ప్రాంతాలలో కొని తేవడం కంటే స్థానికంగా లభించే పేలుడు పదార్థాలతోనే తయారు చేయడం సులభమని సిరాజ్, సమీర్‌లకు ఐసిస్ పెద్దలు చెప్పారని పోలీసులు గుర్తించారు. ఇందుకోసం ఐసిస్ ఉగ్రనేతలుతాము రూపొందించిన యూ ట్యూబ్‌లలోని వీడి యోలను సమీర్, సిరాజ్‌లకు ఇచ్చినట్లు >>2




# మూడు అమృత్ భారత్ స్టేషన్లు నేడు ఆరంభం

బేగంపేట, కరీంనగర్, వరంగల్ స్టేషన్లు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోడీ

**హైదరాబాద్, మే 21 ప్రభాతవార్త:** దేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత అనేక రంగాలలో వేగవంతమైన అభివృద్ధితో ముందుకు సాగుతుందనిని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గతానికి భిన్నంగా అంతర్జాతీయ స్థాయిలో దేశాన్ని అగ్రభాగాన నిలబెట్టడమే లక్ష్యంగా ఆయా రంగాలలో ప్రపంచంతో పోటీ పడుతూ సాగుతున్న అభివృద్ధి, అందుకు జరుగుతున్న కృషి దేశాన్ని వికసిత భారత్ వైపు నడిపిస్తుందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన రైల్వే వ్యవస్థలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ దూరదృష్టి కారణంగా గత 11 ఏళ్లలో చోటు చేసుకున్న అభివృద్ధి, భవిష్యత్ అవసరాలు లక్ష్యంగా సాగుతున్న అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. తెలంగాణలో ప్రస్తుతం రూ.42,219 కోట్ల విలువైన రైల్వే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ యేడాది రైల్వే బడ్జెట్‌లోనూ రూ.5,337 కోట్లు తెలంగాణకు కేటాయించారని, ఇది 2014-15 నాటి తెలంగాణకు కేటాయించిన రైల్వే >>2



రాజీవ్ గాంధీ వర్థంతి సందర్భంగా న్యూఢిల్లీలో ఆయన సమాధి వద్ద నివాళులర్పిస్తున్న రాహుల్ గాంధీ

## మూలాలను చెరిపేస్తున్నాం

>> చెరిపేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత సంబాల కేశవరావు(70) అలియాస్ బసవరాజు మృతిచెందినట్లు ఎక్స్‌వేదికగా హోంమంత్రి అమిత్‌షాప్రకటించిన సంగతి తెలిసిందే. నక్సలిజం నిర్మూలనలో ఇదొక మైలురాయి విజయం. 2026 మార్చి31నాటికి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోడీ సర్కారు ధృఢసంకల్పంతో ఉందని పోస్టులో వెల్లడించారు. మాఢ్ ప్రాంతంలో పెద్ద ఎత్తున మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం రావడంతో భద్రతా బలగాలు ఆపరేషన్‌చేపట్టాయి. ఈ ఆపరేషన్‌లో బీజాపూర్, నారాయణపూర్, దంతెవాడ, డిఆర్జీ బలగాలు పాల్గొన్నాయి. ఇటీవల ఛత్తీస్‌గఢ్ తెలంగాణ సరిహద్దుల్లోని కరెగుట్ట పర్వతాల్లో 24 రోజులపాటు జరిగిన ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులు మరణించారు. వీరిలో 16మంది మహిళలు కూడా ఉన్నారు.

## నిర్మూలనలో కీలక మైలురాయి..

>>నక్సలిజాన్ని నిర్మూలించే పోరాటంలో ఒక మైలురాయి విజయం. ఈరోజు, ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరిగిన ఆపరేషన్‌లో మన భద్రతా దళాలు 27 మంది భయంకరమైన మావోయిస్టులను మట్టుబెట్టాయి. సీపీఐ మావోయిస్ట్ ప్రధాన కార్యదర్శి, అగ్ర నాయకుడు నక్సల్ ఉద్యమానికి వెన్నెముక అయిన నంబాల కేశవ్ రావు అలియాస్ బసవరాజు ఉన్నారు. నక్సలిజంపై భారత్ చేసిన మూడు దశాబ్దాల పోరాటంలో ప్రధాన కార్యదర్శి హోదా కలిగిన నాయకుడిని మన దళాలు మట్టుబెట్టడం ఇదే మొదటిసారి. మావోయిస్టులను హతమార్చిన మన ధైర్యవంతులైన భద్రతా దళాలు , ఏజెన్సీలను అభినందిస్తున్నాను. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ పూర్తయిన తర్వాత 54 మంది నక్సలైట్లను అరెస్టు, 84 మంది నక్సలైట్లు లొంగిపోయారని తెలియజేయడం సంతోషంగా ఉంది. మార్చి 31, 2026లోపు నక్సలిజాన్ని నిర్మూలించాలని మోదీ ప్రభుత్వం సంకల్పించింది అంటూ అమిత్ షా ట్వీట్ చేశారు.

## 4, 5 రోజుల్లో రుతుపవనాలు

>> జగిత్యాల, జనగాం, భూపాలపల్లి, గద్వాల, కామారెడ్డి, మహబూబాబాద్, మెదక్, ములుగు నిర్మల్, పెద్దపల్లి వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాలలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. కరీంనగర్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, హనుమకొండ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో గంటకు 41 నుంచి 61 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉంది.

## అమృత్ భారత్ స్టేషన్లు నేడు ఆరంభం

>> బడ్జెట్ తో పోలిస్తే 20 రెట్లు ఎక్కువ అన్నారు. రైల్వేలలో జరుగుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలలో రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి ఒకటని అన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ. ఒక లక్ష కోట్ల అంచనా వ్యయంతో దేశవ్యాప్తంగా 1300కు పైగా రైల్వేస్టేషన్లలో పునరాభివృద్ధి కార్యక్రమాలను ప్రధానమంత్రి నరేంద్రమోడీ 2023 ఆగస్టులో ప్రారంభించారని అన్నారు. రాబోయే 30 నుంచి 40 ఏళ్ల వరకు ప్రయాణికుల అవసరాలను తీర్చేలా ఆయా రైల్వేస్టేషన్లను సిద్ధం చేయనున్నారని అన్నారు. ఇందులో తెలంగాణలోనూ 40 రైల్వేస్టేషన్లలో దాదాపు రూ.2,750 కోట్లతో పునరాభివృద్ధి కార్యక్రమాలు చాలా వేగంగా సాగుతున్నాయని అన్నారు. అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా సాగుతున్న ఈ అభివృద్ధి పనులను పూర్తి చేసుకున్న 103 రైల్వేస్టేషన్లను ప్రధాని మోడీ గురువారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారని అన్నారు. ఇందులో తెలంగాణ రాష్ట్రంలోని బేగంపేట, కరీంనగర్, వరంగల్ రైల్వేస్టేషన్లు సైతం ఉన్నాయి. ఇందులో బేగంపేట రైల్వేస్టేషన్ పూర్తిగా మహిళా ఉద్యోగులతో నడవనుండటం విశేషం అని కేంద్ర మంత్రి అన్నారు. బేగంపేట రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొననున్నారు. పునరాభివృద్ధి పనులు జరుగుతున్న అన్ని రైల్వేస్టేషన్లలో ఆయా ప్రాంతాల్లోని సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ముఖద్వారం, స్టేషన్ ప్రధాన భవనాల నిర్మాణం సాగుతుంది. అంతేకాకుండా స్టేషన్ లోపల ప్రయాణికులకు అనువుగా ఫుట్‌పాత్‌లు, విశాలమైన ఓవర్ బ్రిడ్జిలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, వెయిటింగ్ హాల్స్, బుకింగ్ ఆఫీస్, టాయిలెట్ల నిర్మాణం, సైనేజ్ బోర్డుల ఏర్పాటు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి.

## రాహుల్, సోనియాలకు రూ.142 కోట్ల లబ్ధి

>> సీబీఐ దర్యాప్తు చేస్తున్నాయి. సీబీఐ విచారణ మధ్యలో నిలిచిపోయినప్పటికీ, ఈడీ దర్యాప్తు మాత్రం సాగుతోంది. 2023 నవంబరులో జప్తుచేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (తిరిలి)కు చెందిన రూ.751.9కోట్ల ఆస్తుల స్వాధీనానికి ఈడీ చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు నోటీసులు జారీ చేసింది. అద్దెకు ఉంటున్నవారు ఇకపై తమకే ఆ మొత్తం చెల్లించాలని తెలిపింది. అక్రమ చెలామణి నిరోధక చట్టం ప్రకారం జప్తు చేసిన ఆస్తులను స్వాధీనం చేసుకొనే ప్రక్రియ చేస్తున్నామని తెలిపిన ఈడీ దిల్లీ, ముంబయి, లఖ్‌నవూలోని భవనాలకు నోటీసులు అంటించింది. నేషనల్ హెరాల్డ్ అనేది 1938లో జవహర్‌లాల్ నెహ్రూ స్థాపించిన చారిత్రక వార్తాపత్రిక. ఈ పత్రికలో అవకతవకలు జరిగాయంటూ 2012లో బీజేపీ నేత సుబ్రమణియన్ స్వామి పటిషన్‌ను దాఖలు చేశారు. ఈ నేషనల్ హెరాల్డ్ పత్రిక, అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజెఎల్) సంస్థలో మనీ లాండరింగ్ జరిగినట్లు ఈడీ గుర్తించింది. కాంగ్రెస్ నేతలు సోనియా, రాహుల్‌కి సంబంధించిన యంగ్ ఇండి యన్ ప్రైవేట్ కంపెనీ ఏజెఎల్ సంస్థకు చెందిన రూ.2000కోట్ల విలువైన స్థలాలను కేవలం రూ.50 లక్షలకే దక్కించుకున్నట్లు అభియోగాలు మోపింది. వైఐఎల్‌లో రాహుల్‌కు 38శాతం, సోనియాకు 38శాతం షేర్లు ఉన్నాయి. ఏజేఎల్‌కు చెందిన 99 శాతం షేర్లను యంగ్ ఇండియా లిమిటెడ్‌కు బదిలీ చేశారు. ఈ లావాదేవీ మనీలాండరింగ్‌లో భాగమన్నది ఈడీ ప్రధాన ఆరోపణ. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన ఈడీ 2021 నుంచి అధికారికంగా దర్యాప్తును ప్రారంభించింది. 2025 ఏప్రిల్ 9న మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్లు 3 మరియు 4 కింద చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో సోనియా గాంధీని ఏ1గా, రాహుల్ గాంధీని ఏ2గా ఈడీ చేర్చింది. కాంగ్రెస్ నాయకులు సామ్ పిట్రోడా, సుమన్ దూబే వంటి వారు కూడా నిందితులుగా ఉన్నారు.

## ఐదు దశాబ్దాల ఉద్యమ యాత్ర..

>> శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జియన్నగుడెం గ్రామంలో 1955 లో జన్మించారు. ప్రాథమిక స్వగ్రామంలోనే సాగింది. తాతగారి ఊరైన టెక్కలి మండలం తలగాంలో హైస్కూల్ విద్య ఇంటర్ టెక్కలి జూనియర్ కళాశాలలో చదివారు. డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతుండగా వరంగల్ బిటెక్ సీటు రావడంతో అక్కడ ( ఆర్ ఈ సి ) రీజనల్ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ చదువుతుండగా రాడికల్ విద్యార్థి సంఘంవైపు అడుగులు వేసారు. ఈయన తండ్రి వాసుదేవరావు ఉపాధ్యాయుడు కాగా ఇతనికి ఓ సోదరుడు ముగ్గురు అక్కా చెల్లెళ్ల ఉన్నారు. నలభై మూడేళ్ల ఉద్యమంలో ఏనాడు ఇంటికి వచ్చిన దాఖలాలు లేవని చెప్పవచ్చును. యుక్త వయస్సు నుండే విప్లవ భావాలు గల కేశవరావు శ్రీకాకుళంలో గిరిజన రైతాంగ సాయుధ పోరాటం ద్వారా పోరుబాట పట్టారు. 1974లో వరంగల్ సీట్ లో ఇంజనీరింగ్ విద్యను ముగించారు. 1975 లో పీపుల్స్ వార్ పార్టీలో చేరి తన ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1980 సంవత్సరంలో జరిగిన విద్యార్థుల ఘర్షణలో కేశవరావు పేరు ప్రముఖంగా వినపడింది. గెరిల్లా పోరాటాలు అత్యాధునిక పేలుడు పదార్థాల వినియోగంలో సిద్ధహస్తుడిగా పేరుంది. ఆయుధ శిక్షణలోనూ దిట్టగా పేరుగాంచారు. 1990 నుండి 2018 వరకు దాదాపు 30 సంవత్సరాల పాటు మావోయిస్టు పార్టీ మిలటరీ మిషన్ కు నేతృత్వం వహించారు. 2018 లో మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి పదవి నుండి గణపతి తప్పుకోవడంతో కేశవరావు కేంద్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ఒడిషా ఛత్తీస్‌ఘఢ్ ఆంధ్ర తెలంగాణా రాష్ట్రాలపై ఆయనకు గట్టి పట్టుంది. 2003 లో ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై అలిపిరిలో బాంబులు పేల్చిన సంఘటనతో పాటు ఛత్తీస్‌ఘఢ్ ప్రతిపక్షనేత కాంగ్రెస్ నాయకులు సల్వాజుడుం సృష్టికర్త మహేంద్రకర్మ నవీన్ పటేల్ ఆంధ్రప్రదేశ్ మాజీ ఎంఎల్ ఏ లు కిడారి సర్వేశ్వరరావు సోము బలిమెల సంఘటన 2010 లో ఛత్తీస్‌ఘఢ్ లో 76 మంది సి ఆర్ పి ఎఫ్ జవాన్ల ఊచకోతలో కేశవరావు కీలకంగా వ్యవహరించారని సమాచారం. ఇతని పై దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాలలో 35 కు పైగా కేసులు నమోదయ్యాయి.

## వారం - వర్జ్యం

తేది : 22-05-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
దశమి రా.1.11
పూర్వాభాద్ర సా.5.46
వర్జ్యం రా.7.03-9.22
దు.ఉ.9.55-10.47, మ.3.07-3.59
శుభసమయం: ఉ.7.45-8.20
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** సన్నిహితులతో కలిసి కష్టసుఖాలని పంచుకుంటారు. ఇంటా బయటా అనుకూలంగా వుంటుంది.

**వృషభం :** పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైన అధిగమిస్తారు. ఋణబాధలు తప్పవు.

**మిథునం:** పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తిచేస్తారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**కర్కాటకం :** మిత్రులే శత్రువులుగా మారి సమస్యలు సృష్టిస్తారు. జాగ్రత్త అవసరం. ఖర్చులు పెరుగుతాయి.

**సింహం:** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. పెట్టుబడుల విషయాలలో తొందరపాటు వద్దు.

**కన్య :** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఆధ్యాత్మిక చింతన.

**తుల :** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. వస్తులాభం.

**వృశ్చికం:** పనులలో ప్రోత్సాహం లభిస్తుంది. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు. తీర్థయాత్రలు. వస్త్రలాభం.

**ధనుస్సు:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. వాహనయోగం.

**మకరం:** ఋణబాధలు ఎదురై చికాకులు పెడతాయి. పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తిచేస్తారు. మానసిక అశాంతి.

**కుంభం:** గృహ నిర్మాణ ఆలోచనలు నిదానంగా కార్యరూపం దాలుస్తాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**మీనం:** ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. పనులు మధ్యలో నిలిచిపోతాయి. శ్రమాధికం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'మాఢ్'లో భారీ ఎన్‌కౌంటర్

>> లకు చెందిన అగ్రనాయకులు మరికొందరు ఉండే అవకాశం ఉందని ఊహగానాలు వినిపిస్తున్నాయి. మృతుల వివరాలను పోలీసులు వెల్లడిస్తే వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. కాగా ఎదురు కాల్పుల్లో డిఆర్జీ జవాన్ మృతి చెందగా మరి కొంత మంది జవాన్లు లకు గాయాలైనట్లు తెలిసింది. వీరిని హుటాహుటిన నారాయణ్ పూర్ జిల్లా వైద్యశాలకు తరలించి చికిత్స అంద చేస్తున్నారు. ఈ ఉదయం నుండి జరిగిన ఎన్‌కౌంటర్‌లో సంఘటనా ప్రాంతం నుండి మృత దేహాలతో పాటు పెద్ద మొత్తంలో ఆయుదాలు, పేలుడు పదార్థాలు, నిత్యావసర సరుకులను భద్రతా బలగాలు స్వాదీనం చేసుకున్నాయి. సెర్చ్ ఆపరేషన్ లో బీజాపూర్ దంతెవాడ జిల్లాలకు చెందిన డిఆర్జీ ఎస్టీఎఫ్ సిఆర్పీఎఫ్ బలగాలు పాల్గొన్నారని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు.

ఆపరేషన్ కగార్ చేపట్టిన దగ్గర నుండి నేటి వరకు జరిగిన వివిధ ఎన్ కౌంటర్లలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు పొలిట్ బ్యూరో సభ్యులు మృతి చెందినప్పటికీ కేంద్ర కమిటీ కార్యదర్శిని హతమార్చడం మావో ఉద్యమంపై పట్టు సాధించినట్లైంది. ఈ ఎన్ కౌంటర్ ఘటన దేశ వ్యాపితంగా సంచలనం సృష్టించింది. 2026 మార్చి 31 నాటికి దేశంలో మావోయిజాన్ని నిర్మూలిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దేశ వ్యాపితంగా లక్షల మంది భద్రతా బలగాలను మొహరించి మావోయిస్టుల కొరకు కూంబింగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో జరిగిన నారాయణ్ పూర్ ఎన్ కౌంటర్ మావోయిస్టు ఉద్యమానికి కోలుకోని దెబ్బగా చెప్పవచ్చు. మరోవైపు మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ప్రభుత్వం తో చర్చలకు సిద్దం మని ఇప్పటికే రెండు ధపాలుగా లేఖ విడుదల చేసారు. అదే విధంగా దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి బూపేష్ తెలంగాణా రాష్ట్ర అధికార ప్రతినిది జగన్ చర్చలకు ఆరు నెలలపాటు కాల్పులకు సిద్ధం అని ప్రకటించిన నేపథ్యంలో మావోలతో ఎటువంటి చర్చలు జరిపేది లేదని ఆయుధాలు వీడి లొంగిపోవాలని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి హోంశాఖ మంత్రి విజయ్ శర్మలు పలుమార్లు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో భారీ ఎన్ కౌంటర్ జరగడం అందులో కేంద్ర కమిటీ కార్యదర్శి చనిపోవడంతో మావోయిస్టుల్లో మరింత అలజడి నెలకొంది.

**కేశవరావు మృతి.. నిజం కాదు.. ఎపి పౌరహక్కుల సంఘం**

**జమ్మికుంట (హుజురాబాద్ ఆర్సీ), ప్రభాతవార్త:** ఛత్తీస్‌ఘడ్ నారాయణ్‌పూర్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు మృతి చెందిన వార్తలను ఏపి పౌరహక్కుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఆయన క్షేమంగా ఉన్నారని ఆ ప్రచారం అవాస్తవమని సంఘం కార్యదర్శి చంద్రశేఖర్ మీడియాకు ప్రకటన విడుదల చేసారు. ఈ ప్రకటనను పోలీసు అధికార యంత్రాంగం కొట్టిపారేసింది.


# 'ముందస్తు వాన'లో మునక

>> వద్ద తోటలో పనిచేస్తుండగా పిడుగుపడి మహిళ మృతి చెందారు. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో ఈ నెలాఖరులోగా రుతుపవనాలు ప్రవేశిస్తున్నాయని, దీనితో రాష్ట్రంలోని పలు జిల్లాలో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున, ఏవిధమైన విపత్తులు జరుగకుండా ముందస్తు చర్యలను చేపట్టాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. తెలంగాణ రాష్ట్రంలో మే మాసాంతం వరకే రుతుపవనాలు ప్రవేశిస్తాయని వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో జిల్లాలకు ముందస్తు చర్యలపై రాష్ట్ర ప్రభుత్వ విపత్తుల నిర్వహణ (డిజాస్టర్ మేనేజ్మెంట్) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ తగు మార్గదర్శకాలను విడుదల చేశారు..గత 2024 ఆగస్టు మాసంలో వచ్చిన భారీ వర్షాలతో సకాలంలో ఎన్డీఆర్‌ఎఫ్ దళాలు చేరుకోక పోవడంతో జరిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని, ముందస్తుగానే ఈసారి 12 స్టేట్ డిసాస్టర్ రిలీఫ్ ఫోర్స్ (ఎస్‌డిఆర్‌ఎఫ్)లను సిద్ధంగా ఉంచామని తెలిపారు. ఒక్కో టీమ్‌లో తెలంగాణా స్పెషల్ పోలీస్‌కు చెందిన 100 సుశిక్షితులైన పోలీసులు ఉంటారని, ఈ బృందాలను రాష్ట్రంలోకి పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని చెప్పారు. తద్వారా, ఎక్కడైనా భారీ వర్షాలు, తుఫానులు వచ్చినా, వెంటనే సమీపంలోని ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు చేరుకుంటాయని కలెక్టర్లకు స్పష్టం చేశారు. దీనితో పాటు, ఈ సారి 3 ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు హైదరాబాద్ లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భారీ వర్షాలు వచ్చే జిల్లాల్లో ఈసారి ప్రత్యేకంగా అదనపు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ఎన్‌డిఆర్‌ఎఫ్‌కు విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఉన్న అన్ని ఫైర్ స్టేషన్లలో ఫైర్ సిబ్బందికి ప్రత్యేకంగా విపత్తుల నివారణ చర్యలపై శిక్షణను ఇప్పించామని అన్నారు. హైదరాబాద్ తోపాటు శివారు ప్రాంతాలకు తక్షణమే స్పందించేలా హైడ్రా బృందాలను ఏర్పాటు చేసాం. భారీ వర్షాలు, ఆకస్మిక వర్షాలు వస్తే నష్టాలను తగ్గించడానికి పై చర్యలు ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. భారీ వర్షాలు, వరదలు వచ్చే అవకాశముంటే, సంబంధిత జిల్లాలకు కేటాయించిన ఎస్‌డిఆర్‌ఎఫ్,ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలతో టచ్‌లో ఉండాలని ఆయా బృందాల వివరాలు సంబంధిత అధికారులకు కూడా ఇవ్వాలని సూచించారు. అప్పటికప్పుడు జిల్లా కలెక్టర్లు తమ జిల్లాల ఫైర్ ఆఫీసర్లతో సంప్రదిస్తూ, స్టేట్ డిజాస్టర్ ఫోర్స్ సేవలను పొందాలని, అత్యవసర పరిస్థితుల్లో ఎన్‌డిఆర్‌ఎఫ్ సేవలు కావాలంటే స్టేట్ డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖతో టచ్ లో ఉండాలని పేర్కొన్నారు. విపత్తుల నివారణలో సుశిక్షితులైన సింగరేణి కాలరీస్ సిబ్బంది సేవలను కూడా ఉపయోగించుకోవాలని సూచించారు. తమ జిల్లాలోని వరదలు, వర్షాల వల్ల ముంపు ప్రాంతాలు, ఇతర సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సాధించాలని జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాలు జారీచేశారు.

# కృష్ణా జలాల కోసం న్యాయ పోరాటం

>> డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టు పనులు మొదలు పెట్టగా దాన్ని గత బి ఆర్ ఎస్ పాలకులు రద్దుచేసి మేడిగడ్డ, కాళేశ్వరం పేరుతో 10 ఏళ్ల కాలయాపన చేస్తూ లక్ష కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆయన అన్నారు. ఆ నిధులతో కృష్ణా నదిపై భీమా, నెట్టెంపాడు, కోయిల సాగర్, కల్వకుర్తి, డిండి, ఎస్ ఎల్ బి సి టన్నెల్ దాంతోపాటు గోదావరిపై దేవాదుల, సీతారామ ప్రాజెక్టులు పూర్తి పూర్తిచేసే అవకాశం ఉండేది అని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి కి కృష్ణా జలాలలో నీటిని కేటాయించకపోయినప్పటికీ గత ప్రభుత్వం మౌనంగా ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అనంతరం నీటి కేటాయింపు కోసం తీవ్రంగా పోరాడుతున్నామని తెలిపారు. నక్కగూడెం లిఫ్ట్ ఇరిగేషన్ 2012లో పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందజేశామని, 2018 నుంచి మరమ్మతులు చేయకుండా ఆ పథకాన్ని పక్కకు పెట్టడంతో రైతాంగం ఇబ్బందులు పడిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో మళ్లీ 37.70 కోట్ల రూపాయలతో నక్కగూడెం ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. నక్కగూడెం ఎత్తిపోతల పథకం పూర్తి అయితే చింత్రియాల, కిష్టాపురం, తమ్మారం గ్రామాల పరిధిలోని 3200 ఎకరాలు సాగులోకి వస్తుందని తెలిపారు. ఈ పథకాన్ని వచ్చే ఆగస్టు నాటికి పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. దీనిలో భాగంగా భూమి కింద వేసిన పైపులకి కూడా రైతులకి నష్టపరిహారం అందించామని తెలిపారు. ఇక ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి ఇందిరా గాంధీ ఎత్తిపోతల పథకంగా నామకరణం చేసినట్లు తెలిపారు. ఈ పథకం నిర్మాణ కోసం 1450 కోట్లు మంజూరు చేశామని, ఈ స్కీం ద్వారా మూడు మండలాల్లోని 53 వేల ఎకరాలకు సాగునీటిని అందించే లక్ష్యంతో ఈ పథకం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం పూర్తి అయితే మఠంపల్లి మండలంలోని 20,500 ఎకరాలు, మేళ్లచెరువు మండలంలోని 15,800 ఎకరాలు, చింతలపాలెం మండలంలోని 16, 700 ఎకరాలు సాగులోకి వస్తాయని వివరించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ పథకాన్ని వచ్చే ఏడాది ఆగస్టు నాటికి పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ ని ఆయన ఆదేశించారు. ఈ పథకం పూర్తి అయితే నాగార్జునసాగర్ లో నీరు లేకపోయినా కృష్ణా నది నుంచి నీటిని ముక్త్యాల కాలువలోకి ఎత్తిపోసి రైతులకి సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. 394 కోట్లతో రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తయితే మేళ్లచెరువు, కోదాడ, హుజూర్నగర్, చింతలపాలెం, చిలుకూరు, మండలాల పరిధిలోని 12 గ్రామాలకు చెందిన 14,100 ఎకరాలు సాగులోకి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకం కూడా వచ్చే ఏడాది మే నెల నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సంబంధిత కాంట్రాక్టర్ ని ఆదేశించారు మొత్తం ఈ మూడు పథకాల ద్వారా కోదాడు హుజూర్నగర్ నియోజకవర్గంలోని 71,000 ఎకరాలు సాగులోకి రావటమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా ఇరిగేషన్ పథకాలకి సంబంధించి భూ సేకరణ జరిగితే భూమి అందించిన రైతులకి న్యాయబద్ధంగా వెంటనే నష్టపరిహారాన్ని అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ మూడు లిఫ్ట్ ఇరిగేషన్లకు సంబంధించి భూసేకరణ చేసేందుకు అధికార యంత్రాంగానికి రైతులు సహకరించాలని కోరారు. భూసేకరణ విషయంలో స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా ప్రజలకి పథకాల ఉపయోగాన్ని వివరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ సి ఈ రమేష్ బాబు, ఎస్ ఈ శివధర్మ తేజ, హుజూర్నగర్ ఆర్డీవో శ్రీనివాసులు, డి ఇ లు చారి, హరి కిషోర్, తహసిల్దార్ సురేందర్ రెడ్డి, ఎంపీడీవో భూపాల్ రెడ్డి తో పాటు పలువురు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బుద్ధి చెప్పడంలో ప్రధాని వెనకడుగు



రాజీవ్‌వర్ధంతి సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ఆయన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్, పిసిసి చీఫ్ మహేష్ కుమార్, విహెచ్ తదితరులు

>> ధ్వజమెత్తారు. బుధవారం భారతరత్న, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా సెక్రటేరియట్ ఎదురుగా ఆయన విగ్రహానికి సిఎం వంత్‌రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీని స్మరించుకోవడమంటే. తీవ్రవాదం మీద పోరాటం చేయడమేనని అన్నారు. దేశ అభ్యున్నతి కోసం దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ చేసిన కృషిని ఎన్నటికీ మరిచిపోలేమని అన్నారు. రాజీవ్ గాంధీ దేశ ఆర్థిక, సాంకేతిక, యువజన సాధికారత రంగాల్లో చేసిన కృషిని కొనియాడారు. రాజీవ్‌గాంధీ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు భారతదేశాన్ని బలమైన ఆర్థిక శక్తిగా నిలబెట్టాయని, 18 ఏళ్ల వయస్సు నుంచి యువతకు ఓటు హక్కు కల్పించి ప్రభుత్వ ఏర్పాటులో వారి భాగస్వామ్యాన్ని పెంచారని రేవంత్ అన్నారు. రాజీవ్ గాంధీ దేశ ఆధునికీకరణకు, ముఖ్యంగా సాంకేతిక రంగంలో చేసిన సేవలు ఎప్పటికీ మర్చిపోలేనివని అన్నారు. ప్రధానిగా దేశానికే వన్నె తెచ్చిన మహా నాయకుడు రాజీవ్ గాంధీ ఆర్థిక సరళీకృత విధానాలతో దేశాన్ని బలమైన ఆర్థిక దేశంగా నిలబెట్టారని చెప్పారు. సచివాలయం దగ్గర రాజీవ్ గాంధీ విగ్రహ ఏర్పాటుపై ఇదివరకు ప్రతిపక్షాలు విమర్శలు చేశాయని, తాము అధికారంలోకి వచ్చాక ఆ విగ్రహాన్ని తీసేస్తామని అన్నారని బిఆర్ఎస్ నేతల వ్యాఖ్యలను ప్రస్తావించారు. సంకుచిత మనస్తత్వంతో కొందరు రాజీవ్ గాంధీని విమర్శిస్తున్నారని బిజెపి నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం కోసం త్యాగం చేసిన కాంగ్రెస్ పార్టీ, గాంధీ కుటుంబం గొప్పతనాన్ని ఎవరూ తిరస్కరించలేరని పేర్కొన్నారు. పహల్గామ్ సంఘటన తర్వాత మోడీకి మద్దతుగా నిలబడ్డాం.. రాహుల్ గాంధీ, ఖర్గే, దేశ ప్రజలు మోడీకి అండగా ఉన్నారు. కానీ దురదృష్టవశాత్తు కేంద్రం అమెరికా అధ్యక్షుడు ఒత్తిడికి లొంగిపోయింది. వచ్చిన అవకాశం చేజార్చుకున్నారు మోడీ, ట్రంప్‌కి మోడీకి తలొగ్గారని పేర్కొన్నారు. పహల్గామ్ టెర్రర్ తరువాత దేశంలో తొలిసారి తిరంగా ర్యాలీ చేసింది తామేనని రేవంత్ తెలిపారు. రాజకీయాలను పక్కన పెట్టి ఆపరేషన్ సిందూర్ విషయంలో మోడీ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజల తరపున తాము సంపూర్ణ మద్దతు ప్రకటించామన్నారు. కేంద్ర మంత్రిగా ప్రధానికి అండగా నిలబడాల్సిన సమయంలో కిషన్ రెడ్డి బయటకు రాలేదు, దుప్పటి కప్పుకుని పడుకుందని ఎద్దేవా చేశారు..మేం బయటకు వచ్చి కేంద్రానికి అండగా ఉన్నామని ప్రకటించి మద్దతు తెలిపామన్నారు. ఆనాడు కనీసం మమ్మల్ని అభినందించని వ్యక్తి ఇవాళ రాహుల్ గాంధీని విమర్శిస్తున్నారని, తన చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే కిషన్ రెడ్డి రాహుల్ గాంధీపై విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇందిరా గాంధీ ప్రధాని ఉన్నప్పుడు పాకిస్థాన్ తో యుద్ధం చేశారని, అమెరికాతో పాటు అగ్ర దేశాలు భారత్‌పై ఒత్తిడి తీసుకొచ్చాయని, ఎక్కడా కూడా ఇందిరా గాంధీ తలొగ్గలేదని గుర్తు చేశారు. యుద్ధం చేసి పాక్‌పై గెలిచిన ధీరశాలిగా దివంగత ప్రధాని ఇందిరా గాంధీ అని ప్రశంసించారు. పహల్గామ్ ఘటన నేపథ్యంలో ఆనాటి ప్రధాని ఇందిరమ్మ స్ఫూర్తిని దేశంలో ప్రతీ ఒక్కరు గుర్తు తెచ్చుకున్నారు తీవ్రవాదుల ముసుగులో దేశ పౌరులపై దాడులకు తెగబడితే ఆనాడు ఇందిరమ్మ పాకిస్థాన్ కు గట్టి గుణపాఠం చెప్పారు. మా దేశాన్ని మేం రక్షించుకోగలుగుతాం.. ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదని ఇందిరమ్మ ఆనాడే స్పష్టం చేశారని పేర్కొన్నారు. కానీ ప్రస్తుతం పహల్గామ్ ఘటనలో పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పడంలో ప్రధాని వెనకడుగు వేశారు ట్రంప్ చెబితే కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ చేసిన పరిస్థితి ఇప్పటి కేంద్ర ప్రభుత్వానిదని వ్యాఖ్యానించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన చరిత్ర గాంధీ కుటుంబానిది, కాంగ్రెస్ పార్టీదని పేర్కొన్నారు. దేశ రక్షణ కోసం భారత జవాన్లకు అండగా నిలబడతాం.. అది మా బాధ్యత... దేశ సమగ్రత విషయంలో మేం రాజకీయాలు చేయం.. దేశ భద్రతకు మేం కట్టుబడి పనిచేస్తామని చెప్పారు.

## సిరాజ్, సమీర్ ప్లాన్

>> తేలింది. బాంబులు తయారు చేయడంతో పాటు ఒకవేళ పోలీసులు ఎక్కడైనా తమ వర్గానికి చెందిన ప్రార్థనా స్థలలాను కూల్చాలని ప్రయత్నిస్తే వారిపై రాకెట్ లాంచర్లను వాడాలని ఇద్దరు ఉగ్రవాదులు నిర్ణయించారు. ఇందుకోసం రాకెట్ లాంచర్లను ఎలా తయారు చేయాలనే దాని పై వీరిద్దరు ఐసిస్ పెద్దలతో చర్చించారని తెలిసింది. దీని గురించి కూడా యూ ట్యూబ్‌లలో గల వీడియోల నుంచి కొంత సమాచారాన్ని ఇద్దరు సేకరించినట్లు పోలీసులు గుర్తించారు. కాగా సమీర్, సిరాజ్‌ల బ్యాంకు ఖాతాల్లో భారీగా వున్న నగదు విదేశాల నుంచి వచ్చినట్లు తేలడంతో వీటిని పంపిన వారి కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు.

**తమ ఉపన్యాసాలపై ఆకర్షితులవుతున్న వారిని ఉగ్రవాదులుగా మార్చేందుకు కొత్త వేదిక ఏర్పాటు**

ఇదిలావుండగా సిరాజ్, సమీర్‌లు ఐసిస్ ఉగ్రవాదులుగా వుండగా తమతో పాటు మరికొందరు యువకులను ఉగ్రవాదులుగా మార్చేందుకు అల్ హింద్ ఇత్తేహాదుల్ ముసల్మీన్ (అహిం) పేరిట ఒక సంస్థను ఏర్పాటు చేశారు. వాస్తవంగా అహింను పాక్‌లోని కొందరు ఉగ్రవాదులు ఐసిస్ ఉగ్ర లింకులున్న వారితో కలిసి ఏర్పాటు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఐసిస్ ఉగ్ర లింకులు భారత్‌లో తరచూ వెలుగు చూస్తున్నా వీరికి పెద్దగా నెట్ వర్క్ లేదనే చెప్పాలి. పూణే సహ రెండు చోట్ల బాంబు పేలుళ్లకు పాల్పడడం, మధ్యప్రదేశ్‌లో ఓ రైలులో పేలుడుకు పాల్పడి సెల్‌ఫోన్‌లో లైవ్‌లో ఈ దృశ్యాలను సిరియాలోని ఐసిస్ అగ్ర నేతలకు ఇక్కడి ఉగ్రవాదులు గతంలో చూపారు. అయితే ఇందులో కొందరు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. ఐసిస్ కనుమరుగవుతున్న తరుణంలో సిరాజ్, సమీర్‌ల రూపంలో మళ్లీ పురుడు పోసుకోవడం పోలీసులకు షాక్‌కు గురిచేసింది. వీరితో పాటు ఎందరున్నారనే దానిపై విచారణ సాగుతోంది.

## మహారాష్ట్రలో 106 మందికి కొవిడ్, ఇద్దరు మృతి

**ముంబయి, మే 21:** దక్షిణాసియాలో కొవిడ్19 మళ్లీ విజృంభిస్తోంది. భారత్‌లోనూ కరోనా వైరస్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం దేశంలో 257 యాక్టివ్ కేసులు నమోదైనట్లు ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. అయితే, మరణాలు కూడా సంభవిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి మహారాష్ట్రలో ఏకంగా వందకుపైగా పాజిటివ్ కేసులు నిర్ధారణ అయినట్లు ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. మొత్తం 6,066 స్వాబ్ టెస్టులు చేయగా 106 కేసులు పాజిటివ్‌గా తేలినట్లు చెప్పారు. అందులో కేవలం 101 మంది ముంబైకి చెందిన వారే ఉండటం గమనార్హం. మిగిలిన వారు థానే, పూణె, కొల్హాపూర్‌కు చెందిన వారుగా తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 52 పాజిటివ్ కేసులు ఉన్నట్లు వెల్లడించారు. వీరిలో 16 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. జనవరి నుంచి రెండు కొవిడ్ సంబంధిత మరణాలు కూడా నమోదైనట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ ప్రకటించింది. మరణించిన వారిలో ఒకరు క్యాన్సర్ రోగి అని పేర్కొంది.

# వికసిత్ భారత్ యొక్క
## అమృత్ స్టేషన్లు



**ప్రారంభము**

భారతదేశం అంతటా **103** అమృత్ స్టేషన్లను పునరాభివృద్ధి చేశారు.

**వీటితో కలుపుకొని**



## 3 తెలంగాణలో అమృత్ స్టేషన్లు



బేగంపేట్



వరంగల్



కరీంనగర్

### లాభాలు

- రూఫ్ ప్లాజా, రిటైరింగ్ రూమ్, విశాలమైన సర్క్యులేటింగ్ ఏరియా వంటి సౌకర్యాలతో స్టేషన్లను సిటీ సెంటర్లుగా అభివృద్ధి చేశారు.
- విరసత్ భీ వికాస్ భీ - స్థానిక వాస్తుశిల్పం నుండి ప్రేరణ పొందిన స్టేషన్ భవనాల నమూనాలు
- ప్రత్యేక ఎంట్రీ మరియు ఎగ్జిట్ గేట్లు, మెరుగైన పార్కింగ్, లిఫ్ట్, ఎస్కలేటర్, ఎగ్జిక్యూటివ్ లాంజ్, వెయిటింగ్ ఏరియా, ట్రావెలేటర్ మరియు దివ్యాంగజన స్నేహపూర్వక సౌకర్యాల ఏర్పాటు.
- ఈ స్టేషన్లు మల్టీ-మోడల్ కనెక్టివిటీ ఇంటిగ్రేషన్ తో ఈ ప్రాంత సామాజిక-ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా మారతాయి.
- పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడానికి ఉపయోగించే శక్తి సామర్థ్యం మరియు పర్యావరణ అనుకూల చర్యలు

# నరేంద్ర మోదీ
## ప్రధానమంత్రి

చేత

(వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా)

**గురువారం 22 మే, 2025 ఉదయం 10:30 గంటలకు**

వీరి గౌరవ సమక్షంలో

**జిష్ణు దేవ్ వర్మ**
గవర్నర్, తెలంగాణ

**అనుముల రేవంత్ రెడ్డి**
ముఖ్యమంత్రి, తెలంగాణ

**అశ్విని వైష్ణవ్**
కేంద్ర రైల్వేలు, సమాచార & ప్రసారాలు మరియు ఎలక్ట్రానిక్స్ మరియు సమాచార సాంకేతిక శాఖ మంత్రి

**అర్జున్ రామ్ మేఘవాల్**
కేంద్ర చట్టం & న్యాయం సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) మరియు పార్లమెంటరీ వ్యవహారాలు

## ఇండియన్ రైల్వేస్

DD NEWS ఈ కార్యక్రమాన్ని DD న్యూస్లో ప్రత్యక్ష ప్రసారంలో చూడండి

www.indianrailways.gov.in

మమ్మల్ని ఫాలో అవ్వండి /RailMinIndia

వార్త


అనవసరమయిన అవసరాలను అంతం లేకుండా పెంచుకుంటూ పోవడమే నాగరికత.

-మార్క్‌ట్వయిన్

# కరి ఘీంకారానికి కళ్లెం!

వజ్రాన్ని వజ్రంతోనే కోయాలంటారు. అలాంటి ఐడియాతోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం ఒక పెద్ద సమస్యను ఎలాగైనా నివారించాలని కంకణం కట్టుకోవడం విశేషం. రాష్ట్ర సరిహద్దులోని రైతుల్ని కునుకు లేకుండా చేస్తున్న ఏనుగుల బెడదను నివారించేందుకు అటవీ శాఖ అధికారులు ఒక ఐడియాను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెవిలో చెప్పగానే గత ఏడాది ఆయన ఆఘమేఘాల మీద కర్ణాటక ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి కుంకీ ఏనుగుల కోసం ఒప్పందం చేసుకున్నారు. మదమెక్కిన ఏనుగులను దారికి తేవాలంటే ఈ కుంకీ ఏనుగుల వలనే సాధ్యమోతుంది. ఆంధ్రప్రదేశ్‌లో చిత్తూరు జిల్లాలో పలమనేరు, రామకుప్పం, శాంతిపురం మండల గ్రామాలకు ఏనుగుల బెడదఅధికం. అలాగే పార్వతీపురం జిల్లాలోనూ ఏనుగులు పంటలను ధ్వంసం చేయడం, జనావాసాల్లోకి రావడంతో రైతాంగం ఆందోళన అంతా ఇంతా కాదు. ఆ గజరాజులను కట్టడి చేసేందుకు ఇంతకన్నా మంచి మార్గం లేకపోవడంతో ప్రభుత్వం ఆ వైపు దృష్టి సారించడం తప్ప వేరే గత్యంతరం లేకపోయింది. చిత్తూరు జిల్లాలోని కౌండిన్య అభయారణ్యం నుంచి ఈ మధ్య కాలంలో ఎన్నో ఏనుగులు గుంపులు గుంపులుగా వచ్చి పొలాల మీదపడి భయభ్రాంతులను చేశాయి. రెండు గుంపులుగా ఏనుగులు ఊరి మీద పడుతున్నాయి. ఒక గుంపులో 23 ఏనుగులు, మరో గుంపులో 13 ఏనుగులు రెండూ వేర్వేరు సమయాల్లో దాడి చేస్తాయని పరిశీలకులు చెబుతున్నారు. ఇలా ఆ గుంపు ఏనుగులు తమ పొలాలను విధ్వంసం చేసినప్పుడల్లా రైతులు నరకయాతన పడుతున్నారు. వారికి ఏర్పడిన ఆర్థిక నష్టాలు అన్నీ ఇన్నీ కావు. చెప్పనలవి కాదు. ఏనుగుల వల్ల పంటల ధ్వంసం ఇతరత్రా, రైతు సమస్యలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అటవీశాఖ ఉన్నతాధికారులతో చర్చించిన క్రమంలో కుంకీ ఏనుగుల గురించి ఓ ఐడియా తళుక్కున మెరిసింది. అయితే ఆ వెంటనే కర్ణాటక ప్రభుత్వానికి రిక్వెస్ట్ చేశారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, అటవీ శాఖమంత్రులతో సంపాదించడమే కాదు వెళ్ళి కలిసారు కూడా. దాంతో పని సానుకూలపడింది. కుంకీ ఏనుగులతో పాటు, శిక్షణ పొందిన మావటీలను కూడా పంపేందుకు ఒప్పందం కుదిరింది. కాస్త ఆలస్యమైనా అది ఇన్నాళ్లకు కుదిరింది. బుధవారం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు 6 కుంకీ ఏనుగులను అప్పగించారు. వీటి విడిది కోసం పలమనేరు వద్ద మొసలి మడుగులో 50 ఎకరాల విస్తీర్ణంలో ఎలిఫెంట్ హబ్‌ను ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మావటీలను కూడా నియమించారు. ఇది ఈనాటి సమస్య కాదు. ఇన్నాళ్లూ రైతాంగానికి పరిష్కారం దొరకలేదు. తాజాగా ఉన్న సూచనలు సలహాలు మేరకు ఒక ప్రయత్నం జరిగింది. మానవేతర జాతులలో ఇలా అవే జాతిజీవులు లొంగదీసుకునే విధానాలు అవలంబిస్తున్నారు. కుంకీ ఏనుగులతో సమస్య పరిష్కారమవుతుందని, గతంలో ఇలాంటి ఆలోచన ఎప్పుడూ వచ్చినట్లు లేదు. ఏదైనా ఒక ఆలోచన మదిలో మెదలడం వెంటనే అటవీ అధికార గణం, ఆ శాఖమంత్రి నేతృత్వంలో ముందుకు కదలడమూ జరిగాయి. పొలాల్లోకి, నివాస ప్రాంతాల్లోకి వచ్చే ఏనుగుల గుంపును తిరిగి అడవుల్లోకి పంపించేందుకు అటవీశాఖ దగ్గర కుంకీ ఏనుగుల కొరత ఉందని అధికారులు ఇవన్నీతనకు అడవుల మీద, పర్యావరణం మీద ఉన్న అవగాహన వల్లనే చెప్పగలుగుతున్నానని అటవీశాఖ మంత్రి వివరించారు. అడవులపై తనకున్న అవగాహనతో కర్ణాటకలో కుంకీ ఏనుగులు ఉన్నాయని, అక్కడి నుంచి ఈ ఏనుగుల్ని తెచ్చుకుంటే ఈ సమస్యను అధిగమించవచ్చునని భావించారు. ఆ రాష్ట్రం నుంచి ఆ తరహా ఏనుగులు తీసుకువస్తే విద్యుత్ ఫెన్సింగ్ వేసుకొనే విధానాలు విడిచి పెట్టవచ్చునని దాని వల్ల జీవహింస అపవాదు నుంచి బయటపడే అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు సాగుతున్న జీవహింసకు చెక్‌పెట్టే నిర్ణయం కావడం ప్రశంసనీయం. చెప్పుకోదగిన విషయమేమిటంటే కుంకీ ఏనుగుల సంరక్షణ బాధ్యతను తనే స్వయంగా పర్యవేక్షించుకుంటానని గతంలో ఏనుగుల బెడదతో జరిగిన ప్రాణ, ఆస్తి నష్టాలు ఇకపై జరగకూడదని తాను ఆశిస్తున్నానని పవన్ కళ్యాణ్ అంటున్నారు. ఏనుగులను లొంగదీసుకోవడానికి శిక్షణ పొందిన కుంకీ ఏనుగుల్ని మాత్రమే ఉపయోగిస్తారు. కాగా ఏపీలో జయంత్, వినాయక అనే రెండు ఏనుగులను కౌండిన్య అడవుల్లోని సంరక్షణ కేంద్రంలో ఉంచారు. మగ ఏనుగులను మాత్రమే కుంకీలుగా ఎంచుకుంటారు. మగ ఏనుగులు ఒంటరిగా తిరుగాడుతుంటాయనే వాటిని ఎంపిక చేసుకుంటారు. కుంకీగా ఉన్న మగ ఏనుగు రాగానే అక్కడి నుంచి ఆడ ఏనుగులు తప్పుకుంటాయి. కొన్ని సందర్భాల్లో ఏనుగులు పంటలపై దాడి చేస్తే.. వాటిని తరిమికొట్టడం కష్టమేనని చెప్పాలి. కుంకీ ఏనుగులు పంటలపై దాడి చేస్తున్న ఏనుగులతో పోరాడగలుగుతాయి. అడవిలో తిరిగే ఏనుగును కుంకీగా మార్చడానికి ఏనుగుపై మావటి కూర్చుని శిక్షణ ఇస్తారు. ఏవైనా అడవి జంతువులు వచ్చినపుడు గట్టిగా ఘీంకరించి భయపెట్టడంలో కూడా శిక్షణ ఇస్తారు. జనావాసాల్లో సంచరిస్తూ ప్రాణహానికి కారణమయ్యే కోతులు, కొండముచ్చులు, ఎలుగు బంట్ల బెడద నుంచి ప్రజల్ని కాపాడటానికి కూడా మార్గాన్వేషణ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. వీటి విషయంలో ప్రత్యేక నిపుణులతో అధ్యయనం చేయించాలి.

మీ ఆలోచనలు సదాచారమార్గం నుంచి మిమ్మల్ని దూరం చేసే సంకేతాలను ఇస్తున్నాయంటే దురదృష్టం మీకై కాచుకు కూర్చుంది అని భావించండి.



తిరుక్కురళ్

మనం ఇతరుల కోసం ఏం చేస్తామో అది మన శక్తికి నిదర్శనం. మనం ఇతరుల కోసం ఏ బాధల్ని అనుభవిస్తున్నామో అది మన ప్రేమకు నిదర్శనం.



జిబిఎస్ డబ్ల్యు కాట్

# ప్రజావాక్కు



## కలియుగ ప్రభావమా?

ఈ మధ్య ఓ సీనియర్ ఆదాయపు పన్ను అధికారి డబ్బై లక్షల రూపాయలు లంచం తీసుకుంటూ పట్టుబడితే, ఎన్ ఫోర్సుమెంటు డైరక్టరేట్‌లో పనిచేసే మరో సీనియర్ అధికారి ఏకంగా రెండుకోట్లు లంచం డిమాండ్ చేసారట. లంచాలుతీసుకునే వారిని వలవేసి పట్టుకునే వారే వలలో పడుతున్నారు. భగవంతుడు మాత్రమే దశావతారాలను ఎత్తాడని చదువుకున్నాం. లంచావతారులు లేని వ్యవస్థను ఎవరైనా చూపగలరా? ఎన్నివ్యాపారాలు చేసినా ఎవరినీ ఏమోసమూ చేయకుండా వందల వేలలక్షల కోట్ల రూపాయలనుమూటగట్టగలరా? అసాధ్యమనిపించాట్లా? అంతులేని అవినీతే దేశాభివృద్ధికి అవరోధం కలుగజేస్తోంది. కట్టిన కొద్దికాలానికే కూలిపోతున్న నిర్మాణాలు నిత్యం ఎన్నో చూస్తున్నాము. ఎన్నో అవినీతితిమింగలాలు వలలో చిక్కుతున్నాఇంకా తరగడంలేదు. ఇది కలియుగ ప్రభావమా?

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ఉద్యోగులు విశ్వసనీయత పెంచుకోవాలి

ఇటీవల అఖిల భారత సర్వీసు ఉద్యోగులు తమ వృత్తికి కళంకం తెస్తూ రాజకీయ నాయకుల మెప్పు పొందడానికి శత విధాల ప్రయత్నం చేస్తూ తమ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతూవున్నారు. గతప్రభుత్వంలో సిద్దిపేట పాలనాధికారిగా ఉన్న వ్యక్తి అప్పటి సిఎంకు పాదాభివందనం చేయడం చర్చనీయాంశంఅయింది. తర్వాత వారు ఎంఎల్‌సి కావడం జరిగింది. ప్రస్తుతం కూడా ఒకజిల్లా పాలనాధికారి ముఖ్యమంత్రికి పాదాభివందనం చేయడం చర్చ నీయాంశమైంది. వారి గురు భక్తికి అందరూ షాక్‌కు గురి అయ్యారు. పెద్ద హోదాలో ఉన్నవారు రాజకీయ నాయకులను ప్రసన్నం చేసుకోవడం వారి అడుగులకు మడుగులు ఒత్తడం మన పాలనా వ్యవస్థ పని తీరుకు అద్దం పడుతూ ఉంది.

-కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్, భూపాల్ పల్లి జిల్లా

## ఆయకట్టు స్థిరీకరణ

ఇప్పటికే సీతారామ ప్రాజెక్ట్‌తో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆయకట్టుకు నీరు అందించడంతో పాటు సరికొత్త ఆయకట్టును సాగులోకి తేవడంతో పాటు ఆయకట్టు స్థిరీకరణ చేయడంతద్వారా సరికొత్త రూపు రేఖలను ఖమ్మం జిల్లాకు అందించడం సాధ్యం అవుతుంది. ఇవన్నీ గత ప్రభుత్వం తెచ్చిన ప్రపోజల్స్ అని గుర్తుపెట్టుకోవాలి.

-భారత అవినాష్, జనగామ

## ఉపాధ్యాయులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

2023, 2025లో వరుసగా రెండుసార్లు రేషనలైజేషన్‌కి గురి అయినటువంటి ఉపాధ్యాయులకు ప్రీవియస్ 8 సంవత్సరాల స్టేషన్ పాయింట్లు కేటాయించాలి. రేషనలైజేషన్ గురైన వారం దరికిపాతస్టేషన్ పాయింట్లు తోపాటు అదనంగా 5 పాయింట్లు ఇవ్వాలి. వరుసగా రెండుసార్లు రేషనలైజేషన్‌కి గురి అయినటువంటి ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఈ బదలీల్లో ప్రస్తుత స్టేషన్ పాయింట్లు తోపాటు అదనంగా ఏడు పాయింట్లు ఇస్తున్నది. గతంలో 2023లో జీఓ 117అమలు వల్ల ఒకసారి రేషనలైజేషన్ గురయ్యారు. అదేవిధంగా ఇప్పుడు రిస్ట్రక్చర్‌వల్ల 2025లో ఇంకోసారి గురవుతున్నారు. వరుసగా రెండుసార్లు రేషనలైజేషన్‌కి గురి అయినటువంటి ఉపాధ్యాయులకి స్టేషన్ సీనియారిటీపాయింట్ రెండు సంవత్సరాలు పాయింట్లు మాత్రమేవస్తున్నాయి. అటువంటి ఉపాధ్యాయులకుస్టేషన్ పాయింట్లు రెండు సంవత్సరాలకు, ఏడుఅదనపు పాయింట్లు వచ్చినందు వల్ల, తక్కువ పాయింట్లు వస్తాయి. కాబట్టి ప్రభుత్వం వాళ్ళకి ప్రస్తుతం పనిచేస్తున్నప్పటి నుంచి ప్రీవియస్ 8సంవత్సరాలు పాయింట్స్ ఇవ్వాలి. ఇలా ప్రభుత్వం వారికి న్యాయం చేయాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

## యోగాకు విస్తృత ప్రచారం

జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విస్తృత ప్రచారం కల్పించే నిమిత్తం ఏపి ప్రభుత్వం మే 21 నుంచి జూన్ 21వరకు యోగా మాసం ప్రకటించింది. విశాఖ పట్నంవేదికగా జరిగే11వ యోగ దినోత్సవంలో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. గిన్నిస్ రికార్డు లక్ష్యంగా ఈ కార్యక్రమం ఏర్పాటుకు కార్యాచరణ చేయడం అభినందనీయం. నేడు యోగ ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తిస్తున్నారు.

-చల్లా చంద్రశేఖర్ రెడ్డి, కలువాయి, నెల్లూరు జిల్లా

## సుప్రీం తీర్పు అమోఘం

జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి స్టోర్‌రూంలో కట్టల కట్టల నగదు తగలబడుతున్న స్థితిలో బయటపడిన వీడియోల తరువాత సుప్రీంకోర్టు స్పందించిన తీరుఅమోఘం. ఈ వ్యవహారానికి సంబంధించిన అన్ని వివరాలను సుప్రీంకోర్టు తన వెబ్‌సైట్‌లో పొందుపరచింది కూడా. సదరు న్యాయమూర్తిని అభిశంసన చేయాలని భారత ప్రధానన్యాయమూర్తి కేంద్రానికి విన్నవించటం ఆహ్వానించతగిన విషయం. జస్టిస్ యశ్వంత్ వర్మ న్యాయ వ్యవస్థకు కళంకం తెచ్చినవారే కాక తీవ్ర ద్రోహం చేశారు.

-కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# భూతలంపై జీవ వైవిధ్య సౌందర్యం నెలకొల్పాలి

*ప్రస్తుతం భూమిపై ఉన్న జీవరాశుల్లో సుమారు 800 కోట్లమంది మానవులే. వీరి మనుగడ, భూ వాతావరణంపై, భూమి పైన, భూమి లోపల నిక్షిప్తమైన వనరుల మీద ఆధారపడి ఉంది. భూమిపై నివసిస్తున్న మనకు భూమితో గల సన్నిహిత సంబంధాన్ని కాదనలేం. అలాంటి భూమి కోసం పర్యావరణాన్ని పరిరక్షించవలసిన బాధ్యత మనపై ఉంది. మానవ స్వార్థంతో పర్యావరణం విధ్వంసం కావడం, బయోడైవర్శిటీ దెబ్బతినడం వలన మనచుట్టూ ఆవరించబడి ఉన్న వాతావరణం అనేక మార్పులకు లోనౌతున్నది. ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. గ్లోబల్ వార్మింగ్ అంతర్జాతీయ సమస్యగా మారింది. ప్లాస్టిక్ పర్యావరణానికి పెను సమస్యగా మారింది. ప్రతీ ఏటా ప్రపంచంలో ప్లాస్టిక్, మైక్రో ప్లాస్టిక్ రూపాల్లో సుమారు 25కోట్ల టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలు వచ్చి చేరుతున్నాయి. ఇకనైనా ఈ ధోరణి మారాలి. సకల జీవరాశులు భూమిపై నివసించగలిగే వాతావరణం నెలకొల్పాలి.*



సుంకవల్లి సత్తిరాజు

అందరూ బాగుండాలి అందులో నేనుండాలి అనే నినాదంఅందరి నోళ్ళలో అను నిత్యం నానుతున్న అక్షర సత్యం. అయితే ఈ హితోక్తి వీనులవిందుగా, బహు పసందుగా ఉన్నా, ఆచరణకు మాత్రం చాలా మందికి బహుకష్టంగా మారింది. నేను మాత్రమే బాగుండాలి అందరూ అష్ట దరిద్రంలో కొట్టుకుపోవాలనే దుర్బుద్ధి ప్రస్తుత వ్యవస్థలో తాండవిస్తున్నది. స్వప్రయోజనాలకు ప్రాకులాడుతూ విశ్వమానవ కల్యాణానికి తిలోదకాలిస్తూ, సాటి మనుషుల ఉనికిని కూడా భరించలేనంత ఈర్ష్యాక్రోధాలు పెరిగిపోయి రోగగ్రస్థమైన ఆలోచనలతో రగిలిపోతున్న మనుషులున్న వర్తమాన ప్రపంచంలో ఇతర జీవరాశుల మనుగడ గురించి ఆలోచించగలరా? పరిస్థితులు అడ్డం తిరుగుతున్నాయి. మనచుట్టూ ఉంటూ, మనతో మమేకమై జీవిస్తున్న ఇతర జీవరాశులు మనుగడ సాగిస్తేనే మానవ మనుగడ కొనసాగుతుంది. లేకపోతే ఈ సువిశాలమైన భూగ్రహం సమీప భవిష్యత్తులో నిర్జీవంగా మారే అవకాశాలే అధికంగా ఉన్నాయి. స్పేస్ ఎక్స్ అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ చెప్పినట్టు, భూమికి మంగళం పాడి మంగళ గ్రహ పయనానికి సంసిద్ధంగా ఉండాలని చేసిన సూచన సాధ్యం కాకపోయినా, భూగోళం మాత్రం భవిష్యత్తులో మానవ ఆవాసానికి అయోగ్యంగా మారే అవకాశాలను తోసి పుచ్చలేం. ధరిత్రిపై మానవ అస్థిత్వం ప్రమాదంలో పడింది. కాలుష్యంతో వాతావరణంలో విపత్కర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. భూ ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. కాలాలు అదుపు తప్పుతున్నాయి. సంవత్సరమంతా ఎండలు మండి పోతున్నాయి. శీతల దేశాల్లో కూడా మంచు కరిగిపోయి, ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఈ పరిస్థితులను నిలువరించాలంటే మానవ తప్పిదాలను సరిదిద్దుకోవాలి. మానవ స్వార్థానికి కనీస పరిమితులు విధించుకోవాలి. మనతోపాటు ఇతర జీవరాశుల మనుగడకు భూమిపై కొంత చోటివ్వాలి. సమస్త సృష్టిలో జీవజాతుల మధ్య నెలకొన్న 'వైవిధ్యం' ప్రకృతి కల్పించిన గొప్పలక్షణం. ఒక జీవికి, మరొక జీవికి జీవించే విధానంలో వైవిధ్యం ఉంది. ఆహారపు అలవాట్లలో వైవిధ్యం ఉంది. మనుగడ కోసం సాగించే పోరాటంలో ఒక్కొక్క జీవి ఒక్కో విలక్షణమైన శైలిని కలిగి ఉంది. ప్రతీ జీవి, ఇతర జీవరాశులపై ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఆధార పడక తప్పదు. అదే ప్రకృతి విశిష్టత. అన్ని జీవరాశులు ప్రకృతిలో మమేకమై జీవించాలి. దురదృష్ట వశాత్తూ మానవ మేధస్సు ఇతర జీవరాశులపై ఆధిక్యత ప్రదర్శించడం వలన ఎన్నో జీవరాశులు తమ అస్థిత్వం కోల్పోయాయి. గతంలో ఈ భూమండలంపై జీవించిన పలు రకాల ప్రాణులు మానవ ప్రేరిత దుష్కృత్యాలతో అంతరించిపోయాయి. మరికొన్ని జీవరాశులు అంతర్థానానికి దగ్గరలో ఉన్నాయి. పంటపొలాల్లో పలు రకాల జీవజాతులు మనం వినియోగించే పురుగుమందులు, ఇతర రసాయనాల వలన నశించిపోతున్నాయి. కాలుష్య కారకాల వలన మనతో మమేకమై జీవించే అనేక ప్రాణులు అంతర్థానమై పర్యావరణానికి శాపంగా మారుతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి. భూ ఉపరితలం వేడెక్కి పోవడం, సముద్ర జలాలు కలుషితం కావడం వలన జరుగుతున్న పరిణామాలు భయంకరంగా ఉండబోతున్నాయి. ప్రపంచ జనాభా 8.2 బిలియన్లకు చేరుకుందని కొన్ని గణాంకాలు సూచిస్తున్నాయి. జనాభా విస్ఫోటనం ప్రకృతి పైన, పర్యావరణంపైన పెను ప్రభావం చూపుతున్నది. జనావాసాల కోసం అడవులను నరికివేస్తున్నాం. పెరిగే జనాభాకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి, ఉపాధి కోసం పచ్చదనాన్ని పెరికి పరిశ్రమలు నెలకొల్పుతున్నాం. వివిధ రకాల ప్రాజెక్టుల కోసం, రహదారుల కోసం పచ్చని భూములు



హరించుకుపోతున్నాయి. అక్కర లేకపోయినా ఆకాశ హర్మ్యాలు ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్నాయి. అనునిత్యం భూమిపై దాడి కొనసాగుతున్నది. పర్యావరణ సమస్యల వలన వేలాది జంతువులు, వృక్ష జాతులు అంతరిస్తున్న జాబితాలోఉన్నాయి. ఎన్నో రకాల కీటకాలు, పక్షులు, మొక్కల్లో 40 శాతం పైగా అంతరించిపోయే దశలో ఉన్నాయి. జీవులన్నీ ప్రకృతిలో మనతో పాటు జీవించే అవకాశాన్ని మనమే లేకుండా చేస్తున్నాం. జీవవైవిధ్యం మానవాళి మనుగడకు అవసరం. జీవ సమతుల్యత లోపిస్తే జరగబోయే పరిణామాలు మానవ వినాశనానికి దోహదం చేస్తాయి. 'ప్రకృతి' ఈ సమస్త సృష్టికి నిండైన అందాన్ని సమకూర్చి పెట్టింది. ఇలాంటి ప్రకృతిలో మానవులతో పాటు జంతుజాలం, వృక్షజాలం, క్రిమికీటకాలు, భౌతిక, రసాయనిక పదార్థాలు నిండి ఉన్నాయి. అరణ్యాలు, నదీనదాలు, పర్వతాలు, లోయలు, ఇతర అనేకమైన ఏర్పాట్లు సహజసిద్ధంగా నెలకొని ఉన్నాయి. ఇవన్నీ కేవలం ఒక భూగ్రహానికే పరిమితం కావడం భూగ్రహ వాసులుగా మనకు దక్కిన అరుదైన వరం. ఎన్నో వింతలతో, విచిత్రాలతో విభిన్న జీవరాశుల కలయికతో, వాటి మనుగడకు కావలసిన అనేకమైన సహజవనరులతో అద్భుతంగా ఏర్పడిన ధరిత్రిని సజీవంగా ఉంచడానికి నిరంతర కృషిజరగాలి. ఇతర గ్రహాలను పరిశోధించడం ఇతర గ్రహాల్లో జీవించడానికి అనువైన పరిస్థితుల కోసం అన్వేషించడం, సజీవమైన భూగ్రహాన్ని వదిలేసి, ఇతర గ్రహరాశులపై మక్కువ పెంచుకోవడం నేల విడిచి సాము చేయడమే. ఇతర గ్రహాలపై పరిశోధనలు చేయడాన్ని తప్పు పట్టలేం. కాని నివాసయోగ్యమైన భూమిని కాలుష్యంతో నింపేసి, భూవాతావరణాన్ని నాశనం చేసి, కోట్లాది జీవరాశులను ప్రాణ సంకటంలోకి నెట్టడంలో గల ఔచిత్యమేమిటో అర్థం కావడం లేదు. జీవవైవిధ్యం దెబ్బతినడంతో ప్రకృతిలో అనేక అవాంఛనీయ మార్పులు సంభవిస్తున్నాయి. మానవాళికి పలు రకాలుగా ఉపయోగపడే జీవసంపద మానవ స్వార్థచింతన వలన నశించిపోయింది. ఒకవైపు ప్రకృతి విధ్వంసం వలన భూవాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. కాలుష్యకారకాలు పెరిగిపోయాయి. పర్యావరణం దెబ్బతిన్నది. మనతో కలిసి జీవిస్తున్న జీవరాశులెన్నో ప్రకృతిలో చోటు చేసుకుంటున్న విపరీతమైన పోకడలకు నిలవలేక ఇప్పటికే అదృశ్యమైపోయాయి. ప్రకృతి విధ్వంసంవలన జీవవైవిధ్యంలోపించింది. జీవవైవిధ్యలోపమే హానికారకమైన వైరస్‌ల పుట్టుకకు మూల కారణం. సమస్యలకు మూల కారణాన్ని అన్వేషించి, కాలుష్య భరిత వాతావరణం నుంచి మానవాళిని కాపాడాలి. ప్రపంచ వ్యాప్తంగా భీతావహ వాతావరణాన్ని సృష్టిస్తున్న వైరస్‌లు మున్ముందు మరింత విజృంభించవచ్చు. రోగాలతో మృత్యు కౌగిట్లో చిక్కుకుని కాటికి పోయిన మానవ శవాల గుట్టలు శాస్త్ర విజ్ఞానానికే సవాలు విసురుతున్నాయి. జీవవైవిధ్యాన్ని హరించి, ప్రకృతితో చెలగాటమాడిన ఫలితమే సకల వైపరీత్యాలకు మూలకారణం. ప్రకృతిని నాశనం చేస్తున్న మానవుని విధ్వంసరచన అత్యంత ఆందోళనకరంగా ఉంది. మానవుడు బుద్ధిజీవి. అలాంటి బుద్ధిజీవి తను చేసిన తప్పిదాల వలన విగతజీవిగా మారుతున్నాడు. కాంక్రీటు అరణ్యాల్లో గిరిగీసుకుని హాయిగా బ్రతికేస్తున్నామనుకున్న మానవులు తాము తమ స్వార్థం కోసం పర్యావరణానికి హానిచేస్తూ, కాలుష్యాన్ని వెదజల్లుతూ, హానికారకమైన వైరస్‌లతో సహజీవనం చేస్తున్నామన్న విచక్షణ మరచిపోయారు. నీటి కాలుష్యం, వాయు కాలుష్యం వలన మనుషులతో పాటు అనేక జీవరాశులు ఇబ్బంది పడుతున్నాయి. అభివృద్ధి పేరుతో జరుగుతున్న అనేక చర్యలు జీవరాశుల ఉనికికి ప్రమాదంగా మారుతున్నాయి. ప్రస్తుతం భూమిపై ఉన్న జీవరాశుల్లో సుమారు 800 కోట్లమంది మానవులే. వీరి మనుగడ, భూవాతావరణంపై, భూమి పైన, భూమి లోపల నిక్షిప్తమైన వనరుల మీద ఆధారపడి ఉంది. భూమిపై నివసిస్తున్న మనకు భూమితో గల సన్నిహిత సంబంధాన్ని కాదనలేం. అలాంటి భూమి కోసం పర్యావరణాన్ని పరిరక్షించవలసిన బాధ్యత మనపై ఉంది. మానవ స్వార్థంతో పర్యావరణం విధ్వంసం కావడం, బయోడైవర్శిటీ దెబ్బతినడం వలన మనచుట్టూ ఆవరించబడి ఉన్న వాతావరణం అనేక మార్పులకు లోనౌతున్నది. ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. గ్లోబల్ వార్మింగ్ అంతర్జాతీయ సమస్యగా మారింది. ప్లాస్టిక్ పర్యావరణానికి పెను సమస్యగా మారింది. ప్రతీ ఏటా ప్రపంచంలో ప్లాస్టిక్, మైక్రో ప్లాస్టిక్ రూపాల్లో సుమారు 25 కోట్ల టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలు వచ్చి చేరుతున్నాయి. ఇకనైనా ఈ ధోరణి మారాలి. సకల జీవరాశులు భూమిపై నివసించగలిగే వాతావరణంనెలకొల్పాలి. జీవవైవిధ్య జీవనసౌందర్యాన్ని భూతలంపై పునః ప్రతిష్ఠించాలి. •

# రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి అంతమెప్పుడు?

కనుమ ఎల్లారెడ్డి

రష్యా, ఉక్రెయిన్ మధ్య భీకర యుద్ధం కొనసాగుతానే ఉంది. రష్యా ఇటీవల ఎప్పుడు లేనంతగా ఉక్రైన్ పై డ్రోన్‌లతో విరుచుకు పడింది. భారీ నష్టం ఉక్రైన్‌కు సంభవించినా, కొన్నింటిని కూల్చేశాం అని చెప్పుకుంది. విశ్వంలో ఈ యుద్ధం చాలా నష్టాన్ని తెచ్చిపెడుతోంది. యుద్ధ నివారణకు ట్రంప్ ముందుకు వచ్చినా రెండు దేశాలు తమ ధోరణి విడవటం లేదు. చాలావరకు రెండు దేశాల్లోని సైనికులకు కూడా ఈ యుద్ధం విసుగుతెప్పిస్తోంది. ఇక పౌరుల విషయం మామూలే. ఎప్పుడు యుద్ధం ఆగునో అని ఎదురు చూస్తున్నారు. చర్చల ద్వారానే యుద్ధానికి ముగింపు అనేది వాస్తవం. అయితే ఈ చర్చలు రెండింటికీ అంగీకారం కావాలి. ఎటువంటి నిబంధనలు లేకుండా కాల్పులు ముందు ఆగాలి అని ట్రంప్ చెప్పినందుకు జెలెన్ స్కి అమెరికాకు కృతజ్ఞతలు చెప్పాడు. అటు రష్యా కూడా కాల్పుల విరమణకు సిద్ధంగానే ఉంది. ఆశాజనక చర్చల కోసం ఎదురు చూస్తోంది. రష్యా అసహజ షరతులు కొనసాగిస్తే యుద్ధ నివారణ కష్టం అని జెలెన్ స్కి వ్యాఖ్యానించారు. రష్యా మాత్రం మేము శాంతికి ప్రాముఖ్యం ఇస్తాం, ఉక్రైన్ అది ఉల్లంఘిస్తుందని చెప్పారు. ఇలా పరస్పర ధోరణులతోనే యుద్ధం కొనసాగుతోంది. ఫిన్‌లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ శాంతి ప్రక్రియకు, కాల్పుల విరమణకు రష్యా అనుమతించకుంటే ఆ దేశంపై ఆంక్షలు విధిస్తామని చెప్పడం గమనార్హం. ఈ వ్యవహారంలో రష్యా ఆచితూచి అడుగేస్తుంది.




ఉక్రైన్ యుద్ధంలో భారీగానే నష్టపోయింది. అందునిమిత్తమే కాల్పుల విరమణకు ముందుకు వచ్చింది. ట్రంప్ మాత్రం రెండింటిని సమన్వయం చేసి శాంతి పునరుద్ధరించాలి అని ఆరాటపడుతున్నాడు. నేను అధికారంలోకి వస్తే ఒక్క రోజులోనే రష్యా, ఉక్రైన్ యుద్ధాన్ని ఆపుతా అనే మాట అతనిలో యుద్ధం ఏ దేశానికి క్షేమం కాదు అనే మాట తెలుస్తోంది. రెండు దేశాలతో ట్రంప్ చర్చలు జరుపటం, కాల్పుల విరమనే ముందు జరగాలి అని జెలెన్ స్కి చెప్పటంముదావహం. ఎటువంటి షరతులు లేకుండా కాల్పులకు రెండు దేశాలు అంగీకరిస్తే ప్రయోజనం ఉంటుంది. ఇప్పుడు కాల్పుల విరమణ రెండు దేశాలు అంగీకరించాలి. కాల్పులు ఆగిపోతే చర్చలకు ప్రాధాన్యత ఉంటుంది. ఏ దేశం కూడా, ఎట్టి పరిస్థితులలో కాల్పులు, దాడులు చేయరాదు. అటువంటి పరిస్థితులలోనే శాంతి చర్చలు సఫలం అవుతాయి. రెండు దేశాల చర్చల కోసమే అమెరికా ప్రయత్నంచేస్తోంది. ఇటీవల ఇస్తాంబుల్‌లో చర్చలు అసంపూర్తిగా ముగిసిన దరిమిల, శాంతి ప్రక్రియకు, అవకాశం ఉంటుందా అనే అనుమానాలు వస్తున్నాయి. రష్యా పెద్ద దేశం కనుక రష్యా షరతులు ఉక్రెయిన్ అంగీకరించాలి. ఉక్రెయిన్ కూడా, రష్యా దాడిలో తమ నిర్మాణాలు పునరుద్ధరించాలి అనే ఒప్పందం చేసుకోవాలి. దేశాలు శాంతిగా ఉంటేనే విశ్వంబాగుంటుంది. అందుకనే రష్యా, ఉక్రెయిన్ శాంతి చర్చలు ఫలించాలని, శాంతి కొరకు అటు పుతిన్, ఇటు జెలెన్ స్కి సమాయత్తం అవుతారని, యుద్ధం త్వరలోనే ఆగిపోతుందని ఆశిద్దాం. •

# ఆర్థిక వ్యవస్థపై పిఎంఐ ప్రభావం

డి జె మోహన రావు

మన దేశ ఆర్థిక వ్యవస్థ ఎలా నడుస్తోంది? దాని గుండె చప్పుడు ఎలా ఉంది? ఈ కీలక ప్రశ్నలకు సమాధానం వెతకడానికి మనకు అనేక సూచికలు ఉన్నప్పటికీ, వాటిలో ఒకటి చాలా ప్రత్యేకమైనది. అదే కొనుగోలు నిర్వాహకుల సూచీ లేదా పిఎంఐ. ఇది కేవలం అంకెలు కాదు, మన ఆర్థిక వ్యవస్థలోని తయారీ, సేవల రంగాలలో రోజువారీగా పనిచేసే వ్యక్తుల అనుభవాల నుంచి పుట్టిన ఒక కీలక సంకేతం. వ్యాపార కార్యకలాపాలు, భవిష్యత్తుపై వారి ఆశలు ఎలాఉన్నాయో ఇది మనకు ముందుగానే చెబుతుంది. ఇటీవలి కాలంలో ఈ సూచీ చెబుతున్న కథ భారత ఆర్థిక గమనంపై ఆసక్తికరమైన చర్చలకు తావిస్తోంది. అసలు ఈ కొనుగోలు నిర్వాహకుల సూచీ అంటే ఏమిటి? వ్యాపార సంస్థల్లో కొనుగోళ్లు చేసే నిర్వాహకులు ఉంటారు కదా, వారే ఈ సూచీ వెనుక ఉన్నారు. వారిని ప్రతినెలా సర్వేచేసి, కొత్త ఆర్డర్లు ఎలా వస్తున్నాయి, ఉత్పత్తి పెరుగుతోందా, ఉద్యోగులను కొత్తగా తీసుకుంటున్నారా, ముడిసరుకుల సరఫరా వేగంగా ఉందా లేదా వంటి విషయాలపై వారి అభిప్రాయాలు తీసుకుంటారు. ఈ అభిప్రాయాల ఆధారంగా 0 నుంచి 100 మధ్య ఒక అంకెను లెక్కిస్తారు. ఈ అంకెలో '50' అనేది చాలా ముఖ్యమైన స్థాయి. సూచీ అంకె 50 వద్ద ఉందంటే, గత నెలకు, ఇప్పటికీ వ్యాపార పరిస్థితుల్లో పెద్దగా మార్పు లేదనిఅర్థం. అంతా స్థిరంగా ఉంది అనుకోవచ్చు. ఒకవేళ సూచీ 50 కంటే ఎక్కువగా ఉంటే, అప్పుడు కథ వేరేలా ఉంటుంది. వ్యాపార కార్యకలాపాలు పుంజుకుంటున్నాయని, ఆర్థిక వ్యవస్థ వృద్ధి పథంలో వేగంగా పయనిస్తోందని ఇది చెబుతుంది. ఇది చాలా మంచి వార్త. కానీ సూచీ 50 కంటే తక్కువగా ఉంటే, అప్పుడు కొంచెం ఆందోళన చెందాలి. వ్యాపారాలు మందగిస్తున్నాయని, ఆర్థిక కార్యకలాపాలు నెమ్మదిస్తున్నాయని ఇది సూచిస్తుంది. ఇది ఆర్థిక వ్యవస్థకు ఒక హెచ్చరిక లాంటిది. దీని గొప్పతనం ఏమిటంటే స్థూల దేశీయోత్పత్తి, పారిశ్రామిక ఉత్పత్తి, నిరుద్యోగ గణాంకాలు వంటి అధికారిక వివరాలు వెలువడటానికి చాలా ముందే, నెల ప్రారంభంలోనే ఈ సూచీ అందుబాటులోకి వస్తుంది. అందుకే దీన్ని 'ముందస్తు ఆర్థిక సూచిక' అంటారు. మార్కెట్లో ఏం జరగబోతోందో ముందుగానే పసిగట్టడానికి ఇది ఆర్థికవేత్తలకు, విధాన నిర్ణేతలకు, వ్యాపారులకు ఎంతో ఉపయోగపడుతుంది. ఈ సమాచారం ఆధారంగానే ప్రభుత్వాలు సరైన సమయంలో నిర్ణయాలు తీసుకోవడానికి, వ్యాపారాలు తమ ప్రణాళికలు మార్చుకోవడానికి, పెట్టుబడిదారులు జాగ్రత్త పడటానికి అవకాశం




లభిస్తుంది. కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు వంటి ద్రవ్య విధానాలను నిర్ణయించేటప్పుడు కూడా ఈ సూచీని ఒక ముఖ్యమైన సూచనగా తీసుకుంటాయి. ఈ సూచీలో ప్రధానంగా రెండు రకాలుంటాయి. వస్తువులు తయారు చేసే పరిశ్రమల కోసం 'తయారీ రంగ సూచీ', బ్యాంకింగ్, వైద్యం, ఐటీ వంటి సేవలందించే సంస్థల కోసం 'సేవల రంగ సూచీ'. ఈ రెండింటినీ కలిపి మొత్తం ఆర్థిక వ్యవస్థ స్థితిని తెలిపే 'సంయుక్త సూచీ' కూడా ఉంటుంది. ఈ సూచీ కూడా ఒక మనిషిలాగే పరిమితులు కలిగి ఉంటుంది. ఇది కొందరు కొనుగోలు నిర్వాహకుల అభిప్రాయాల ఆధారంగా తయారవుతుంది కాబట్టి, కొన్నిసార్లు మొత్తం రంగాన్ని లేదా దేశ ఆర్థికవ్యవస్థను పూర్తిగా ప్రతిబింబించకపోవచ్చు. వారి వ్యక్తిగత అనుభవాలు, మార్కెట్ సెంటిమెంట్ ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. నెలవారీగా వచ్చే ఈ అంకెలు సరఫరా సమస్యలు వంటి తాత్కాలిక కారణాల వల్ల కూడా మారవచ్చు. అన్నింటినీ మించి, ఇది కేవలం తయారీ, సేవలరంగాల గురించే చెబుతుంది కానీ వ్యవసాయం, నిర్మాణం వంటి ఇతర ముఖ్యమైన రంగాలను పెద్దగా పట్టించుకోదు. అందుకే, పిఎంఐ కేవలం ఒక కోణాన్ని మాత్రమే చూపిస్తుందని గుర్తుంచుకొని, దాన్ని ఇతర ఆర్థిక గణాంకాలతో పోల్చి చూస్తేనే మన ఆర్థిక వ్యవస్థ పూర్తి చిత్రాన్ని అర్థం చేసుకోగలం. ప్రపంచ వ్యాప్తంగా అనేక సంస్థలు ఈ సూచీలను సిద్ధం చేస్తున్నాయి. భారతదేశంలో ఎస్‌పి గ్లోబల్ అనే అంతర్జాతీయ సంస్థ సేకరించిన సమాచారం ఆధారంగా హెచ్ఎస్బిసి ఇండియా అనేసంస్థ దీన్నిలెక్కిస్తుంది. సుమారు 400తయారీసంస్థలు, 400 సేవా సంస్థల నుంచి వీరు వివరాలు తీసుకుంటారు. ఇక తాజాగా మన దేశంలో ఈ సూచీ చెబుతున్న కథ ఆశాజనకంగా ఉంది. ఏప్రిల్2025 నాటికి వెలువడిన గణాంకాలు మన ఆర్థికవ్యవస్థ పుంజుకుంటోందని బలంగా సూచిస్తున్నాయి. ఈ అద్భుతమైన అంకెల తెరవెనుక కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. గత నెలలు, సంవత్సరాలతో పోల్చిచూస్తే, కొన్నిసార్లు సేవల రంగం వృద్ధికాస్త నెమ్మదిగా ఉన్నట్లు కనిపించింది. అలాగే, పెట్టుబడి వస్తువులు వంటి కొన్ని ప్రత్యేక రంగాల్లో వృద్ధి ఇంకా పుంజుకోవాలి. ఎగుమతులు కూడా దేశీయ డిమాండ్ స్థాయికి చేరుకోవాలి. ఎక్కడ లోపాలున్నాయో గుర్తించి, ప్రభుత్వం ఆయా రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరంఉంది. భవిష్యత్ అంచనాలు కూడా మన ఆర్థికవ్యవస్థ బలంగానే ఉంటుందని చెబుతున్నాయి. అంతర్జాతీయ సంస్థలు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ పథకాలు, మౌలిక సదుపాయాలపై పెడుతున్న పెట్టుబడులు ఈ వృద్ధికి బలం చేకూర్చగలవు. కానీ కేవలం అంకెల్లో వృద్ధి వస్తేసరిపోదు కదా. అది సామాన్యుడి జీవితంలో ప్రతిబింబించాలి. నిరుద్యోగం, ఆదాయ అసమానతలు, పేదరికం, ద్రవ్యోల్బణం వంటి అనేకసవాళ్లు ఇంకా మన ముందున్నాయి. వీటిని అధిగమించాలంటే ఉద్యోగాలు సృష్టించే రంగాలపై పెట్టుబడి, యువతకు నైపుణ్య శిక్షణ, మౌలిక వసతుల కల్పన వంటి వాటిపై మరింతగా దృష్టి పెట్టాలి. పథకాలను ప్రకటించడమే కాదు, వాటిని సమర్థవంతంగా అమలు చేయడం చాలా ముఖ్యం. •

# ఆ 33 దేశాలకే అఖిలపక్ష బృందాలు ఎందుకు?



## మిత్రదేశాలతోపాటు భద్రతా మండలి సభ్యదేశాలు ఎంపిక

**న్యూఢిల్లీ, మే 21:** పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదంపై తాము జరుపుతున్న పోరు గురించి ప్రపంచ దేశాలకు వివరించేందుకు భారత్ దౌత్య యుద్ధం షురూచేసింది. ఇందుకోసం భారత ప్రభుత్వం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. ఈ అఖిలపక్ష బృందాల విదేశీ పర్యటన ఈనెల 19న ప్రారంభమై 24 (శనివారం) నాటికి అన్ని అఖిలపక్షబృందాలు భారత్‌నుంచి బయలు దేరి వెళ్తాయి. ఏడు అఖిలపక్ష బృందాలు 33 దేశాల్లో పర్యటించి ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ ప్రోత్సహిస్తున్న తీరు గురించి వివరిస్తాయి. ఉగ్రవాద సంస్థలు, ఉగ్రవాదులకు పాక్ నిలయంగా మారిన అంశాన్ని తెలియజేస్తాయి. ఇంతకీ పాకిస్థాన్‌పై దౌత్య యుద్ధం కోసం 33 దేశాలనే భారత్ ఎందుకు ఎంపిక చేసిందనే చర్చ ఇపుడు తెరపైకి వచ్చింది. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌పై దౌత్య యుద్ధం కోసం ఆ 33 దేశాల సహకారానికి భారత్ ఎందుకు ప్రాధాన్యత ఇస్తోందనే అంశంపై ఇప్పుడు అంతటా చర్చ జరుగుతోంది. అఖిలపక్ష బృందాల పర్యటన కోసం 33 దేశాల ఎంపిక వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటనేది తెలుసుకునేందుకు అందరూ ఆసక్తితోఉన్నారు. అసలు విషయం ఏమిటంటే ఈ 33దేశాల్లో 15 దేశాలు ప్రస్తుతం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత, తాత్కాలిక సభ్యదేశాలుగా వ్యవహరిస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో శాంతిభద్రతలు, ఉగ్రవాదం, ఆర్థిక ఆంక్షలు వంటి వ్యవహారాల్లో కీలక నిర్ణయాలను ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీసుకుంటుంది. ఐక్యరాజ్యసమితి నిర్ణయాలు, తీర్మానాలలో భద్రతా మండలిలోని దేశాలే కీలక పాత్ర పోషిస్తాయి. అందుకే ఆయా దేశాలకు తన వైఖరిని తెలియజేయడానికి భారత్ ప్రాధాన్యం ఇచ్చింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ఐదు దేశాలకు శాశ్వత సభ్యత్వం ఉంది. మిగతా 10 దేశాల తాత్కాలిక సభ్యత్వం రెండేళ్లకోసారి రొటేషన్ అవుతుంటుంది. భద్రతా మండలిలోని తాత్కాలిక సభ్య దేశాలకూ తాత్కాలిక అధ్యక్ష హోదాలభిస్తుంది. ప్రస్తుతం భద్రతా మండలి తాత్కాలిక సభ్యదేశంగా పాకిస్థాన్ ఉంది. మరో 17 నెలల పాటు పాక్‌కు ఆ హోదా ఉంటుంది. అప్పటివరకు భారత్‌పై పాకిస్థాన్ విష ప్రచారాన్ని ముమ్మరంగా కొనసాగించే అవకాశం ఉంది. దీన్ని తిప్పికొట్టేందుకే భద్రతా మండలిలోని అన్ని ఇతర దేశాలకు అఖిలపక్ష బృందాలను భారత్ పంపుతోంది. త్వరలోనే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తాత్కాలిక సభ్యత్వం పొందనున్న మరో ఐదు దేశాలకు కూడా భారతదేశ ఆల్ పార్టీ టీమ్‌లు వెళ్లనున్నాయి. ఈ పర్యటనలో భాగంగా ఆయా దేశాల ప్రధానులు, విదేశాంగ మంత్రులు, ఎంపీలు, ప్రతిపక్ష నాయకులు, మేధావులు, జర్నలిస్టులు, ప్రవాస భారతీయులు, ప్రముఖ రాజకీయ నాయకులను అఖిలపక్ష బృందాలు కలుస్తాయి. భారత్‌తో బలమైన వాణిజ్య, స్నేహ సంబంధాలుకలిగిన దేశాలనుకూడా అఖిలపక్ష బృందాల పర్యటన కోసం ఎంపిక చేశారు. ఈ జాబితాలో సౌదీ అరేబియా, జర్మనీ,యూరోపియన్ యూనియన్, ఇటలీ, మలేషియా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్, యూఏఈ, బ్రెజిల్, ఈజిప్ట్, ఖతర్, దక్షిణాఫ్రికా వంటి దేశాలు ఉన్నాయి. పనామా, గయానా, కొలంబియా, లాత్వియా, స్లొవేనియా లాంటి చిన్న దేశాలలోనూ భారత ఆల్ పార్టీ టీమ్‌లు పర్యటిస్తాయి. ఎందుకంటే ఆయా దేశాలతో భారత్‌కు మంచి దౌత్య సంబంధాలు ఉన్నాయి.



# కన్నడ రచయిత్రి భానుముస్తాక్‌కు 'బుకర్' ప్రైజ్

## 'హార్ట్ ల్యాంప్' కథా సంకలనానికి పురస్కారం

**లండన్, మే 21:** ప్రతిష్ఠాత్మక బుకర్ ప్రైజ్ 2025ను కన్నడ రచయిత్రి బాను ముస్తాక్ గెలుచుకున్నారు. హార్ట్ ల్యాంప్ అనే చిన్న కథల సంకలనానికి గాను ఈ అవార్డ్‌ను అందుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక బహుమతి అందుకున్న తొలి కన్నడ రచయిత్రిగా బాను రికార్డ్ సాధించారు. దీపా భస్తి రాసిన 'హసీనా అండ్ అదర్ స్టోరీస్' అనే పుస్తకాన్ని బాను ముస్తాక్ అనువాదం చేశారు. లండన్‌లోని టేట్ మోడరన్‌లో జరిగిన జరిగిన ఓ కార్యక్రమంలో దీప్తి భస్తితో కలిసి బాను ముస్తాక్ ఈ అవార్డును అందుకున్నారు. దీనికింద 50వేల పౌండ్ల నగదును బహుమతి లభించగా, దీప్తితోకలిసి బాను ముస్తాక్ ఈ మొత్తాన్ని పంచుకోనున్నారు. గీతాంజలి శ్రీ, అనువాదకురాలు డైసీ రాక్‌వెల్ 2022లో టూంబ్ ఆఫ్‌సాండ్‌కు అవార్డు గెలుచుకున్నారు. ఆ తర్వాత అంటే మూడు సంవత్సరాల్లో బుకర్ ప్రైజ్ గెలిచిన రెండవ భారతీయ పుస్తకం ఇది.దీప్తి భస్తి, బాను ముస్తాక్ 'హార్ట్ ల్యాంప్' అనేది 12 చిన్న కథల పుస్తకం. ఈ కథల్ని ఆమె 30 ఏళ్లలో రాశారు. పితృస్వామ్య సమాజంలో మహిళల రోజువారీ జీవితాల్ని గురించి వివరించారు. ఇందులో ఉన్న కథలు ఏదీ కూడా చిన్నది కాదని ముస్తాక్ అన్నారు. ఇది మానవ అనుభవాల వస్త్రంలో ప్రతి దారం ప్రత్యేక బరువును కలిగి ఉంటుందని అన్నారు. తన అందమైన భాషకు ఇది గొప్ప విజయమని దీప్తి భస్తి అన్నారు. ఇక ఆంగ్ల పాఠకులకు ఇది నిజంగా కొత్త అనుభవం అని బుకర్ ప్రైజ్ 2025 జ్యూరీ ఛైర్‌మాక్స్ పోర్టర్ అభివర్ణించారు. వివిధ రకాల భాషల్లో కొత్త భావనలను సృష్టించే ఒక గొప్ప అనువాదమని తెలిపారు. కర్ణాటకకు చెందిన బాను ముస్కాక్ రచయిత్రి, కార్యకర్త, న్యాయవాది. ముస్లిం కుటుంబంలో జన్మించిన బాను పాఠశాల విద్యను అభ్యసిస్తోన్న సమయంలోనే తొలిసారి ఒక షార్ట్‌స్టోరీ రాశారు. అయితే, 26 ఏళ్ల వయసులో తన కథ పత్రికలో ప్రచురితమైంది. తనతండ్రి ప్రోత్సాహంతో చదువులో రాణించారు.

ఉర్దూలోనే విద్యభసించిన బాను, కన్నడ భాషపై పట్టు సాధించారు. ఆ తర్వాత ఆమె రిపోర్టర్‌గా, లాయర్‌గా వృత్తి జీవి తాన్ని కొనసాగించారు. బాను ఒక రచయితగానే కాకుండా మహిళల హక్కుల కోసం గళమెత్తారు. మహిళలు ప్రశ్నించకుండా మతం, సమాజం వారిని ఎలాంటి కట్టుబాట్లలో ఉంచుతాయో తన కథల రూపంలో వ్యక్త పరిచారు. హార్ట్‌ల్యాంప్‌తో పాటు ఆరు చిన్న కథల సంకలనాలు, ఒక నవల, మరికొన్ని రచనలు చేశారు. ఆ సాహితీ సేవలకు గుర్తుగా బాను ముస్తాక్ కర్ణాటక సాహిత్య అకాడమీ, దాన చింతామణి అతిమబ్బె అవార్డులు అందుకున్నారు.

# బెంగళూరు ఎస్‌బిఐలో భాషా వివాదం

## స్థానిక భాషను తిరస్కరించిన బ్యాంకు మేనేజర్ బదలీ!

**బెంగళూరు, మే 21:** బెంగళూరులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో కన్నడ భాషపై జరిగిన వివాదంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. బ్యాంకు మేనేజర్ పౌరులతో నిర్లక్ష్యంగా ప్రవర్తించిన తీరు సరైనది కాదని విమర్శించారు. స్థానిక భాషను బ్యాంకు ఉద్యోగులందరూ గౌరవించాలని, కస్టమర్లను గౌరవిస్తూస్థానికభాషలోనే మాట్లాడాలని సూచించారు. సూర్యనగరలో కన్నడ మాట్లాడటానికి నిరాకరించిన ఎస్‌బిఐ మేనేజర్ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో ఎస్‌బిఐ ఆ మేనేజర్‌ను బదలీ చేసిందని ఇంతటితో ఈ సమస్య సద్దుమణిగినట్లుగా భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ఘటనల పునరావృతం కాకుండా చర్యలుతీసుకోవాలని అధికారులకు సూచించారు. దేశంలోని అన్ని బ్యాంకుల సిబ్బందికి ఆయా ప్రాంతాల సంస్కృతి, భాష వంటి విషయాల్లో శిక్షణ ఇవ్వాలని కేంద్ర ఆర్థిక సేవల విభాగాన్ని కోరారు. భాషా వివాదం కొనసాగుతున్న వేళ ఇటువంటి వ్యాఖ్యల వల్ల ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# స్కూలు బస్సుపై ఉగ్రదాడి



## నలుగురు మృతి, 38 మందికి గాయాలు

**క్వెట్టా(పాక్),మే 21:** భారత్‌తో కయ్యానికి కాలుదువ్వుతున్న దాయాది దేశం పాకిస్థాన్‌లో తాజాగా ఆత్మాహుతి దాడి జరిగింది. ఉగ్రవాదులు మరోసారి అమాయక ప్రజలపై దాడులకు పాల్పడ్డారు. ఈ బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో ఒక స్కూల్ బస్సును లక్ష్యంగాచేసుకుని బాంబుదాడి చేశారు. ఈ ఘటనలో నలుగురు పిల్లలు అక్కడికక్కడే మరణించగా, మరో 38 మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న స్థానికఅధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ పేలుడును అక్కడి హోంమంత్రి మొహ్సిన్ నఖ్వీ తీవ్రంగా ఖండించారు. మరోవైపు అధికారులు ఈ దాడి ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. స్కూల్ బస్సు పిల్లలను తీసుకెళ్తున్నప్పుడు ఈ దాడి జరిగింది. పేలుడు జరిగిన వెంటనే సహాయ, రక్షణ చర్యలు ప్రారంభమయ్యాయి. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. తీవ్రంగా గాయపడిన పిల్లలను క్వెట్టా, కరాచీలోని పెద్ద ఆసుపత్రులకు తరలించారు. పాకిస్థాన్ హోం మంత్రి మొహ్సిన్ నఖ్వీ ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ పిల్లలను లక్ష్యంగా చేసుకునే ఉగ్రవాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమన్నారు. దేశంలో భయాన్ని, అస్థిరతను వ్యాప్తి చేయడమే వారిదాడి ఉద్దేశమని, అయితే ప్రభుత్వం, భద్రతా దళాలు వీటిని విజయవంతం చేయనివ్వవని వెల్లడించారు. బలూచిస్థాన్ చాలా కాలంగా పాకిస్థాన్‌కు అత్యంత సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతంగా ఉంది. ఇక్కడి వేర్పాటువాద శక్తులు పాకిస్తాన్ నుంచి విడిపోయి స్వతంత్ర దేశాన్ని కోరుతున్నాయి.

ఈ క్రమంలో అనేకసార్లు పాకిస్థాన్ సైన్యాన్ని, పలువురుని లక్ష్యంగాచేసుకుని దాడులుచేస్తున్నాయి. ఇటీవలేఈ ప్రాంతంలో ఉగ్రవాద ఘటనల సంఖ్య భారీగా పెరగడం విశేషం. ఈ క్రమంలోనే బలూచిస్థాన్‌లో జరిగిన ఈ ఆత్మాహుతి దాడి పాకిస్థాన్ అంతర్గత భద్రతపై మరోసారి ప్రశ్నలను లేవనెత్తింది. భారత ఉపఖండానికి పశ్చిమదిక్కుగా ఉండే బలూచిస్థాన్ ప్రాంతం ప్రకృతి సౌందర్యం, ఖనిజ సంపదలతో ఉంది. ఈ నేలపై ఇప్పుడు పేలుళ్ల శబ్దం వినిపిస్తోంది. గత కొద్ది సంవత్సరాలుగా ఈ ప్రాంతం బలూచ్ వేర్పాటువాదుల కదలికలతో దద్దరిల్లిపోతోంది. ముఖ్యంగా బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ) పేరుతో విప్లవకారులు పదే పదే పేలుళ్లు, కాల్పుల ద్వారా ప్రభుత్వాన్ని గడగడలాడిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం కిల్లా అబ్దుల్లా నగరంలోని మార్కెట్ వద్ద కార్ బాంబ్ పేలుడులో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇది ఒక్కటే కాదు, మార్చిలో జరిగిన ఘోర ఘటనలో, ఓ రైలు పై దాడి చేసి 33 మందిని, ప్రధానంగా సైనికులను బిఎల్ఎ హతమార్చింది.

# బిజెపి అమిత్ మాలవీయ, రిపబ్లిక్ టివి చీఫ్‌లపై కేసునమోదు



**న్యూఢిల్లీ,మే 21:** తప్పుడు సమాచారం వ్యాప్తిచేస్తున్నారన్న అభియోగాలపై బిజెపి ఐటిసెల్ చీఫ్ అమిత్ మాలవియ, రిపబ్లిక్ టివి ఎడిటర్ ఇన్ చీఫ్ అర్నబ్ గోస్వామిలపై అభియోగాలునమోదుచేసారు. హైగ్రౌండ్స్ పోలీస్ స్టేషన్‌లో ఇందుకు సంబంధించి యువజన కాంగ్రెస్ లీగల్‌సెల్ చీఫ్ శ్రీకాంత్ ష్వరూప్ బిఎన్ ఫిర్యాదుచేయడంతో కేసులు నమోదు చేసారు. విద్వే షాలను రెచ్చగొట్టే లక్ష్యంతో వ్యాఖ్యలుచేయడం, శాంతియువత వాతావరణం భగ్నం కలిగించే విధంగా కొందరిని అవమానించడం వంటి సెక్షన్లను నమోదుచేసారు. మాలవీయ, గోస్వామిలు ఒకనేరపూరిత ప్రచారం ప్రారంభించారని,టర్కీలోని ఇస్తాంబుల్ కాంగ్రెస్ కేంద్రం భారత జాతీయ కాంగ్రెస్‌కు అంతర్జాతీయ కార్యాలయం అని వ్యాఖ్యలు చేసారని ఆరోపించారు. ఇలాంటి విషప్రచారం విద్వేషాలను మరింత రెచ్చగొట్టేవిధంగా ఉందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. భారత ప్రజాస్వామిక పునాదులపై అనూహ్య దాడి జరుగుతున్నదని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, కేంద్ర సమాచార ప్రసారాల మంత్రిత్వశాఖ, సిబిఐలు వెంటనే దర్యాప్తును చేపట్టి అందకు కారకులైనవారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

# పాకిస్థాన్‌లో భారీగా ట్రెండింగ్ అవుతున్న రాహుల్ గాంధీ

## ఆయన విడియోలు, పోస్టులను పాక్ మీడియాలో విస్తృత ప్రచారం



**న్యూఢిల్లీ, మే 21:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు పాకిస్థాన్‌లో పెద్ద చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్ గురించి ఆయన లేవనెత్తిన ప్రశ్నలను పాకిస్థాన్ మీడియా తమకు అనుకూలంగా మలచుకుంటూ భారీగా ప్రచారం చేసుకుంటున్నది. ఈ పరిణామం భారత రాజకీయ వర్గాల్లోనూ, మాజీ సైనికాధికారుల్లోనూ తీవ్ర చర్చకు దారితీసింది. గతంలో జరిగిన ఆపరేషన్ సిందూర్‌ను ఉద్దేశిస్తూ రాహుల్ గాంధీ సోమవారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పలు ప్రశ్నలు సంధించారు. ఈ ఆపరేషన్ గురించి పాకిస్థాన్ ఆర్మీకి ముందే సమాచారం అందించారని ఆరోపిస్తూ, విదేశాంగమంత్రి ఎస్. జైశంకర్ గతంలో మాట్లాడిన ఓ వీడియోను కూడా ఆయన పంచుకున్నారు. అంతేకాకుండా, ఈ ఆపరేషన్‌లో భారత్ ఎన్ని యుద్ధ విమానాలను కోల్పోయిందో చెప్పాలని డిమాండ్ చేశారు. సైనిక చర్యకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే పాకిస్థాన్‌కి తెలియ జేయడం నేరమని కూడా ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. రాహుల్ గాంధీ చేసిన ఈ వ్యాఖ్యలను పాకిస్థాన్ మీడియా అందిపుచ్చుకుంది. ఆపరేషన్ సిందూర్ విఫలమైందని, ఈ ఆపరేషన్‌లో పాకిస్థాన్ భారత్‌ను ఓడించిందని ఇప్పటికే విస్తృతంగా ప్రచారం చేసుకుంటోంది. భారత దాడుల్లో తమ వైమానిక స్థావరాలు దెబ్బతిన్నప్పటికీ, వైమానిక రక్షణ వ్యవస్థలు దెబ్బతిన్నప్పటికీ, పాకిస్థాన్ మాత్రం తమ ఓటమిని అంగీకరించడం లేదు. పైగా, భారత్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను, ముఖ్యంగా రాఫెల్ జెట్‌ను కూల్చివేశామని గొప్పలు చెప్పుకుంటోంది. ఇప్పుడు రాహుల్ గాంధీ కూడా భారత్ ఎన్ని యుద్ధ విమానాలను కోల్పోయిందని ప్రశ్నించడంతో, పాకిస్థాన్‌కు ఇది మరింత ఊతమిచ్చినట్లయింది. రాహుల్ ప్రశ్నలు తమ వాదనలకు బలం చేకూర్చేలా ఉన్నాయని భావిస్తూ, పాక్ మీడియా ప్రత్యేక చర్చా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తోంది. అయితే, రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. ఇవి నిరాధారమైన ఆరోపణలని కొట్టిపారేసింది. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఉగ్రవాద స్థావరాలను విజయవంతంగా ధ్వంసం చేసిన తర్వాత, పాకిస్థాన్ ఆర్మీ ప్రతిదాడికి దిగిన సందర్భంలోనే విదేశాంగ మంత్రి జైశంకర్ ఆ వ్యాఖ్యలు చేశారని విదేశాంగ శాఖ స్పష్టత ఇచ్చింది. ఆపరేషన్ మొదలైన తర్వాత, మేము కేవలం ఉగ్రవాద స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నామని పాక్ ఆర్మీకి తెలియజేశాము. ఈ విషయంలో వారు జోక్యం చేసుకోవద్దని సూచించాము. కానీ, పాక్ ఆర్మీ మా సూచనను పాటించలేదని జైశంకర్ చెప్పినట్లు విదేశాంగ శాఖ వివరించింది. మరోవైపు, పలువురు మాజీ సైనికాధికారులు కూడా రాహుల్ గాంధీ వ్యాఖ్యలను తప్పుబడుతున్నారు. ఒకవేళ దాడుల గురించి పాకిస్థాన్‌కు ముందే తెలిసి ఉంటే, మురిడ్కే, బహవల్పూర్ వంటి ప్రాంతాల్లోని ఉగ్రవాద శిబిరాల్లో ఉగ్రవాదులను ఎందుకు ఉంచుతారని వారు ప్రశ్నిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్‌లో వంద మందికి పైగా ఉగ్రవాదులు హతమైన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. గతంలో అబోటాబాద్‌లో ఒసామా బిన్ లాడెన్‌ను హతమార్చిన తర్వాత అమెరికా సైతం పాకిస్థాన్‌కు సమాచారం అందించిందని, అలాగే 2019 బాలాకోట్ దాడుల అనంతరం కూడా భారత డిజిఎంఒ ఆపరేషన్ వివరాలను పాకిస్థాన్‌కు తెలియజేశారని, ఇది ఒక సాధారణ సైనిక ప్రక్రియ అని వారన్నారు. సున్నితమైన విషయా లపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వారు సూచిస్తున్నారు.

# వక్ఫ్ అనేది దాతృత్వం మాత్రమే.. ఇస్లాంలో భాగం కానేకాదు

## సుప్రీంలో కేంద్రం వాదనలు

**న్యూఢిల్లీ, మే 21:** వక్ఫ్ అనేది దాతృత్వం తప్ప మరొకటి కాదని, అది ఇస్లాంలో ముఖ్యమైన భాగం కాదని కేంద్ర ప్రభుత్వం బుధవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. వక్ఫ్ బోర్డులు లౌకిక విధులను మాత్రమే నిర్వహిస్తాయని చెప్పింది. వక్ఫ్ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం విచారణ చేపట్టగా, కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. వక్ఫ్ అనేది ఇస్లామిక్ భావన. కానీ అది ఇస్లాంలో ముఖ్యమైన భాగం కాదు. వక్ఫ్ అనేది దాతృత్వం తప్ప మరొకటి కాదు. దానధర్మాలు ప్రతి మతంలో భాగం. హిందువులకు దాన ధర్మాలు అనే వ్యవస్థ ఉంది. సిక్కులు కూడా దానిని కలిగి ఉన్నారు. ప్రభుత్వ భూమిపై ఎవరికీ హక్కు లేదు. ప్రభుత్వానికి చెందిన ఆస్తిని వక్ఫ్‌గా ప్రకటిస్తే ప్రభుత్వం ఆ ఆస్తిని కాపాడుకోగలదని సుప్రీంకోర్టు తీర్పు చెబుతోందని తుషార్ మెహతా వ్యాఖ్యానించారు. ఉపశమన ఉత్తర్వులకు సంబంధించి ముందుగా నిర్ణయించిన మూడు అంశాలకే పరిమితమై విచారణ జరగాలని మరోసారి సుప్రీంను మెహతా కోరారు. బ్రిటిష్, వరుస భారత ప్రభుత్వాలు పరిష్కరించలేని సమస్యలను తాజా వక్ఫ్ చట్ట సవరణలు పరిష్కరించాయని తెలిపారు.

# ఉగ్రవాదులే మనకు ఆధారాలిచ్చారు!

## అందుకే ఆపరేషన్ సిందూర్ విజయవంతం

### గోవాలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్

**పనాజి, మే 21:** ఆపరేషన్ సింధూర్‌కు ఉగ్రవాదులే స్వయంగా ఆధారాలిచ్చారని, అందువల్లనే స్పష్టమైన లక్ష్యంతో ఉగ్రవాద శిబిరాలను ధ్వంసంచేసి ప్రపంచానికి ఆపరేషన్ సింధూర్ సామర్థ్యం చాటిచెప్పిందని భారత ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌ఖడ్ అన్నారు. శిబిరాలు ధ్వంసం చేసిన తర్వాత ఉగ్రవాద మృతుల శవపేటికలకు పాకిస్తానీ మిలిటరీ అధికారులు, రాజకీయ నాయకులు రక్షణగా వెళ్లడమే ఇందుకు నిదర్శనమన్నారు. దక్షిణ గోవాలోని వాస్కోలో ఏర్పాటుచేసిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ధన్‌ఖడ్ జైషే ముహ్మద్, లష్కరే తాయిబాలకు ఆపరేషన్ సింధూర్ సరైన గుణపాఠం చెప్పిందని, అంతేకాకుండా ఉగ్రవాదం ఏరూపంలో ఉన్నా తుదముట్టిస్తామని ప్రపంచానికి సందేశం పంపించిందని అన్నారు. ప్రధాని నరేంద్రమోడీజీ ఇచ్చిన సందేశానికి అనుగుణంగానే ఉగ్రవాదం ఎంతోకాలం శిక్షార్హం కాకుండా కొనసాగలేదని రుజువుచేసారని ఉపరాష్ట్రపతి అన్నారు. ఉగ్రవాదులను శిక్షించడం అనివార్యమన్నారు. అంతర్జాతీయ సరిహద్దుకు అత్యంత దూరంగా ఉన్న ఈ ఉగ్రశిబిరాలను సాహసోతపేతంగా ధ్వంసంచేయగలిగామని, అదేపహల్గాంవ్ మృతులకు అసలైన నివాళిఅని అన్నారు. ఈ సాహసోపేతమైన చర్యలు తర్వాత ఏ ఒక్కరు కూడా ఆధారాలు అడగలేదని, ఇపుడు ఉగ్రవాదులే ప్రపంచానికి ఆధారాలు చూపించినట్లయిందన్నారు. ఎందుకంటే పాకిస్తాన్‌లో ఉగ్రవాదుల శవపేటికలకు అక్కడి రాజకీయ నాయకులు, మిలిటరీ అధికారులే రక్షణగా పెరేడ్ చేసారని గుర్తుచేసారు. భారత్‌ప్రపంచంలోనే ఒక శక్తివంతమైన ఆర్థికవ్యవస్థగా మారుతున్నదని మారిటైమ్ పవర్‌హౌస్‌గా నడుస్తున్నదన్నారు. గోవా గవర్నర్ పిఎస్ శ్రీధరన్ పిళ్లై, ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, శ్రీపాద్ నాయక్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అఫ్ఘానిస్థాన్ వరకు చైనా-పాకిస్థాన్ ఆర్థిక కారిడార్!



## బీజింగ్‌లో మూడుదేశాల విదేశాంగ మంత్రుల భేటీ

**బీజింగ్, మే 21:** భారత్ పొరుగు దేశాలైన చైనా, పాకిస్థాన్ కీలక నిర్ణయం తీసుకున్నాయి. చైనా పాకిస్థాన్ ఆర్థిక నడవా (సిపెక్) ప్రాజెక్టును అఫ్ఘనిస్థాన్ వరకు విస్తరించడానికి అంగీకరించాయి. బీజింగ్‌లో జరిగిన మూడు దేశాల త్రైపాక్షిక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఇస్లామాబాద్‌లోని పాక్ విదేశాంగ కార్యాలయం ఓ ప్రకటనను విడుదల చేసింది. పాకిస్థాన్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ, అఫ్ఘనిస్థాన్ తాత్కాలిక విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ బీజింగ్‌లో అనధికారిక త్రైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో చైనాపాకిస్థాన్ ఆర్థిక కారిడార్‌ను అఫ్ఘనిస్థాన్ వరకు విస్తరించాలని నిర్ణయించారు. అలాగే మూడు దేశాల అగ్ర నాయకులు త్రైపాక్షిక సహకారాన్ని మరింతగా పెంచుకోవడానికి అంగీకరించారు. పాకిస్థాన్, పీఓకేలోని ఉగ్రవాద స్థావరాలే టార్గెట్‌గా భారత్ ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టిన తర్వాత పాక్ విదేశాంగమంత్రి ఇషాక్ దార్ తొలి చైనా పర్యటన ఇదే కావడం గమనార్హం. మూడు రోజుల పర్యటన నిమిత్తం ఆయన చైనా వెళ్లారు. ఈ క్రమంలో బీజింగ్‌లో జరిగిన త్రైపాక్షిక సమావేశంలో పాల్గొన్నారు. పాకిస్థాన్, చైనా, అఫ్ఘనిస్థాన్ ప్రాంతీయ శాంతి, స్థిరత్వం, అభివృద్ధి కోసం కలిసి నడుస్తాయని దార్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ముగ్గురు నాయకులు కలిసి ఉన్న ఫొటోను షేర్‌చేశారు. ముగ్గురు విదేశాంగ మంత్రులు ప్రాంతీయ భద్రత, ఆర్థిక అనుసంధానాన్ని ప్రోత్సహించడానికి త్రైపాక్షిక సమావేశాన్ని కీలకమైన వేదికగా అభివర్ణించారు. ఈ మూడు దేశాల విదేశాంగ మంత్రులతో మరో సమావేశాన్ని కాబుల్‌లో నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. దౌత్య సంబంధాలు కొనసాగించడం, కమ్యూనికేషన్లను బలోపేతం చేసుకోవడం, వాణిజ్యం, మౌలిక సదుపాయాలు, అభివృద్ధి వంటివే కీలకమైనవి. వీటి గురించే చర్చించాం. బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ సహకారాన్ని మరింతగా పెంచడానికి చైనాపాకిస్తాన్ ఆర్థిక కారిడార్‌ని అఫ్ఘనిస్థాన్ వరకు విస్తరించడానికి అంగీకరించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి, ఈ ప్రాంతంలో స్థిరత్వం, అభివృద్ధిని పెంపొందించడానికి ఉమ్మడిగా కృషి చేస్తామని ముగ్గురు నాయకులు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, 60 బిలియన్ డాలర్లతో చేపట్టినసీపెక్‌ను భారత్ తీవ్రంగా వ్యతిరేస్తూ వస్తోంది. ఈ ప్రాజెక్టులో పాక్ ఆక్రమిత కశ్మీర్ భూభాగం కూడా ఉండటం అందుకు ప్రధాన కారణంగా చెప్పొచ్చు.

# రన్యారావు కేసులో కీలక పరిణామం..

## సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌పై ఇడి దాడులు!

**బెంగళూరు, మే 21:** బంగారం అక్రమ రవాణా కేసులో అరెస్టయిన కన్నడనటి రన్యారావుకు న్యాయ స్థానం ప్రత్యేక షరతులతో బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బంగారం అక్రమరవాణా కేసుకు సంబంధించి కర్ణాటక హోంమంత్రి జి.పరమేశ్వరతో సంబంధం ఉన్న శ్రీ సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌పై బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు చేసింది. ఈ కళాశాలకు ఆయన ఛైర్మన్‌గాఉన్నారు. ఈ కేసులో రన్యారావుకు, కళాశాలకు మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని ఇందులో భాగంగానే కళాశాలకు చెందిన ఆర్థిక రికార్డులను పరిశీలిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు.

# ఆమె హత్యచేయలేదు.. డ్రగ్స్ స్మగ్లర్‌కూడా కాదు!

## మాజీ ఐఎఎస్ పూజా ఖేద్కర్‌కు బెయిల్ మంజూరుచేసిన సుప్రీం



**న్యూఢిల్లీ, మే 21:** ఆమె ఏమీ హత్యలుచేయలేదు కదా, దేశద్రోహం నేరాలకు పాల్పడిందా లేదు కదా అంటూ సుప్రీంకోర్టు దర్యాప్తు అధికారులకు చురకలువేసి మాజీ ఐఎఎస్ ప్రొబేషనరీ అధికారి పూజా ఖేద్కర్‌కు బెయిల్ మంజూరుచేసింది. ఒబిసి కుల ధృవీకరణను తప్పుడు మార్గంలో దాఖలుచేసి ప్రయోజనాలు పొందిందని, సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఒబిసిద్వారా అనుచిత లబ్ధిని పొందారని ఆమెపై అభియోగాలు నమోదయ్యాయి. జస్టిస్ బివినాగరత్న, సతీష్ చంద్రశర్మలు బెయిల్ మంజూరు చేస్తూ ఖేద్కర్ దర్యాప్తు అధికారులకు సహకరించాలని ఆదేశించారు. ఏమంత తీవ్రమైన తప్పులు చేసింది, ఆమేమీ డ్రగ్స్ స్మగ్లరు కాదు, ఉగ్రవాది అంతకంటే కాదు. ఆమె ఏమీ సెక్షన్ 302 కింద నిందితురాలుకూడా కాదు. ఆమె ఎన్‌డిపిఎస్ కేసుల్లో ఉన్న నిందితురాలుకూడా కాదు. మీకు ఇలాంటి కేసుల్లో స్పష్టమైన సాఫ్ట్‌వేర్ ఉండాలి. దర్యాప్తును పూర్తిచేయండి. ఆమె అన్నీ పోగొట్టుకుంది. మరోచోట ఎక్కడా కూడా ఆమెకు ఉద్యోగం కూడా లభించదని బెంచ్ మౌఖికంగా దర్యాప్తు అధికారులను ఆదేశించింది. కేసు పూర్వాపరాలను పరిశీలించిన తర్వాత ఢిల్లీకోర్టు ఈ నిందితురాలికి బెయిల్ మంజూరుచేసి ఉండాల్సిందని అభిప్రాయపడింది.

# ఎసిబికి చిక్కిన పంచాయితీ కార్యదర్శి

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండల పరిధిలోని గోటుముక్కల గ్రామ పంచాయితీ కార్యదర్శి భూ వ్యవహారంలో ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటూ బుధవారం ఉదయం ఎసిబికి చిక్కాడు. గోటుముక్కల గ్రామ పంచాయితీ కార్యదర్శి గంగా మోహన్ స్థానికంగా వుండే రాజేందర్ అనే వ్యక్తి నుంచి ఓ భూమికి సంబంధించిన వివాదంలో 18 వేల రూపాయలు లంచంగా తీసుకుంటుండగా అక్కడే మాటువేసిన ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం నిందితుడి నుంచి లంచం డబ్బులను జప్తు చేసి, అరెస్టు చేశారు. వాస్తవానికి ఈ భూమి గురించి బాధితుడు రాజేందర్‌కు మరో వ్యక్తితో వివాదం వుంది. ఈ వివాదం పరిష్కరించేందుకు గంగా మోహన్ లంచం డిమాండ్ చేసి ఎసిబికి దొరికిపోయాడు.

పట్టుబడ్డ పంచాయితీ కార్యదర్శిపై గతంలోనూ ఆరోపణలున్నట్లు అధికారులు తెలిపారు. దాడుల సందర్భంగా ఎసిబి అధికారులు నిందితుడి కార్యాలయంతో పాటు ఇంట్లోనూ సోదాలు చేసి పలు పత్రాలను జప్తు చేశారు.

# నోరు జారితే యాసిడ్‌తో కడుగుతాం..

## ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్, మే 21,ప్రభాతవార్త:** కేటీఆర్ మా సీఎంపై నోరు జారితే, నోటిని యాసిడ్‌తో కడుగుతాం జాగ్రత్తగా ఉండాలని బీర్ల ఐలయ్య హెచ్చరించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వీడియో ప్రకటనలో సంచలన వ్యాఖ్యలు చేస్తూ కేటీఆర్ అధికారం కోల్పోయిన తర్వాత పిచ్చెక్కినట్లుగా ప్రవర్తిస్తున్నాడని ధ్వజమెత్తారు. నల్గొండ జిల్లాలో సిఎం రేవంత్ రెడ్డి గురించి అవాక్కులు, చావాక్కులు మాట్లాడటం తగదన్నారు. కేటీఆర్ తన నోరును అదుపులో పెట్టుకోవాలని ఘాటు వ్యాఖ్యలు చేసారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో నల్గొండ ఉమ్మడి జిల్లా మంత్రులు అహర్నిశలు కష్టపడుతూ అభివృద్ధి పనులను కొనసాగిస్తున్నారని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా తాగు, సాగు నీటి ప్రాజె క్టుల పరంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి ముందుండి వాటిని నడిపిస్తున్నారు. మరోవైపు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఢిల్లీ నుంచి నిధులు తీసుకొచ్చి జిల్లాలో రోడ్లు నిర్మిస్తున్నారని తెలిపారు. ఇక కెసిఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలి కులేశ్వరం గా మారిందని ఎద్దేవా చేసారు. స్కాంల చరిత్ర ఆ పార్టీదే అని బిఆర్ఎస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేసారు. ఇక వేయి ఎలుకలు తినిన పిల్లి తీర్థయాత్రలకు వెళ్లినట్టుగా కెసిఆర్ ప్రవర్తిస్తున్నాడని అన్నారు. అభివృద్ధిని, సంక్షే మాన్ని చూసి ఓర్వలేక చిల్లర విమర్శలు చేస్తున్నా రని ఆయన వ్యాఖ్యానించారు.

# సిఎం అజ్ఞానంతో అబద్ధాలు ప్రచారం

## టెర్రరిజాన్ని అంతమొందించేందుకు మోడీ సర్కార్

## రాజీలేని పోరాటం: బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, మే 21 ప్రభాతవార్త:** పాకిస్థానుతో పోరులో కేంద్రంలోని మోడి ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడికి తలొగ్గిందంటూ సిఎం రేవంత్‌రెడ్డి రాజీవ్ గాంధీ వర్ధంతి సభలో మాట్లాడడం అజ్ఞానానికి నిదర్శనమని బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. దేశ భద్రత, విదేశాంగ వ్యవహారాలకు సంబంధించిన అంశాల్లో సిఎం రేవంత్ రెడ్డి తన అజ్ఞానంతో అబద్ధాలను ప్రచారం చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. ఇది దేశద్రోహ చర్యతో సమానమని, పాకిస్తాను లోని ఉగ్రవాద శిబిరాలను భారత సైన్యం పలుసార్లు ధ్వంసం చేయడమే పాక్ ప్రేరేపిత టెర్రరిజాన్ని అంతమొందించేందుకు కేంద్రంలోని మోడి సర్కార్ రాజీలేని పోరాటం చేస్తోందనడానికి నిదర్శనం అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిళ్లకు తలొగ్గితే పాకిస్తానుపై భారత సైన్యం చేసిన ఆ దాడులు జరిగేవి కావు కదా? అంటూ ప్రశ్నించారు. మన కనుల ముందే వాస్తవాలు ఇలా ఉంటే సిఎం రేవంత్ రెడ్డి అమెరికా అధ్యక్షుడి ఒత్తిడికి మోడి ప్రభుత్వం తలొగ్గిందని, పెహల్గాంలో ఉగ్ర దాడులు జరిగినపుడు ప్రధాని మోడికి బాసట ఉండాల్సిన కేంద్రం మంత్రి కిషన్‌రెడ్డి దుప్పటి కప్పుకుని పడుకున్నారని మాట్లడడానికి అసలు కారణం రాహుల్ గాంధీ మెప్పు పొందడం, తద్వారా తన సిఎం పదవిని కాపాడుకోవడం కోసమే అన్నారు. తాజాగా హైదరాబాద్, చార్మినార్ ప్రాంతంలోని గుల్జార్ హౌసు లో అగ్నిప్రమాదం జరిగి 17మంది చనిపోతే, వెంటనే సంఘటనా స్థలానికివెళ్లి పరిస్థితిని సమీక్షించి, బాధితుల కుటుంబాలను ఓదార్చిన నేత కిషన్‌రెడ్డి అన్నారు. బాధితులకు అండగానిలబడి భరోసా ఇవ్వాల్సిన సిఎం రేవంత్ తన నివాసంలో దుప్పటి కప్పుకుని పడు కోవడం బాధ్యా తారాహిత్యానికి నిదర్శనం అన్నారు.

# దళారీ వ్యవస్థను ప్రొత్సహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసి పరిస్థితిని వివరించిన మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్

**హైదరాబాద్, మే 21 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో సన్నకారు, చిన్న కారు, రైతులు పడుతున్న ఇక్కట్లను ఎదురవుతున్న కేంద్ర వ్యవసాయ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివ రాజ్ సింగ్‌చౌహాన్‌కు ఉప్పల్ మాజీ శాసన సభ్యులు ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ వివరించారు. బుధవారం ఢిల్లీలోని కృషిభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రంలో రైతుల పరిస్థితిని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళారీలను ప్రోత్సహించడం వలన వ్యవసాయ పంటలకు, వాణిజ్య పంటలకు, ధాన్యానికి, పసుపుకి, పత్తికి, మిర్చికి, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందకుండా పోతుందని వాపోయారు. ఫసల్ బీమా యోజన అమల్లో తీసుకువచ్చే విధంగా ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో ఎరువుల కృత్రిమ కొరతలు సృష్టించడం, కొంతమంది వ్యాపారులు కల్తీ విత్తనాలు అమ్మకాల వల్ల రైతులకు నష్టం జరుగుతుందని కేంద్ర మంత్రికి వివరించారు.

వ్యవసాయ శాఖకు అనుబంధంగా ఉన్న అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో కూడుకున్న నోడల్ ఆఫీసర్ని ఒకరిని ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ని కోరారు వ్యవసాయ పనిముట్ల మీద ఉన్న సబ్సిడీలను ఎత్తివేసారని, రైతు రుణ మాఫీ సరిగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయక పోవడం వల్ల ఇంకా వేలాది రైతులు రుణగ్రస్తులు గానే మిగిలారని కొత్తగా పరపతి వ్యవసాయ రుణాలు ఇవ్వటానికి ఏ బ్యాంకులు కూడా ముందుకు రావటం లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర పర్యటనకు వచ్చి గ్రామీణాభివృద్ధిపై, వ్యవసాయంపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించాలని కోరారు.



బుధవారం కరీంనగర్‌లో యాంటీ టెర్రరిజం డే ర్యాలీని ప్రారంభించిన బండి సంజయ్

# ఉగ్రవాద నిర్మూలనే మోడీ సర్కార్ లక్ష్యం

## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**కరీంనగర్ టౌన్, మే 21, ప్రభాతవార్త:** ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించడమే నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. పెహల్గాం ఘటన తరువాత దేశ ప్రజల్లో చాలా మార్పు వచ్చిందన్నారు. ఉగ్రవాద నిర్మూలన కోసం జరిగే యుద్ధంలో అవసరమైతే సామాన్య ప్రజలు కూడా పాల్గొనేందుకు సిద్ధమ య్యారన్నారు. పాకిస్తాన్ భూభాగంలోకి వెళ్లి అక్కడి ప్రజల ప్రాణాలకు ఇబ్బంది లేకుండా ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడంతోపాటు ఉగ్రవాదులను మట్టుబెట్టిన ఘనత భారత సైన్యానిదేనన్నారు. బుధవారం'ఉగ్రవాద వ్యతిరేక దినం' సందర్భంగా కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మట్లాడుతూ ప్రపంచంలో టెర్రరిజాన్ని అణిచివేసే శక్తి సామర్థ్యాలు భారత్ కు ఉన్నాయనే విషయాన్ని ప్రపంచమంతా గుర్తించిందన్నారు.

# సైన్యానికి సిఎం రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలి

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 21 ప్రభాతవార్త:** పాకిస్థాన్‌పై అపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం సాధించిన విజయాన్ని తక్కువ చేస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడటం కాంగ్రెస్ పార్టీ దివాలాకోరుతనానికి నిదర్శనం అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి తీవ్రంగా స్పందించారు. భారత సైన్యం దెబ్బకు ఖంగు తిన్న పాకిస్థాన్ కాళ్లబేరానికి వస్తే యుద్ధం ఆపారని సైన్యం మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా రేవంత్ రెడ్డి మాట్లాడటం దుర్మార్గంగా ఉందన్నారు. భారత సైన్యం ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తూ మాట్లాడిన సిఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధినాయకత్వం సైన్యానికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఆధునిక స్వాప్నికుడు రాజీవ్ : మహేష్‌కుమార్

## దేశంలో విప్లవాత్మక మార్పులకు ఆద్యుడు : మంత్రి జూపల్లికృష్ణారావు

## రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన కాంగ్రెస్ శ్రేణులు

**హైదరాబాద్, మే 21,ప్రభాతవార్త :** రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున రాష్ట్రవ్యాప్తంగా రాజీవ్ విగ్రహాల వద్ద పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. పంజగుట్ట సర్కిల్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మాజీ మంత్రి జానారెడ్డి, మాజీ ఎంపీ హన్మంత్ రావు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ అనిల్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టిపిసిసి చీఫ్ మహేషకుమార్ గౌడ్ మాట్లాడుతూ ఆధునిక భారత స్వాప్నికుడు రాజీవ్ గాంధీ అని, మహిళలకు గ్రామపంచాయతీలలో రిజర్వేషన్ ఇప్పించిన ఘనత రాజీవ్‌గాంధీ దే అని అన్నారు. శాంతి, స్వేచ్ఛ, సమానత్వం ద్వారా మానవాభివృద్ధిని సాధించవచ్చని ఐక్యరాజ్య సమితిలో రాజీవ్ గాంధీ ఇచ్చిన సందేశానికి ప్రపంచ దేశాధినేతల నుండి ప్రశంసలు వచ్చాయని మహేష్ గౌడ్ గుర్తుచేసుకున్నారు. ప్రపంచాన్ని అరచేతిలో చుట్టేసేలా జీవితంలో కీలకంగా మారిన సెల్ ఫోన్ వ్యవస్థకు పునాది వేసిన మహనీయుడు



బుధవారం పంజాగుట్టలో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

రాజీవ్‌గాంధీ అని అన్నారు. దేశ నిర్మాణంలో యువతను భాగస్వాములుగా మార్చాలనే ఉన్నతమైన ఆశయంతో చట్ట సవరణ చేసి ఓటు వేసే కనీస వయసును 21 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలకు తగ్గించారని గుర్తుచేశారు. రాజీవ్ గాంధీని స్మరించుకునే విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా సచివాలయం ప్రాంగణంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి గౌర వించుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర యువతకు స్వయం ఉపాధి కల్పన కోసం రాజీవ్ గాంధీ పేరిట రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. నవోదయ పాఠశాలు, కంప్యూటరీకరణ వంటి సాంకేతికవిప్లవంకు రాజీవ్ గాంధీబాటలు వేశారని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వి.హనుమం తరావు మాట్లాడుతూ, దేశంలో ఐటీ రంగానికి పునాదులు వేసిన మార్గదర్శి, నిరుపేదలకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడు, మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్థానికసంస్థల బలోపేతంతోనే రాజీవ్‌కు నిజమైన నివాళి

## గాంధీ భవన్‌లో కేన్సర్ బాధితుల కోసం మెగా రక్తదాన శిబిరం

**హైదరాబాద్,మే21,ప్రభాతవార్త:** స్థానికసంస్థల బలోపేతంతోనే రాజవ్‌కు నిజమైన నివాళి యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి అన్నారు. భారతరత్న మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 34 వ వర్ధంతి సందర్భంగా, బుధవారం గాంధీభవన్ లో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో కేన్సర్ బాధితుల కోసం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈకార్యక్రమానికి విశిష్టఅతిథితులుగా మాజీ ఎంపీ వి.హనుమంత రావు , మాజీ ఎంపీ, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ , రాష్ట్ర మత్స్యకారుల కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, రాష్ట్ర టిఎం ఆర్ ఇఐఎస్ వైస్ చైర్మన్ ఫహీమ్ ఖురేషి, యువ జన కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జ్ సయ్యద్ ఖాలీద్ పాల్గొన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారిని అభినందించి ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జక్కిడి శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ భారతదేశాన్ని ఆధునిక టెక్నాలజీ వైపు నడిపించిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రయువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు పలు జిల్లాల,నియోజకవర్గాల నాయకులు పాల్గొన్నారు.

# ఆదివాసి విద్యార్థులు తమ ప్రత్యేకతను కాపాడుకోవాలి

## గిరిజన విద్యార్థుల అకడెమిక్ సక్సెస్ మీట్‌లో మంత్రి సీతక్క



**హైదరాబాద్,మే 21,ప్రభాతవార్త:** ఆదివాసీ గిరిజన విద్యార్థులు తమ ప్రత్యేకతను కాపాడుకోవాలని పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క సూచించారు. బుధవారం బంజారాహిల్స్ లోని కొమురం భీం ఆదివాసి భవన్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అకడమిక్ సక్సెస్ మీట్ 2025 కార్యక్రమానికి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె టెన్త్, ఇంటర్, ఎంసెట్, జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచిన గిరిజన విద్యా సంస్థల విద్యార్థులను సన్మానించారు. చదువులో సత్తా చాటిన గిరిజన విద్యార్థులకు, గిరిజన విద్యా సంస్థల సిబ్బందికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. విద్యకు సిఎం రేవంత్ రెడ్డి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని, 8 ఏళ్ల తర్వాత డైట్ ఛార్జీలు, 16 ఏళ్ళ తరువాత కాస్మొటిక్ ఛార్జీలు పెంచినట్లు చెప్పారు. ఎస్సి విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని అందుకే గిరిజన విద్యా సంస్థల్లో ఉత్తీర్ణత శాతం పెరుగుతోందన్నారు. వచ్చే ఏడాది మరింత మెరుగైన ఫలితాలు సాధిం చాలన్నారు. ఈ ఏడాది నుంచి ఏడాదికి 2 సార్లు టీచర్స్‌కు శిక్షణ ఇవ్వనున్నామని పాఠశాలలు ప్రారంభమయ్యే సమయంలో ఒకదఫా, దసరా సంక్రాంతి మధ్య లో రెండో దఫా ట్రైనింగ్ ఇస్తామన్నారు. 2014 వరకు మన జాతుల మీద, గిరిజన సంస్కృతి మీద పరిశోధన జరిగిందని, గత పది సంవత్సరాల్లో మనసంస్కృతిపై అధ్యయన పరిశోధనలు తగ్గిపోయాన్నారు. బిఆర్ఎస్ పాలనలో ఐటిడిఏలు నిర్వీర్యం అయ్యాయని వీటిని తిరిగి బలోపేతం చేయాలని సిఎం కోరినట్లు తెలిపారు. పది, ఇంటర్ తరువాత స్టూడెంట్స్ గైడెన్స్ దొరకట్లేదని సరైనా మార్గదర్శనం అవసరం అన్నారు. మనల్ని మనం గౌరవంవించుకోవాలనే మొదటిసారిగా ప్రతిభా పురస్కార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, ప్రతిభా పురస్కారాలు అందుకోలేక పోయిన విద్యార్థులు మరింత పట్టుదలతో చదవాని సూచించారు. ట్రైబల్ అని చెబితే సమాజంలో చిన్నచూపు చూస్తారనే భావన ఇప్పటికి విద్యార్థుల్లో ఉందని అయితే వీటికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. మన జాతుల నుంచి ఐఏఎస్, ఐపిఎస్, ఎమ్మెల్యేలు, మంత్రులు ఉన్నారని, మనం ఎవరికి తక్కువ కాదన్నారు.

# రైతు సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

## వానలు పడుతున్నా రైతులకు అందుబాటులో లేని విత్తనాలు: హరీష్‌రావు

**జహీరాబాద్, మే 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రైతుల సమస్యలను పరిష్కరించడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని మాజీ మంత్రి, సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం సంగారెడ్డి జిల్లా నియోజకవర్గ కేంద్రమైన జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరీష్‌రావు మాట్లాడుతూ వర్షాకాలం మొదలైనా రైతులకు ఇంత వరకు జనుము జీలుగా, పచ్చిరొట్టె విత్తనాలు సరఫరా చేయకపోవడంతో పాటు విత్తనాల ధరలను పెంచడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. రైతు బంధు, రైతు భీమా పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం రామ్ రామ్ పలికిందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాడిన నాటి నుంచి ఇంత వరకు మూడు మార్లు ఇవ్వాల్సిన రైతు బంధు డబ్బులను ఇంత వరకు ఇవ్వలేదన్నారు. వితనాలు, మద్యం ధరలు పెంచుతూ ధరల పెంచడం సర్కార్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం మారిందన్నారు. సన్న బియ్యానికి బోనస్ ఇస్తున్నామని చెప్పి అసలు ధాన్యానికి 72 కోట్ల రైతులకు ప్రభుత్వం బాకీ పడిందన్నారు. 25శాతం ధాన్యం ఇంకా కల్లాల్లోనే అకాల వర్షాలకు తడుస్తున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి విత్తనాలను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.



బుధవారం మీడియతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు

**బిఆర్ఎస్ హయాంలోని పథకాలకు సిఎం ప్రారంభోత్సవాలా:** జహీరాబాద్ పట్టణంలో బిఆర్ఎస్ హయాంలో మంజూరు చేసిన రైల్వే ఫ్లైఓవర్ బ్రిడి, ఝరాసంగం మండలంలోని కేంద్రీయ విద్యాలయం, నిమ్స్ 100 ఫీట్ల రోడ్డు నిర్మాణానికి తను శంకుస్థాపనలు చేశానని గుర్తు చేశారు. బసవేశ్వరుడి విగ్రహ స్థలంతో పాటు తనతో పాటు మాజీ ఎంపి బిబి పాటిల్, డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్‌లు ఆర్థిక సహాయం అందించిన బసవేశ్వర విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఏ విధంగా ప్రారంభోత్సవం చేస్తారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జహీ రాబాద్‌కు 100 కోట్ల నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్, బిఆర్ఎస్ నాయకుడు గుండప్ప, ఉమాకాంత్ పాటిల్, కిజర్ యాఫై, రామారావు, రాజేందర్, తట్టు నారాయణ, విజయ్‌కుమార్, షేక్ ఫరీద్, నర్సింలు, సంజీవరెడ్డి, తస్లీమ్, మోహియోద్దిన్, మచ్చేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మసిస్టులను నియమించండి

## మంత్రి దామోదర రాజనర్సింహాకు విజ్ఞప్తి చేసిన ఫార్మసిస్టు ప్రతినిధులు

**హైదరాబాద్,మే 21 ,ప్రభాతవార్త :** రాష్ట్రంలో అన్ని బస్తీ ,పల్లె దవాఖానలలో ఫార్మసిస్ట్స్ లను నియమించాలని తెలంగాణ ప్రభుత్వ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులువైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదరరాజనర్సింహాకు విజ్ఞప్తి చేశారు. బుధవారం వారు ఆయన నివా సంలో కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. అన్ని జిల్లాలో డిఎంహెచ్‌వో పరిధిలోని ఫార్మసీ స్టోర్స్ ,వ్యాక్సిన్ స్టోర్స్‌లలో, మలేరియా, లెప్రసీ, టీబీ సెంటర్లలో ఫార్మసిస్టులను నియమించాలన్నారు. తమ విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఫార్మసిస్ట్‌లబృందం ప్రతినిధులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఫార్మసిస్ట్ అసోసియేషన్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ శరత్, అహమదుల్లా, కె.లావణ్య తదితరులు ఉన్నారు.

# 4యేళ్ల క్రితం మహిళ హత్యకేసులో కోర్టు తీర్పు

## నిందితుడికి జీవితఖైదు, రూ.8 వేలు జరిమానా



నిందితుడు రాములు

**ఘట్‌కేసర్, మే 21, ప్రభాతవార్త:** 4 ఏళ్ల క్రితం జరిగిన మహిళా హత్య కేసులో నిందితుడికి జిల్లా న్యాయస్థానం జీవితఖైదుతో పాటు రూ.8 వేలు జరిమానా విధించింది. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పందిరి పరుశురాం తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం అంకుశాపూర్ రైల్వేట్రాక్ సమీపంలో చెట్ల పొదల్లో ఓ గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. 2021 జనవరి 4న అంకుశాపూర్‌కు చెందిన కొండల్ రైల్వే అధికారి గ్యార బాలస్వామికి ఫోన్ చేసి శవంకు సంబంధించిన సమాచారం ఇచ్చాడు. అంకుశాపూర్ రైల్వేట్రాక్ యూనిట్ 3 కెఎంస్టోన్ నెం.218/16-18 సమీపంలో 35 నుంచి 45 సంవత్సరాలు కల్గిన మహిళా మృతదేహాన్ని పరిశీలించారు. శవం కుళ్లి పోయిన స్థితిలో ఉండి ముఖ కాలిపోయిందని గుర్తుతెలియని వ్యక్తులు ఆమె ఇక్కడికి తీసుకు వచ్చి హత్య చేశారని బాలస్వామి ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఇన్‌స్పెక్టర్ చంద్రబాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొన సాగించారని తెలిపారు. దర్యాప్తులో హత్యగావించబడ్డ మహిళ కూర వెంకటమ్మగా గుర్తిం చారు. కేసు విచారణలో ఆమెను సంగారెడ్డి జిల్లా కంది మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన మైనం రాములు అలియాస్ బొట్టు రాములు (47) హత్య చేసి రైల్వేట్రాక్ సమీపంలో శవాన్ని వదిలిపెట్టి వెళ్లాడని తర్వాత నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారని తెలిపారు. దర్యాపు పూర్తయిన తర్వాత నిందితుడిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారని ఈమేరకు బుధవారం మేడ్చల్ జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి కేసు పూర్వాపరాలు పరిశీలించి ఇరువాదనలు విన్న అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావడంతో అతనికి 'జీవితఖైదుతో పాటు రూ.9 వేలు' జరిమానా విధించారని సీఐ పరుశురాం తెలిపారు.

# 9,999 బిల్లులు క్లియర్

## పంచాయతీలకు రూ.153 కోట్లు, ఎస్‌డిఎఫ్‌కు రూ.85 కోట్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే21:** పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈమేరకు బుధవారం సాయంత్రం గ్రామ పంచాయతీలకు రూ.153కోట్లను విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న 9,990బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం ఒకే రోజున క్లియర్‌చేసింది. ఈఒకే విడతలో రూ.10 లక్షల లోపు బిల్లులను ప్రభుత్వం చెల్లించింది. ఈ క్రమంలో 2024 ఆగస్టు వరకు పెండింగ్‌లో ఉన్నబిల్లులను చెల్లించేందుకు ప్రాధాన్యం ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం పాత బకాయిలను చెల్లించేందుకు సన్నద్ధమై నిధులను సమకూర్చింది. కాగా, పంచాయతీలకు రూ.153 కోట్లు, వీటితో పాటు ఎస్‌డీఎఫ్ (ప్రత్యేక అభివృద్ధి నిధి) కింద చేపట్టిన వివిధ పనులకు రూ.85 కోట్లు విడుదల చేసింది. కాగా చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని కొన్నిరోజులుగా కాంట్రాక్టర్లు, సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని కోరుతూ ధర్నాలకు దిగారు.

# సునీతారావుకు షోకాజ్ నోటీసులు

**హైదరాబాద్,మే21,ప్రభాతవార్త:** తెలంగాణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతా రావుకు అఖిలభారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలంబా షోకాజ్ నోటీసు జారీచేశారు. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ తన ఇంటికి పదవులు ఇచ్చుకొన్నారని చేసిన వ్యాఖ్యలు, గాంధీ భవన్‌లో నిరసన చేయడాన్ని కాంగ్రెస్ అధిష్టానం తప్పుబట్టింది. క్రమశిక్షణను ఉల్లంఘించినందుకు సునీతా రావుకు జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నోటీసు జారీ చేశారు. సునీతా రావుకు ఏమైనా ఇబ్బంది ఉంటే పార్టీలో చర్చించాలి కానీ బహిరంగంగా మాట్లాడడం తప్పని దీనిపై 7 రోజుల్లో వివరణ ఇవ్వాలని జాతీయ మహిళా కాంగ్రెస్ లేఖలో పేర్కొంది. వివరణ ఇవ్వకపోతే కాంగ్రెస్ నిబంధనల మేరకు చర్యలు ఉంటాయని నోటీసులో అధిష్టానం స్పష్టం చేసింది. టీపీసీసీ చీఫ్ ఛాంబర్ ఎదుట సునీతారావు ధర్నాకు దిగారు. కాంగ్రెస్ మహిళా నేతలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని పోస్టుల విషయంలో మహిళా నాయకులను పార్టీ పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపిస్తూ మహిళా నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. ప్రభుత్వం, కార్పొరేషన్ పదవుల్లోనూ మహిళా నేతలకు సరైన ప్రాధాన్యత దక్కడం లేదని విమర్శించారు. మహేష్ గౌడ్ బంధువులకే పదవులు కట్టబెడుతున్నారంటూ ఆరోపణలు గుప్పించారు. కార్పొరేషన్లు, పార్టీ కమిటీల్లో మహిళా కాంగ్రెస్ నేతలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ సునీతారావు గాంధీ భవన్‌లో ఆందోళనకు దిగారు.

# విశ్రాంత ఐఎఎస్ నాగేశ్వర రావు గుండెపోటుతో మృతి



నాగేశ్వర రావు(ఫైల్)

**హైదరాబాద్, మే21, ప్రభాతవార్త:** విశ్రాంత సీనియర్ ఐఎఎస్ అధికారి గోపిశెట్టి నాగేశ్వర రావు గుండెపోటుతో బుధవారం రాత్రి కన్ను మూశారు. 1988 బ్యాచ్‌కు చెందిన జిఎన్ రావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ హోదాలలో పని చేసి అందరి నుండి ప్రశంసలు అందుకున్నారు. గుంటూరు కలెక్టర్‌గా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో యువజన సర్వీసెస్ శాఖ కమిషనర్‌గా, పౌరసరఫరాలశాఖ కమిషనర్‌గా, జౌళి శాఖ కమిషనర్‌గా, ఉన్నత విద్యశాఖ కమిషనర్‌గా శిల్పారామం స్పెషల్ ఆఫీసర్‌గా, రాష్ట్ర ప్రభుత్వ రంగసంస్థ సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సేవలందించారు. ఆయన అకాల మృతి పట్ల పలువురు సీనియర్ ఐఎఎస్ అధికారులు ప్రభుత్వ ఉన్నతాధికారులు తమప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు. ఆయన అంత్యక్రియలు మహాప్రస్థానంలో శుక్రవారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

# సకాలంలో ఎరువులు సరఫరా చేయాలి

## కేంద్రానికి వ్యవసాయ మంత్రి తుమ్మల లేఖ

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** తెలంగాణకు కేటాయించిన ఎరువులను సకాలంలో విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జె.పి. నడ్డాకు రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాయడం జరిగింది. ఎప్రిల్, మే నెలలకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన ఎరువులను పూర్తి మొత్తంలో సరఫరా చేయాల్సిందిగా లేఖలో కోరారు. వచ్చే వానాకాలానికి 9.80 లక్షల టన్నుల యూరియాను కేంద్రం రాష్ట్రానికి కేటాయించింది. దానిలో భాగంగా ఎప్రిల్‌లో 1.70 లక్షల టన్నులు, మేలో 1.60 లక్షల టన్నులు కేటాయింపులు చేయగా, గత నెలలో కేవలం 1.20 లక్షల టన్నులు, ఈ నెలలో ఇప్పటి వరకు 52 వేల టన్నులు మాత్రమే సరఫరా చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర అవసరాల దృష్ట్యా కేటాయింపులు జరిపిన విధంగా వెంటనే యూరియాను పంపించాల్సిందిగా పేర్కొన్నారు. రాష్ట్ర సర్కార్ గత ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా వానాకలం సీజన్ ఆరంభం నాటికి 4 లక్షల నుండి 5 లక్షల టన్నుల మేరకు యూరియాను ముందస్తుగా నిల్వచేసి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ నిల్వలు, అప్పుడు సరఫరా కాబడే యూరియాతో కల్సి రైతులకు అందచేయడం ద్వారా ఎక్కడా ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా చూస్తున్నామని తెలియచేశారు.

# క్రిమినల్ కేసులు పెట్టినా దారికి రాని మిల్లర్లు

## రూ.2359.61కోట్ల ధాన్యం బకాయిలు ఇంకా చెల్లించని మిల్లులు, 153 రైసు మిల్లర్లపై

## క్రిమినల్ కేసులు నమోదు: పౌరసరఫరాలశాఖ కమిషనర్ డిఎస్‌చౌహాన్



**హైదరాబాద్,మే 21,ప్రభాతవార్త:** రైసు మిల్లర్ల మాయాజాలానికి ప్రభుత్వం చిత్తవుతోంది. ధాన్యం బకాయిలు వసూలు కోసం క్రిమినల్ కేసులు పెట్టినా మిల్లర్లు దారికి రావడంలేదు. తెలంగాణ వ్యాప్తంగా 153 రైసుమిల్లు యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినా ఇంకా రూ.2359.61కోట్ల విలువగలిగిన ధాన్యం చెల్లించడంలేదు. అనేక సంవత్సరాలుగా కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) అందజేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్న రైస్‌మిల్లులపై పౌరసరఫరాలశాఖ కమీషనర్ డిఎస్‌చౌహాన్ ఉక్కుపాదం మోపినారు. ధాన్యం సేకరణ, కస్టమ్ మిల్లింగ్కు సంబంధించి 2015, 2016లలో విడుదలైన 18, 36 జీవోలు వాటికి సవరణ చేస్తూ 2023 అక్టోబర్లో జారీ చేసిన జీవో నంబర్ 25ను ప్రభుత్వం తెరపై తెచ్చారు. ఈ జీవో ప్రకారం రాష్ట్రంలోని ప్రతి రైస్ మిల్లు దాని కెపాసిటీలో కనీసం 50శాతం మే ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని సీఎంఆర్ చేయాల్సి ఉంటుంది. లేదంటే మిల్లు లైసెన్స్ రద్దు చే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. దీనితో కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాని దించుకోమని మిల్లర్లు మొండికేసే పరిస్థితి ఇక ఉండదని భావించారు. అంతే కాదు 1777 రైసుమిల్లులను డిఫాల్టర్లుగా గుర్తించి వారి వద్ద పేరుకుపోయిన రూ.4488.68కోట్ల విలువైన ధాన్యం తిరిగి స్వాధీనం చేసుకోవడానిక తీవ్రంగా ఒత్తిడి పెంచారు. ఫలితంగా రూ.2129.07 కోట్ల విలువైన ధాన్యం లేదా నగదు మొత్తానికి రైసుమిల్లర్ల నుంచి మొత్తానికి ఇప్పటి వరకు తిరిగి రాబట్టారు.కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) అందజేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్న రైస్‌మిల్లులపై ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది.

ప్రభుత్వం నుంచి ధాన్యం స్వీకరించి నిబంధనల మేరకు మర ఆడించిన బియ్యాన్ని తిరిగి ఇవ్వడంలో వైఫల్యం చెందిన రైస్ మిల్లుల్లో పౌరసరఫరాల శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. తనిఖీల్లో ధాన్యాన్ని పక్కదారి పట్టించి బియ్యం సరఫరాలో చేతులెత్తేసిన రైస్ మిల్లుల యాజమాన్యాలపై ఏకంగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. పౌరసరఫరాల విజిలెన్స్ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. సమయానికి సిఎంఆర్ అందించకుండా తాత్సారం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేర కు క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు ప్రక టించడమే కాకుండా 25 జిల్లాలోని రైసుమి ల్లులపై కేసులు నమోదు చేవారు. భద్రాద్రి కొత్త గూడెంలో 1 రైసుమిల్లుపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. హనుమకొండ జిల్లాలో 11, జగిత్యాల4, జనగామ2,జయశంకర్‌భూపాలపల్లి2,జోగులాంబ గద్వాల 3,కామారెడ్డి2,కరీంనగర్4, ఖమ్మం1, మహబూబాబాద్4,మంచిర్యాల1,మెదక్12, ములుగు1,నాగర్‌కర్నూల్ 6,నల్లగొండ3, నారాయణపేట6, నిర్మల్7, నిజామాబాద్20, పెద్దపల్లి 4,రంగారెడ్డి1,సిద్దిపేట 5,సూర్యపేట 11,వనపర్తి 16,వరంగల్25,యాదాద్రి భువనగిరి 1 చొప్పన కేసులు నమోదైనాయి. సిఎంఆర్ ఇవ్వడంలో జాప్యం చేసే వారికి భవిష్యత్తులోనూ ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు. రాబోయే రోజుల్లో అలాంటి వారికి ధాన్యం కేటాయింపులు సైతం ఉండబోవని స్పష్టం చేస్తున్నారు. రైసుమిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో మిల్లుల రైస్‌మిల్లుల యాజమాన్యాల్లో వణకుమొదలైంది. పెనాల్టీతోకలిపి 432 మిల్లులు 125శాతం బకాయిలు క్లియర్ చేశాయి.278 మిల్లులు వందశాతం బకాయిలు తిరిగి చెల్లించారు.

505మిల్లులు వంద శాతంలోపు బకాయిలు చెల్లించాయి. అత్యధికంగా వరంగల్ జిల్లాలో 25 రైసుమిల్లులపై క్రిమి నల్‌కేసులు నమోదు కాగా, రెండోస్థానంలో నిజామాబాద్ రైసుమిల్లర్లు నిలిచిఉన్నారు. వనపర్తి 16కేసులతో మూడో స్థానంలో ఉంది. మెదక్, హనుమకొండ, సూర్యాపేటలో 11 చొప్పన క్రిమినల్ కేసులు నమోదై

# సమగ్రశిక్ష నిధులు రూ.2291 కోట్లు విడుదలచేయించండి

## సుప్రీంకోర్టు తలుపులు తట్టిన స్టాలిన్ సర్కార్



**న్యూఢిల్లీ, మే 21:** కేంద్ర ప్రవేశపెట్టిన కొత్త జాతీయ విద్యావిధానాన్ని అమలుచేయలేదని తమిళనాడుప్రభుత్వానికి కేంద్రంనుంచి రావాల్సి న రూ.2291 కోట్ల నిధులను నిలిపివేసారని ఈనిధులు తక్షణమే విడుదలచేసేవిధంగా కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ తమి ళనాడు స్టాలిన్‌ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సమగ్ర శిక్షా స్కీంకింద రావాల్సి న నిధులు ఇప్పటికీ రాష్ట్రాలని విడుదలచేయ లేదన్నారు. కేవలం పిఎంశ్రీ స్కీంను అమలు చేయలేదన్న కక్షతోనే ఈ నిధులు నిలిపివేసిందని, త్రిభాషా సూత్రానికి వ్యతిరేకంగాను, ఎన్ఈపీ 2020కి వ్యతిరేకంగా ఉన్నందువల్లనే కేంద్రం ఇలా వ్యవహరించిందని స్టాలిన్ సర్కారు వాద నలు వినిపించింది. కేంద్ర ప్రభుత్వం వెంటనే 2291.30 కోట్లు విడుదలచేసేవిధంగా ఆదేశాలు జారీచేయాలని కోరింది. అంతేకాకుండా ప్రిన్సిపల్ మొత్తం 2151.59 కోట్లు ఆపై వడ్డీ ఆరుశాతం చొప్పున మొత్తం 2291.30 కోట్లు విడుదల చేయించాలని సుప్రీంకోర్టునుఅ భ్యర్థించింది. అంతకుముందే సీఎం స్టాలిన్ తమిళనాడులో ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రభుత్వం నిధుల నిలిపివేతపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. గతంలో గవర్నర్ ఆర్ఎన్‌రవికి ఇచ్చినట్లుగానే తమిళనాడుకు ఈ నిధుల పరంగాను న్యాయంచేయాలని కోరతామన్నారు. నిధులు విడుదలకు కేంద్రం అన్ని మార్గాలను మూసివేసిందని, అందువల్లనే తాము ఇక న్యాయవ్యవస్థను ఆశ్రయించాల్సి వస్తోందని చెప్పారు. విద్యాశాఖపై కేంద్ర పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫారసులుచేసినా కూడా కేంద్రం నిధులు విడుదలలో నిర్లక్ష్యం వహించిందన్నారు. సమాఖ్య తత్వానికి విరుద్ధంగా తమిళనాడు వ్యవహరిస్తున్నందున సమగ్రశిక్ష అభియాన్ నిధులు పొందేందుకు అర్హులు కాదని కేంద్రం వాదించింది. ప్రస్తుత విద్యావ్యవస్థ అనుసరిస్తున్న విధానాన్ని కాదని ఎన్ఇపి2020ని రాష్ట్రం మొత్తం అమలుచేయా లని కేంద్రం ఒత్తిడితెస్తోందని, అందుకే నిధులు నిలిపివేసిందని తమిళనాడుప్రభుత్వం చేసిన వాదనలను కేంద్రం కొట్టిపారేసింది.

# సంక్షోభ సమయంలో ఈ వ్యాఖ్యలు అవసరమా?

## రెండు ఎఫ్ఐఆర్‌లు కొనసాగాల్సిందే..

## ముగ్గురు ఐపిఎస్‌లతో సిట్ ఏర్పాటుకు ఆదేశం

## అశోక్ వర్సిటీ ప్రొఫెసర్‌కు బెయిల్ మంజూరు



**న్యూఢిల్లీ, మే 21:** అశోక యూనివర్సిటీ ప్రొఫెసర్ అలిఖాన్ మహ్మమ్మదాబాద్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరుచేసింది. ఆపరేషన్ సింధూర్‌పై ఆయన విద్వేషపూరితభావజాలంతో ఆన్‌లైన్ పోస్టులు పెట్టినందుకు ఆయన్ను అరెస్టుచేసిన సంగతి తెలిసిందే. అయితే కోర్టు ఆతడిపై నమోదుచేసిన రెండు ఎఫ్ఐఆర్‌లను రద్దుచేసేందుకు నిరాకరించింది. హర్యానాపోలీసులు దర్యాప్తు కొనసాగిస్తారన్నారు. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్‌సింగ్‌ల ధర్మాసనం ఆయన పోస్టుచేసిన వ్యాఖ్యలపై దర్యాప్తుకోసం ఒక సిట్ ఏర్పాటుచేయాలని హర్యానా డిజిపిని ఆదేశించింది. మహ్మూదాబాద్ తనఅరెస్టును సవాల్‌చేస్తూ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తన వ్యాఖ్యలను పూర్తిగా అపార్థంచేసుకున్నారని వాదించాడు. తాత్కాలిక బెయిల్‌పై విడుదల చేసేముందు సుప్రీంకోర్టుఆయనకు షరతులు విధించింది. ఇకపై ఎలాంటిపోస్టులుకానీ, వ్యాఖ్యానాలు కాని ఆన్‌లైన్‌లో చేయకూడదని పేర్కొంది. అలాగే ఆయన ఎక్కడా ప్రసంగాలు కూడా చేయకూడదని ఈకేసు విచారణకు సంబంధించి కూడా వ్యాఖ్యలు చేయవద్దని హెచ్చరించింది. అలాగే ప్రస్తుత సంక్షోభంపైనా ఎలాంటి వ్యాఖ్యలుచేయకూడదన్నారు. భారత గడ్డపై ఉగ్రవాదుల దాడి భారత్ స్పందన వంటి వాటిపై ఇకముందు మాట్లాడకూడదని సూచించింది. అంతేకాకుండా ఆలీ మహ్మూదాబాద్ తన పాస్‌పోర్టును పోలీసులకు అప్పగించాలని ఆదేశించారు. బెయిల్ బాండ్లు సమరినపంచిన తర్వాత సోనెపట్ సిజిఎం సంతృప్తి వ్యక్తంచేస్తే బెయిల్ పొందుతారని, రెండు ఎఫ్ఐఆర్‌లకు ఒకే సెట్ బాండుపేపర్లు అందచేయవచ్చని సూచించింది. భావప్రకటనాస్వేచ్ఛను హద్దుల్లో ఉంచుకోవాలని, ఇతరులను రెచ్చగొట్టేవిధంగా వ్యాఖ్యలు ఉండకూడదని సుప్రీం హెచ్చరించింది. ఆతడు వాడిన పదాలు కూడా కొంత ధ్వంద్వార్థాలు వస్తాయన్నారు. ప్రతిఒక్కరికీ స్వేచ్ఛ ఉన్నా మతవిద్వేషాలకు సంబంధించిన వ్యాఖ్యలు చేయవచ్చా అని ప్రశ్నించారు. ఇప్పటికీ దేశం సవాళ్లు ఎదుర్కొంటున్నదని ఉగ్రవాదంపై ఎంతో వ్యూహాత్మకంగా పనిచేస్తోందని గుర్తుచేసారు. కొందరు సన్యాసులు ఇతరప్రాంతాలనుంచి వచ్చి అమాయకులను పొట్టనపెట్టుకున్నారన్నారు. ఈదశలో మీరు ఎలాంటి వ్యాఖ్యలు ఎలా చేస్తారు, ఎందుకు చేసారు. కేవలం చౌకబాదు ప్రతిష్టకోసమే ఇలాంటిపనులుచేస్తే తీవ్రస్థాయి చర్యలుంటాయని సుప్రీంబెంచ్ హెచ్చరించింది. తన ఆన్‌లైన్ పోస్టులోమహ్మూదాబాద్ పాకిస్థాన్‌ప్రాయోజిత ఉగ్రవాదం ఖండించారు. కల్నల్‌సోఫియా ఖురేషి చేసిన మీడియా వివరణలు క్షేత్రస్థాయిలో ప్రభావం చూపిస్తాయన్నారు. వామపక్ష అతివాద మద్దతుదారులు ఈ మూక హత్యలపై మాట్లాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇక రెండు ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి న్యాయమూర్తులు ఈ రెండు ఎఫ్ఐఆర్‌లను నిలిపివేయాల్సిన అవసరం లేదని, విచారణ అవసరం ఉందని భావించారు. అయితే హర్యానా డిజిపి ఈ కేసులపై సిట్ ఏర్పాటుచేసి ముగ్గురు ఐపిఎస్ అధికారులను హర్యానా, ఢిల్లీకి చెందని వారితో సిట్ ఏర్పాటుచేసి దర్యాప్తు పూర్తిచేయాలన్నారు. ఐజిస్థాయి అధికారి సిట్‌కు నేతృత్వం వహించాలనిసూచించారు.

# వేతనాలు అందించు 'స్వామీ'!

## ఆవేదన వ్యక్తం చేస్తున్న అర్చక సిబ్బంది, గ్రాంట్ ఇన్ ఎయిడ్ కూడా అంతంత మాత్రమే

**హైదరాబాద్,మే 21, ప్రభాతవార్త :** వేద మంత్రోచ్చారణతో తెల్లవారుతుండగానే దేవుని మేల్కొలిపే స్వరం వారిది..లోకో సుఖినో భవంతు అని దీవించే చేతులవి..పార్టీలకు అతీతంగా దేవాలయాలకు ఎవరు వచ్చినా విజయి భవ అనే ఆశీర్వాదించే చేతులు నేడు తమకు సకాలంలో వేతానాలు అందించేలా చూడమని భగవంతుని కోరుకుంటున్నాయి.ముఖ్యంగా సిఎం స్థాయి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు,ఉన్నతాధికారులు ఎవరు వచ్చినా వారి ప్రాధాన్యతను బట్టి పూర్ణకుంబంతో ఎదురు వెళ్ళి స్వాగతించే అర్చకులు నేడు.. సమాయానికి వేతనాలు అందించే విధంగా ప్రభుత్వ పెద్దల మనసు మార్చాలని, భగవంతుని ప్రార్థిస్తూ దేవుడి మీధ భారం వేసి బతుకులీడుస్తున్నారు.ప్రతి నెలా సమయానికి వేతనాలు అందక పోవడంతో అర్చకులు పడే బాధలు అన్ని ఇన్నీ కావు. వేతనాలు అందక పోవడంతో వారు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు.గతంలో ప్రభుత్వ ద్యోగులు అంటే వెంటనే లోన్లు ఇచ్చే బ్యాంకులు నేడు వారికి లోన్లు ఇచ్చేందుకు వెనకామందాడుతున్నాయి. గతంలో తీసుకున్న లోన్లు, లేదా నెలసరి కిస్తీలను సరయిన సమయంలో కట్టక పోవడంతో ఆయా ఆర్థిక సంస్థల నుంచి నోటీసులు ,బెదిరింపులు వస్తుండటంతో ఏమి చేయాలో పాలుపోక వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సరైన సమయంలో వాయిదాలు చెల్లించక పోవడంతో వారి సిబిల్ స్కోర్ కూడా 625 నుంచి 700 పాయింట్లకు పెరగక పోవడంతో ఆర్థికంగా వారిని ఆదుకునేందుకు ఏ బ్యాంకులు కూడా ముందుకు రావడం లేదు. గతంలో ప్రతి నెల 1వ తేదీన వేతనాలు పడుతుండగా నెలలో సగం రోజులు పూర్తయినా వేతనాలు అందడం లేదని అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గత కొన్ని నెలలుగా సరైన సమయానికి వేతనాలు అందడం లేదంటున్నారు. ప్రతి నెలా 1వ తేదీన అన్ని ప్రభుత్వ భాగాలకు వేతనాలు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వ పెద్దలు దేవాదాయశాఖకు చెందిన ఉద్యోగులకు మాత్రం ఎందుకు వేతనాలు పడటం లేదు.తాము ఏమి పాపం చేశామో అర్థం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2017 సంవత్సరంలో విడుదల చేసిన జీవో నెం 577 ప్రకారం దేవాదాయ శాఖ ఆలయ అర్చక ఉద్యోగులు 5625 మందిని గ్రాంట్ ఇన్ ఎయిడ్ లో చేర్చాలి కానీ నేటి వరకు విడతలవారీగా కేవలం 2900 మందిని మాత్రమే చేర్చారు. అది కూడా నెల చివర్లో వేతనాలు అందుకుంటున్నారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్‌లో చేర్చడంతో ఉద్యోగులకు చాలీచాలని వేతనాలతో నెలల కొద్ది వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నారు. అర్చక ఉద్యోగులకు సర్వీస్ ఇంక్రిమెంట్ ఇవ్వడం నిలిపివేయడంతో వారు ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. సుమారు ఒక సంవత్సరం నుంచి ఇంక్రిమెంట్లు ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కారుణ్య నియామకాల్లో ఉన్నా దాదాపు 130 నుంచి 140 మంది ని గ్రాంట్ ఇన్ ఎయిడ్ లో చేర్చమని అర్చకులు గత నాలుగైదు సంవత్సరాల నుంచి కోరుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అందుకు సంబంధించి ఫైల్ తుది దశలో ఉందని,అర్చక ఉద్యోగులకు నెలల కొద్ది వేతనాలు ఇవ్వక అందులో కొంతమందికి అపాయింట్‌మెంట్స్ ఇవ్వకుండా కొంత మొత్తం చెల్లించడం చట్ట విరుద్ధమంటున్నారు.కొంతమందికి కమిషనర్ ఉత్తర్వులు ఉండి కూడా వారిని చేర్చుకోకపోవడంతో సంవత్సరాలు గుడుస్తున్నా సమస్య మాత్రం పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా సిబ్బంది సంఖ్యను పెంచక పోవడంతో పని వత్తిడి పెరుగుతోందని, ముఖ్యంగా పుణ్యదినాల్లో పని భారం మరింత పెరుగుతోందంటున్నారు. దేవాదాయ శాఖలో ఉన్న అర్చక ఉద్యోగులు వారాంతపు సెలవులు లేక పండుగకి ఉద్యోగాలు చేస్తూ కుటుంబానికి దూరంగా విధులు నిర్వహిస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దేవాదాయశాఖ ఆదీనంలో ఉన్న సుమారు 704 ఆలయాల్లో ప్రతి సంవత్సరం ఆలయాల్లో ఆదాయం పెరుగుతున్నా వేతనాల పెంపునకు సంబంధించి ప్రభుత్వ పెద్దలు నిర్ణయం తీసుకోవాలని ఈ విషయంపై అనేక మార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యనిర్వహణ అధికారులు పదవి విరమణ చెందడం,మరి కొంతమంది అకస్మాత్‌గా మృతి చెందడం, క్లర్కులు, ఇతర సిబ్బంది తగినంత లేక పోవడంతో ఉన్న కొద్ది మందిపై పనిభారం అధికం అవుతోందంటున్నారు. గత కొద్ది సంవత్సరాలుగా ఇదే పరిస్థితి నెలకొందన్న వారు అదనపు సిబ్బందిని నియమించక పోవడంతో తాము ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇక నైనా ప్రభుత్వ పెద్దలు అర్చకులు సమస్యలు పరిష్కరించడమే కాకుండా సమయానికి వేతనాలు అందేలా చూడాలని కోరుతున్నారు.

# తిరుమలలో ఆధ్యాత్మికత ఉట్టిపడుతోంది

## తిరుమలలో నీరారాడియా

**తిరుమల, మే 21ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో ఆధ్యాత్మికత ఉట్టిపడుతోందని, దేవుడు ఇక్కడే కొలువై ఉన్నాడనే భావన కలుగుతుందని పారిశ్రామికవేత్త నీరారాధియా విశ్వాసం వ్యక్తం చేశారు. దేవుని దర్శనం అద్భుతంగా జరిగిందని, ఇక్కడ వ్యవస్థ బాగుందన్నారు. తిరుమలలో భక్తుల సదుపాయాలు సంతోషం కలిగిస్తోందన్నారు. తాను చేసిన ఆధ్యాత్మిక యాత్రలో కంటే తిరుమలలో దేవుడు కొలువై ఉన్నాడనేలా మనసు ఆనందంగా ఉందన్నారు. బుధవారం వేకువజామున శ్రీవారి అర్చన సేవలో ఆమె పాల్గొన్నారు. టిటిడి అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# ఢిల్లీకేపిటల్స్‌పై ముంబయి ఇండియన్స్ విజయం

## 59 పరుగుల తేడాతో ఢిల్లీ జట్టు ఓటమి



**ముంబయి, మే 21:** ఐపిఎల్ 18వ సీజన్‌లో చివరి ప్లే ఆఫ్స్ చివరి బెర్త్‌ను ముంబయి ఇండియన్స్ సాధించుకుంది. సొంతగడ్డపై ఢిల్లీ కేపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబయి 59 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. 13 మ్యాచ్‌ల్లో ఎనిమిదో విజయం అందుకున్న హార్థిక్ సేన పాయింట్లపట్టికలో టాప్-4 స్థానంలో ఉంది. ఇప్పటికే గుజరాత్ బెంగళూరు పంజాబ్‌ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించిన సంగతి తెలిసిందే. వాంఖడే వేదికగా జరిగిన మానయచ్‌ఓ సూర్యకుమార్ యాదవ్ 43 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్ససలతో 73 పరుగులుచేసి చెలరేగిపోయాడు. తొలుత బ్యాటింగ్‌చేసిన ముంబయి ఐదు వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో ఢిల్లీ 18.2 ఓవర్లలో 121 పరుగులకే ఆలౌట్ అయింది. సమీర్ రిజ్వీ 39 ఒక్కడే టాప్ స్కోరర్. విప్రాజ్ నిగమ్ 20, అశుతోష్ శర్మ 18పరుగులుచేసారు. కెఎల్‌రాహుల్ 11, డుప్లెసిస్ ఆరు అభిషేక్ పోరెల్ ఆరు, ట్రిస్టన్ స్టబ్స్ రెండుపరుగులతో తీవ్ర నిరాశపరిచారు. ముంబయి బౌలర్లలో మిచెల్ శాంట్నర్ మూడు,బుమ్రా 3, ట్రెంట్ బౌల్ట్, దీపక్ చాహర్, విల్‌జాక్స్, కర్ణ్ ఒక్కో వికెట్ తీసారు. ముంబయి బానయటర్లలో సూర్యకుమార్ కీలక ఇన్నింగ్స్ ఆడితే చివరిలో నమన్‌ధీర్ 24పరుగులు చేసి దూకుడు చూపించాడు. రికెల్‌టన్ 25, విల్‌జాక్స్ 21, తిలక్‌వర్మ 27 పరుగులు చేసారు. రోహిత్‌శర్మ ఐదు, హార్థిక్ పాండ్య మూడు పరుగులుచేసి నిరాశపరిచారు. ఢిల్లీ బౌలర్లు మంచి కట్టుదిట్టంగా బౌలింగ్‌చేయడంతో 18 ఓవర్లకు ఐదు వికెట్లనష్టానికి 132 పరుగులు చేసారు.

ముంబయి 160కూడా చేయడం కష్టమే అనిపించిన తరుణంలో చివరి రెండు ఓవర్లలో ముంబయి 48 పరుగులుచేసింది. ముకేశ్ వేసిన 19 ఓవర్‌లో సూర్యసిక్స్‌కొట్టి అర్థశతకం అందుకోగాతర్వాత నమన్‌ధీర్ వరుసగా నాలుగు, ఆరు ఆరునాలుగుచొప్పున బాదాడు. చమీరవేసిన చివరి ఓవర్‌లో సూర్యకుమార్ రెండుఫోర్లు, రెండు సిక్స్‌లు రాబట్టాడు. ఢిల్లీ బౌలర్లలో ముకేశ్ కుమార్‌రెండు, చమీర ముస్తాఫి జుర్, కుల్‌దీప్ యాదవ్ తలో వికెట్ తీసారు.

# వైమానిక దాడుల రక్షణకోసం 'గోల్డెన్‌డోమ్'

## 175 బిలియన్ డాలర్ల ఖర్చుతో ఏర్పాటుచేస్తున్న ట్రంప్



**న్యూయార్క్, మే 21:** భవిష్యత్తు రాబోయే యుద్ధాలను దృష్టిలో పెట్టుకుని అమెరికా ముందుగానే సమాయత్తమవుతోంది. ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారీ ప్రకటన చేశారు. ఇజ్రాయిల్‌లోని ఐరన్ డోమ్ తరహాలో అమెరికాకు గోల్డన్ డ్రోమ్‌ను రూపొందించనున్నట్లు చెప్పారు. సుమారు 175 బిలియన్ల డాలర్ల ఖర్చుతో ఆ డోమ్‌ను నిర్మించనున్నారు. బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులు, ఇతర వైమానిక దాడుల నుంచి అమెరికాను కాపాడుకునేందుకు గోల్డన్ డోమ్ క్షిపణి రక్షణ వ్యవస్థను రూపొందించనున్నట్లు ట్రంప్ చెప్పారు. గోల్డన్ డోమ్ క్షిపణి రక్షణ వ్యవస్థ తన పదవీ కాలం ముగిసేలోగా వినియోగంలోకి వస్తుందన్నారు. రాబోయే రోజుల్లో అమెరికాకు వైమానిక దాడుల నుంచి ప్రమాదం పొంచి ఉందని, ముఖ్యంగా బాలిస్టిక్, క్రూయిజ్ మిస్సైళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని, ఈక్రమంలో ఓ కొత్త ప్లాన్‌ను ప్రకటిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. గోల్డన్ డోమ్ కోసం ఈ సారి బడ్జెట్‌లో 25 బిలియన్ల డాలర్లు కేటాయించినట్లు చెప్పారు. మునుముందు ఆ డోమ్ కోసం భారీగా ఖర్చు చేసే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అత్యాధునిక ఆయుధాలు శత్రువుల వద్ద ఉన్నాయని, దానికి తగినట్లు రక్షణ వ్యవస్థను తయారు చేసుకోవాలన్నారు. గోల్డెన్ డోమ్ ప్రాజెక్టు నిర్మాణ పనులను స్పేస్ ఫోర్స్ జనరల్ మైఖేల్ గుట్లెన్‌కు అప్పగించారు. స్పేస్ ఫోర్స్‌లో ప్రస్తుతం ఆయన స్పేస్ ఆపరేషన్స్ వైస్ చీఫ్‌గా ఉన్నారు. ఏరియల్ దాడుల్ని అడ్డుకునేందుకు కావాల్సిన వ్యవస్థను రూపొందించాలని, దానికి కావాల్సిన ప్రణాళికలను తయారు చేయాలని ట్రంప్ ఇటీవల రక్షణ శాఖను ఆదేశించారు. దాని ప్రకారమే గోల్డెన్ డోమ్ కాన్సెప్ట్‌ను డెవలప్ చేశారు. వైట్ హౌజ్‌లోని ఓవల్ ఆఫీసులో ట్రంప్ మాటాడుతూ భూమి, ఆకాశం, నీటి యుద్ధాల్లో వాడే టెక్నాలజీ ఆయుధాలను ఎదుర్కొనే రీతిలో మిస్సైల్ రక్షణ వ్యవస్థ పనిచేయను న్నట్లు తెలిపారు. అంతరిక్ష ఆధారిత సెన్సార్లు, ఇంటర్ సెప్టార్లను కూడా తయారు చేయ నున్నారు. గోల్డెన్ డోమ్ రూపకల్పన కోసం కెనడాను కూడా భాగస్వామ్యం కావాలని కోరినట్లు ట్రంప్ వెల్లడించారు. డోమ్ ప్రాజెక్టులో తాము కూడా ఆసక్తిగా ఉన్నట్లు ఇటీవల ఆ దేశ రక్షణ శాఖ మంత్రి బిల్ బ్లెయిర్ తెలిపారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా అది కీలకమైందన్నారు. గోల్డెన్ డోమ్ పని తీరు గురించి వివరిస్తూ.. ఇతర ప్రపంచ దేశాల నుంచి ప్రయోగించిన క్షిపణులను కూడా ఆ వ్యవస్థ అడ్డుకోగలదని ట్రంప్ పేర్కొన్నారు. ఇజ్రాయిల్‌కు చెందిన ఐరన్ డోమ్‌ను ప్రేరణగా తీసుకుని దీన్ని డెవలప్ చేస్తున్నట్లు చెప్పారు. రాకెట్లు, మిస్సైళ్లను తిప్పికొట్టేందుకు ఇజ్రాయిల్ 2011 నుంచి ఐరన్ డోమ్‌ను వాడుతున్నది. అయితే గోల్డెన్ డోమ్‌ను అత్యంత భారీ సైజులో నిర్మించనున్నారు. వివిధ రకాల దాడుల్ని తిప్పికొట్టే రీతిలో దాన్ని తయారు చేయనున్నారు. ధ్వని వేగం కన్నా అధిక వేగంతో ప్రయాణించే హైపర్‌సోనిక్ మిస్సైళ్లను కూడా అడ్డుకునే రీతిలో గోల్డెన్ డోమ్‌ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఆకాశంలోనే శత్రువు ఆయుధాలను చిత్తు చేయనున్నట్లు చెప్పారు. డోమ్ సక్సెస్ రేటు 100 శాతం ఉంటుందన్నారు. మిస్సైళ్లను లాంచ్ చేసే సమయంలోనైనా, లేదా అవి మార్గమధ్యంలో ఉన్న సమయంలోనైనా.. వాటిని అడ్డుకునే రీతిలో గోల్డెన్ డోమ్ పనిచేస్తుందని అమెరికా అధికారులు చెబుతున్నారు. చాలా రకాల వ్యవస్థలన్నీ ఒక కేంద్రీకృత కమాండ్ కింద పనిచేస్తాయని రక్షణ శాఖ అధికారులు తెలిపారు. రాబోయే 20 ఏళ్లలో ఆ డోమ్ కోసం సుమారు 542 బిలియన్ల డాలర్లు ఖర్చు చేసే అవకాశాలు ఉన్నాయి. రష్యా,చైనా దేశాలు మిస్సైల్ టెక్నాలజీలో దూసుకెళ్తున్నాయని, అయితే ప్రస్తుతం ఉన్న వ్యవస్థలు ఆ టెక్నాలజీని ఢీకొట్టే రీతిలో లేవని, దానికోసమే గోల్డెన్ డోమ్‌ను రూపొం దిస్తున్నట్లు పెంటగాన్ అధికారులు తెలిపారు.

# పంటలను ధ్వంసం చేసే ఏనుగులపై 'కుంకీ' అంకుశం

## ఏనుగుల అప్పగింత పత్రాలను ఏపి డి.సిఎం పవన్‌కు అందజేసిన కర్ణాటక సిఎం సిద్ధరామయ్య, డి.సిఎం శివకుమార్





బుధవారం కర్ణాటక సిఎం సిద్దరామయ్య,డిప్యూటీ సిఎం డికె శివకుమార్‌లు ఏపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌కు కుంకి ఏనుగుల అప్పగింత పత్రాలను అందజేస్తున్న దృశ్యం, పలమనేరు చేరుకున్న 'కుంకీ' ఏనుగులు

**విజయవాడ,మే21,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపికి ఎట్టకేలకు సుదీర్ఘ సంప్రదింపులు అనంతరం కర్ణాటక ప్రభుత్వం కుంకీ ఏనుగు లను అప్పగించింది.రాష్ట్రంలో జనావాసాల్లోకి వచ్చేసి పెద్ద ఎత్తున పంటల విధ్వంసంతో పాటు ప్రాణ, ఆస్తినష్టం కలిగిస్తున్న గజరాజుల గుంపును అటవీ ప్రాంతా ల్లోకి తరిమికొట్ట గలిగే కుంకీ ఏనుగులు రానున్నాయి. బుధవారం ఎపికి కర్ణాటక కుంకీ ఏనుగులను అప్పగించింది. బెంగళూరులోని విధానసౌధలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య,ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్,కర్ణాటక అటవీశాఖా మంత్రి ఈశ్వర్ ఖండ్రే చేతుల మీదుగా వీటి అప్పగింత కార్యక్రమం జరిగింది. ఇందుకు సంబంధించి అప్పగింత ధృవీకరణ కీలక డాక్యుమెంట్లుతో కూడిన బ్యాగ్‌ను కర్ణాటక సిఎం సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్‌లు పవన్ కల్యాణ్‌కు అందించారు.ఈ అప్పగింత ప్రకారం ఆరు కుంకీ ఏనుగులను ఎపికి వస్తున్నాయి. ఎపిసరిహద్దుల్లోను, పలు జిల్లాల్లో, గజరాజులు చేస్తున్న పంటపొలాల ధ్వంసాన్ని ఇవి కట్టడి చేయనున్నాయి.

ఈ సం దర్భంగా కుంకీ ఏనుగుల అప్పగింత ఒప్పందం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల మధ్య పరస్పర సహకారానికి ఓ కీలక ముందడుగని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పొరుగు రాష్ట్రాలనడుమ రాజకీ యాలకతీతంగా సత్సంబంధాలు ఉండాలన్నారు, ఈ విషయంలో కర్ణాటక ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం బాగుందన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల మధ్య సహకారం ఇలాగే కొనసాగాలని ఆకాక్షించారు.

ఏపీలో కుంకీ ఏనుగుల సంరక్షణకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటుచేశామని పవన్ వెల్లడించారు. కుంకీ ఏనుగుల రక్షణను తాను స్వయంగా పర్యవేక్షిస్తానని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. ఎపి, కర్ణాటక మధ్య9ఒప్పందాలు కుదుర్చుకున్నా మని తెలిపారు.

కుంకీ ఏనుగులు కావాలని స్థానిక ప్రజలు 21సంవత్సరాలుగా అడుగుతు న్నారని స్థానిక గజరాజులవల్ల గ్రామాలు, పంటలు ధ్వం సం కాకుండా రక్షిస్తాయని పవన్ పేర్కొన్నారు.

# 'హరి హర వీరమల్లు' నుంచి సాంగ్ రిలీజ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ చారిత్రాత్మక యోధుడిగా కనువిందు చేయనున్న ప్రతిష్టాత్మక చిత్రం హరి హర వీరమల్లు. ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్నారు. నిధి అగర్వాల్ కథానాయికగా నటి



స్తున్న హరి హర వీరమల్లులో బాబీ డియోల్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, రెండుగీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి మూడవ గీతంగా అసుర హననం విడుదలైంది. ఈ పాట ఆవిష్కరణ కార్యక్రమాన్ని చిత్ర బృందం ఘనంగా నిర్వహించింది. దేశవ్యాప్తంగా ఉన్న అభిమానులు, ప్రేక్షకుల కోసం తెలుగు, తమిళ, హిందీ వ్యాఖ్యాతలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం. అసుర హననం గీతం రోమాలు నిక్కబొడుచుకునేలా ఉంది. అసురులపై పోరాడుతున్న యోధుడి యొక్క వీరత్వాన్ని చాటిచెప్పేలా సంగీతం, సాహిత్యం ఉన్నాయి. శ్రోతలలో పోరాట స్ఫూర్తిని రగిల్చేలా కీరవాణి సంగీతం శక్తివంతంగా ఉంది. ఆ సంగీతానికి తగ్గట్టుగా గీత రచయిత రాంబాబు గోశాల.. తన పదునైన సాహిత్యంతో కట్టిపడేశారు. భరతమాత నుదుటి రాత మార్చు ధీమసం వంటి పంక్తులతో తన కలం బలం చూపించారు. గాయనీగాయకులు ఐరా ఉడుపి, కాల భైరవ, సాయిచరణ్ భాస్కరుని, లోకేశ్వర్ ఈదర, హైమత్ మహమ్మద్ తమ గాత్రంతో గీతాన్ని మరోస్థాయికి తీసుకెళ్ళారు. అసుర హననం గీతావిష్కరణ కార్యక్రమంలో సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి మాట్లాడుతూ, హరి హర వీరమల్లు సినిమాతో నా ప్రయాణం ఐదేళ్ల క్రితం రాధాకృష్ణ(క్రిష్)తో మొదలైంది, ఇప్పుడు జ్యోతికృష్ణతో పూర్తవుతుంది. నేను చాలామంది దర్శకులను చూశాను. కానీ, తక్కువమందిలో ఉండే అరుదైన క్వాలిటీ జ్యోతిలో ఉంది. వేగంగా నిర్ణయం తీసుకుంటాడు, ఆ నిర్ణయానికి కట్టుబడి ఉంటాడు. ఎడిటింగ్, గ్రాఫిక్స్, మ్యూజిక్ అన్ని పనులు ఒక్కడే చూసుకుంటూ నిద్రాహారాలు మాని ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డాడు. ఇండస్ట్రీలో వివాద రహితుడిగా ఎ.ఎం. రత్నం గారికి పేరుంది. లిరిక్ రైటర్‌గా ఆయనకు నేను పెద్ద ఫ్యాన్‌ని. ఈ సినిమా రూపంలో ఎ.ఎం. రత్నంకి మరో భారీ విజయం సొంతం అవుతుందని విశ్వసిస్తున్నాను. అలాగే నిర్మాత దయాకర్ గారంటే నాకెంతో గౌరవం. ఈ సినిమాలో ఆయన పాత్ర ఎంతో ఉంది. రాంబాబు లాంటి మంచి గీత రచయితను నాకు జ్యోతికృష్ణ పరిచయం చేశారు. నిధి అగర్వాల్ తన పాత్రను చక్కగా పోషించింది. పవన్ కళ్యాణ్‌ని మీరందరూ పవర్ స్టార్ అంటారు. నేను మూర్తీభవించిన ధర్మాగ్రహం అంటాను. ఆగ్రహం మనందరికీ వస్తుంది. కానీ సమాజం కోసం వచ్చేది ధర్మాగ్రహం. ఆయనకు మాత్రమే సరిపోయేలా హరి హర వీరమల్లును తీర్చిదిద్దారు. జయాప జయాలతో సంబంధం లేకుండా దూసుకు పోయే కార్చిచ్చు పవన్ కళ్యాణ్ గారు. కార్చిచ్చు మీద ఎంత వాన పడినా అది ఆగదు.

# అద్భుతమైన కథతో రాబోతోన్న 'షష్టి పూర్తి'

డా. రాజేంద్ర ప్రసాద్, అర్చన కాంబినేషన్‌లో రూపేష్, ఆకాంక్ష సింగ్ హీరో హీరోయిన్లుగా పవన్ ప్రభ దర్శకత్వంలో మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై రూపేష్ నిర్మించిన షష్టిపూర్తి చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. ఇప్పటికే రిలీజ్ చేసిన పాటలు, టీజర్, ట్రైలర్ అన్నీ కూడా ప్రేక్షకుల్లో అంచనాల్ని పెంచేశాయి. మళ్లీ రావా, దేవదాస్, పరంపర ప్రాజెక్ట్‌లతో తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్న ఆకాంక్ష సింగ్ ఇప్పుడు షష్టి పూర్తి అంటూ రాబోతోన్నారు. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా హీరోయిన్ ఆకాంక్ష సింగ్ మీడియాతో ముచ్చటించారు. ఆమె సినిమా గురించి చెప్పిన విశేషాలివే.. తెలుగులో నేను చాలా గ్యాప్ తరువాత వస్తున్నాను. కరోనా వల్ల నాకు చాలా గ్యాప్ వచ్చింది. హీరో నాని సోదరి దీప్తి గంటా తెరకెక్కించిన మీట్ క్యూట్ చిత్రాన్ని ముందుగా థియేటర్లో రిలీజ్ చేయాలని అనుకున్నారు. కానీ చివరకు ఓటీటీలో వచ్చింది. ఇక ఇప్పుడు షష్టి పూర్తి సినిమా థియేటర్లోకి రాబోతోంది. ఈ చిత్రం అద్భుతంగా ఉంటుంది. టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌లో ఉంటుంది. ఇళయరాజా సంగీతం అందరినీ మెప్పిస్తుంది. షష్టి పూర్తి సినిమాలో జానకి అనే పాత్రలో కనిపిస్తాను. కథను వినేందుకు హైదరాబాద్‌కు వచ్చాను. కథ విన్న వెంటనే, నా పాత్ర గురించి తెలిసిన వెంటనే ఒప్పుకున్నాను. ఇప్పుడు ఇలాంటి కథలు అవసరం. ఓ గ్రామీణ అమ్మాయి పాత్రను పోషించాను. టెంపుల్ ట్రెజరర్‌గా కనిపిస్తాను. అచ్చమైన తెలుగమ్మాయిగా ఈ చిత్రంలో కనిపిస్తాను. ఇంత వరకు నేను అచ్చమైన తెలుగమ్మాయిలా కనిపించే పాత్రను పోషించలేదు. లంగావోణిలు కట్టలేదు. రాజమండ్రిలో నెల రోజులకు పైగా షూటింగ్ చేశాను. గోదావరి ప్రాంతాల్ని ఎప్పటికీ మర్చిపోలేను. ఎండల్లో అక్కడ ఎంతో కష్టపడి షూటింగ్ చేశాం. పడవల్లో ప్రయాణం చేశాం. అవన్నీ నాకు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. గోదావరి అందాల్ని మరింత అందంగా చూపించారు. బెంచ్ లైఫ్‌లో ఇది వరకు నేను రాజేంద్ర ప్రసాద్ గారితో నటించాను. మళ్లీ ఈ చిత్రంలో నటించాను. ఆయనతో కలిసి పని చేయడం వల్ల ఎంతో నేర్చుకున్నాను. మేం ఇద్దరం ఎప్పుడు కలిసి నటించినా గ్లిజరిన్ వాడలేదు. సహజంగానే ఎమోషనల్ సీన్స్‌ను రక్తి కట్టించేవాళ్లం. షష్టి పూర్తి కోసం పని చేస్తుంటే నాకు యాక్టింగ్ స్కూల్‌కు వెళ్లినట్టుగా అనిపించింది. ఈ చిత్రంతో ఎంతో నేర్చుకున్నాను. షష్టి పూర్తి అనేది కేవలం షష్టి పూర్తి గురించే ఉండదు. అన్ని రకాల అంశాలు ఉంటాయి. ఇక ఇందులో నేను కేవలం రెగ్యులర్ హీరోయిన్ పాత్రలో కనిపించను. నా కారెక్టర్‌లో ఎన్నో షేడ్స్ ఉంటాయి. అవన్నీ నేను ఇప్పుడే చెప్పలేను. అవన్నీ మీరు సినిమాలోనే చూడాలి. మా నిర్మాత రూపేష్ చాలా మంచి వ్యక్తి. సినిమాల పట్ల ఎంతో ప్యాషన్ ఉంది. నటుడిగానే కాకుండా నిర్మాతగానూ ఈ చిత్రానికి న్యాయం చేశారు. అందరినీ ఒకతాటిపైకి తీసుకువచ్చారు. ఇంత గొప్ప చిత్రాన్ని నిర్మించారు. మా దర్శకుడు పవన్‌కు ఓ క్లారిటీ, విజన్ ఉంది. కథ మీద ఆయనకు చాలా పట్టు ఉంది. ఆయనతో పని చేయడం ఎంతో ఆనందంగా ఉంది. నన్ను ఓ మంచి నటిగానే జనాలు గుర్తుపెట్టుకోవాలని అనుకున్నాను.



హీరోయిన్ ఆకాంక్ష సింగ్

# గ్రిప్పింగ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ 'రక్షక్'

రాకింగ్ స్టార్ మంచుమనోజ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన హీరోగా చేస్తున్న కొత్త సినిమాను అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. గ్రిప్పింగ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రానికి రక్షక్ అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. శ్రీనిధి క్రియేషన్స్ బ్యానర్‌పై నూతన దర్శకుడు నవీన్ కొల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. టైటిల్ పోస్టర్ చాలా ఇన్నోవేటివ్‌గా, ఇంటెన్స్‌గా ఉంది. మంచు మనోజ్ పవర్ ఫుల్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై చాలా ఆసక్తిని కలిగించారు. పోస్టర్‌పై కనిపించే (దాచిన నిజం శాశ్వతంగా దాగి ఉండదు) అనే ట్యాగ్‌లైన్ కథలోని మిస్టరీని సూచిస్తుంది. సెకండ్ ఇన్నింగ్స్‌లో చాలా బిజీగా వున్న మంచు మనోజ్ ప్రస్తుతం భైరవం, మిరాయ్ సినిమాల్లో పవర్‌ఫుల్ క్యారెక్టర్స్ చేస్తున్నారు. ఇప్పుడు రక్షక్ చిత్రంతో మళ్లీ హీరోగా అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమాలో ఆయన ఇంటెన్స్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఈ థ్రిల్లింగ్ క్రైమ్ డ్రామా ప్రేక్షకులకు ఎడ్జ్ ఆఫ్ ది సీట్ ఎక్స్‌పీరియన్స్‌ని అందించబోతోంది. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ తెలియజేస్తారు.



# '23' సక్సెస్ మీట్

మల్లేశం, 8 ఎ.ఎం. మెట్రో చిత్రాలతో ప్రశంసలు పొందిన దర్శకుడు రాజ్ ఆర్ లేటెస్ట్ మూవీ 23తో మరో విజయాన్ని అందుకున్నారు. స్టూడియో 99 నిర్మించిన ఈ చిత్రంలో తేజ, తన్మయి ప్రధాన పాత్రలు పోషించారు. వెంకట్ సిద్దారెడ్డి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ సినిమాని స్పిరిట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ చేసింది. మే 16న గ్రాండ్‌గా రిలీజైన ఈ సినిమా ప్రేక్షకులు విమర్శకుల ప్రసంశలు అందుకొని ఘన విజయాన్ని సాధించి సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సక్సెస్ మీట్ నిర్వహించారు.



సక్సెస్ మీట్‌లో డైరెక్టర్ రాజ్ ఆర్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. 23 సినిమాకి రావలసిన సపోర్ట్, ఆదరణ కంటే ఎక్కువ వచ్చింది. ఒక మూవీ సక్సెస్‌కి చాలా పారామీటర్స్ ఉంటాయి. ఈ సినిమా ఛాలెంజింగ్ అని తెలుసు. ఇలాంటి సినిమాతో స్ఫూర్తి పొంది ఇలాంటి కథలు మరొకరు తీస్తారనే ఒక ఉద్దేశంతో తీసిన సినిమా ఇది. అందుకే ఇలాంటి ప్రయోగం చేశాం. సినిమాకిఆడియన్స్ నుంచి యాక్సెప్టెన్సీ వచ్చింది. అదే మా సక్సెస్. ఒక డైరెక్టర్‌గా నాకు అందరికంటే ఫేవరెట్ క్యారెక్టర్ తేజ చేసింది. మొత్తం తన భుజాల మీద మోసాడు. నేను తనని నమ్మాను. ఆ నమ్మకం నిలబెట్టాడు. అందరూ నటీనటులు చాలా అద్భుతంగా చేశారు. సినిమాకి సపోర్ట్ చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు అన్నారు. తన్మయి మాట్లాడుతూ, మీ అందరి సపోర్ట్‌కి థాంక్యూ. తొలి సినిమాకే ఇలాంటి ఒక క్యారెక్టర్ దొరకడం అదృష్టంగా భావిస్తున్నాను. సినిమా అందరికీ నచ్చింది. చూసిన ప్రతి ఒక్కరు సినిమాని ప్రశంసిస్తున్నారు. మంచి రివ్యూస్ వచ్చాయి. ఈ సినిమాకి విజయాన్ని ఇచ్చిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఈ చాలా మంది అందరూ చూడాలని కోరుకుంటున్నాను. ఇంత మంచిక్యారెక్టర్ ఇచ్చిన మా డైరెక్టర్ రాజ్‌కి థాంక్యూ అన్నారు. తేజ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. మీ అందరి సపోర్ట్‌కి థాంక్యూ. ఒక డెబ్యు యాక్టర్‌కి ఇంత మంచి ఇంటెన్స్ స్టోరీ దొరకడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ అవకాశం ఇచ్చిన డైరెక్టర్ రాజ్‌కి థాంక్యూ. 10 ఏళ్ల తర్వాత చేయాల్సి న రోల్ ఇది. నాపై నమ్మకంతో ఆయన ఈ పాత్రను ఇచ్చారు. రాజు నా జీవితానికి ఒక హోప్ ఇచ్చారు. నా జీవితంలో ఆయన్ని ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటాను. ఈ సినిమాలో అందరూ కూడా అద్భుతంగా పెర్ఫాం చేశా రు. ఈ సినిమాకి పనిచేసిన అందరికీ ధన్యవాదాలు.

# ముంబయి గుహల్లో 'మిరాయ్' కొత్త షెడ్యూల్

సూపర్ హీరో తేజ సజ్జా తన పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ హనుమాన్ తరవాత ఇప్పుడు మరొక ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ మిరాయ్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. యాక్షన్ అడ్వెంచర్ జానర్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించగా, టీజీ విశ్వప్రసాద్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై భారీగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో తేజ సజ్జా సూపర్ యోధగా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. తాజాగాఈ చిత్రానికి సంబంధించిన కొత్త షెడ్యూల్ ముంబయిలోని చారిత్రక గుహల్లో ప్రారంభమైంది. తేజ సజ్జాతో పాటు కొన్ని ప్రధాన పాత్రల నటీనటులు ఈ షెడ్యూల్‌లో పాల్గొంటున్నారు. సినిమాకు సంబంధించిన పనులు షెడ్యూల్ ప్రకారమే జరుగుతున్నాయి, ఆగస్టులో రిలీజ్ సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 8 భాషల్లో, 2డి, 3డి ఫార్మాట్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. తేజ సజ్జా ఈ చిత్రంలో సూపర్ యోధ పాత్ర కోసం మరోసారి కంప్లీట్‌గా మేకోవర్ అయ్యారు. రాకింగ్ స్టార్ మనోజ్ మంచు విలన్‌గా, రీతికా నాయక్ కథానాయికగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన తేజ సజ్జా, మనోజ్ మంచు ఫస్ట్ లుక్ పోస్టర్లు, స్పెషల్ గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంతో పాటు సినిమాటోగ్రఫీ, స్క్రీన్‌ప్లేను కూడా అందించగా, మణిబాబు కరణం డైలాగ్స్ రాశారు. గౌరహరి సంగీతం అందించగా, శ్రీ నాగేంద్రతంగల ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. వివేక్ కుచిభొట్ల కోప్రొడ్యూసర్.





అయేషా ఖాన్ నయా లుక్

# నేడే 'వీరరాజు 1991' విడుదల

రాయల్ స్టార్ ప్రొడక్షన్స్ సమర్పణలో కిరణ్ చెరుకూరి నిర్మాతగా, రుద్ర వీరాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం వీరరాజు 1991. రా అండ్ రస్టిక్‌గా తెరకెక్కిన ఈ చిత్రం మే 22న గ్రాండ్ రిలీజ్ కాబోతున్న సందర్భంగా ప్రిరిలీజ్ ఈవెంట్ జరుపుకుంది. సహనిర్మాత శివాన్విత రావు మాట్లాడుతూ, చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రం వాళ్ల అమ్మగారు అయిన నిర్మాత కిరణ్ చెరుకూరికి ఎంతో స్పెషల్ అని చెప్పారు. ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాంబాబు గోసాల మాట్లాడుతూ, వీరరాజ్ సినిమాలో రెండు పాటలు రాశాను. గగన్ అందించిన మ్యూజిక్ చాలా బాగుంది. వీరరాజ్ చాలా కష్టపడ్డారు. నిర్మాత చాలా బాగా చూసుకున్నారు అని చెప్పారు. అజయ్ గోష్, బెనర్జీ నటన చాలా బాగుందన్నారు. సినిమా పెద్ద హిట్ అవుతుందన్నారు. అజయ్‌గోష్ మాట్లాడుతూ, పరిశ్రమకు కొత్తవాళ్లు రావాలని, విజయం సాధించి పదిమందికి ఉపాధి కల్పించాలన్నారు. చిన్న సినిమాలను ఆదరించాలని, ఇలాంటి సినిమాలు ఆడితే భవిష్యత్తులో మంచి ఆర్టిస్టులు, టెక్నిషన్స్ పరిచయం అవుతారు. ముఖ్యంగా నిర్మాత కిరణ్ ఎంతో శ్రద్ధతో, ప్రేమతో టీం చూసుకున్నారు. అలాగే బెనర్జీతో పని చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇక కథ విషయానికి వస్తే మత్స్యకారులు జీవితంలో జరిగే మంచి కథను చూపించారు. మత్స్యకారులు జీవితాలను చాలా అద్భుతంగా చూపించారు. ముఖ్యంగా హీరోగా, దర్శకత్వం రెండు పనులను చాలా సమర్ధవంతంగా నిర్వహించిన వీరరాజ్ శ్రమను ప్రేక్షకులు ఆదరిస్తారు అని నమ్మకం వ్యక్తం చేశారు. నిర్మాతగా కిరణ్ చెరుకూరి మంచి అభిరుచి ఉన్న వ్యక్తి అన్నారు. బెనర్జీ మాట్లాడుతూ, అజయ్ గోష్‌తో చాలా తక్కువ సినిమాలే చేశాము కానీ మంచి పరిచయం ఉందన్నారు. అలాగే గొప్ప యాక్టర్ అన్నారు. ప్రొడ్యూసర్ కిరణ్మయ్ లేడి ప్రొడ్యూసర్‌గా మంచి భవిష్యత్తు ఉండాలన్నారు. ఆమె మంచితనమే సినిమాను మరో స్థాయికి తీసుకెళ్తున్నారు. ఫస్ట్ టైం సినిమా తీసినట్లు కాకుండా చాలా బాధ్యతగా, చాలా ప్రేమగా చూసుకున్నారు అని చెప్పారు. నిర్మాత, సహ నిర్మాత ఇద్దరు తల్లీ కూతుర్లకు మంచి పేరు వస్తుందన్నారు. ఇక మరో హార్డ్ వర్కర్ హీరో, డైరెక్టర్ గా పని చేసిన వీరరాజ్ చాలా కష్టపడ్డారు అన్నారు. సినిమా తీయడం కాదు సినిమా రిలీజ్ చేయడం పెద్ద సాహసం అన్నారు. వీరరాజ్ 1991 సినిమాలో పనిచేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్ చెప్పారు. నిర్మాత కిరణ్మయ్ చెరుకూరి మాట్లాడుతూ, సినిమా అందరికి నచ్చుతుందని, సినిమాను ఆదరించాలని కోరారు. హీరో రుద్రవీరాజ్ మాట్లాడుతూ, సినిమాకు పని చేసిన ప్రతి ఒక్కరికి థాంక్స్ చెప్పారు. ఈ సినిమాను సింగిల్ షెడ్యూల్‌లో పూర్తి చేయడానికి ముఖ్య కారణం హరిచరణ్ అన్నారు. చాలా సపోర్ట్‌గా నిలబడి పని చేశారు అన్నారు. కృష్ణ కాంత్ ఒక పాట రాశారు, రాంబాబు గోసాల రెండు పాటలు రాశారు. ప్రతీ టెక్నిషన్స్‌కు థాంక్స్ చెప్పారు. ముఖ్యంగా నిర్మాత కిరణ్మయ్ చెరుకూరికి ధన్యవాదాలు చెప్పారు. వారు లేకపోతే ఈ సినిమా లేదన్నారు. బెనర్జీ సపోర్ట్ చాలా ఉందన్నారు. అలాగే అజయ్ గోష్ చాలా స్పెషల్ అన్నారు. ఆయనతో కథ చెప్పిన నాటి నుంచి నేటి వరకు చాలా సపోర్ట్ చేశారు అన్నారు. ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చాలామంది ప్రోత్సాహం ఉంది అందులో నెల్లూరు అవుట్ డోర్ షూటింగ్లో పోలీస్ పర్మిషన్లు తీసుకున్న నిర్మాత కిరణ్మయి ఫ్రెండ్ గిరి బొల్లినేని గారికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే రాక్ లయన్ వెంకటేష్, సునీల్ నరెన్, మ్యాంగో మ్యూజిక్ థాంక్స్ చెప్పారు. ఇక వైజాగ్లో తన యాక్టింగ్ నేర్చుకున్న సత్య ఇన్స్టిట్యూట్ కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మే 22 వీరరాజ్ 1991 సినిమా విడుదల అవుతుందని అందరూ కచ్చితంగా సపోర్ట్ చేయాలన్నారు. ముఖ్యంగా మీడియా సపోర్ట్ ఉండాలని కోరారు.



నటీనటులు: రుద్రవీరాజ్, అజయ్ ఘోష్, బెనర్జీ, అర్చన, రాహుల్, గోపారాజ్, కిషోర్ తదితరులు. బ్యానర్: రాయల్ స్టార్ ప్రొడక్షన్స్. నిర్మాత: కిరణ్ చెరుకూరి. స్టోరీస్క్రీన్ ప్లేడైరెక్షన్: రుద్రవీరాజ్.

# కంటెంట్‌ను నమ్మి వస్తున్న మూవీ 'ఒక బృందావనం'

కంటెంట్‌ను నమ్మి రాబోతున్న చిత్రం ఒక బృందావనం. నూతన నటీనటులు బాలు, షిన్నోవాలతో పాటు శుభలేక శుధాకర్, అన్నపూర్ణమ్మ, శివాజీ రాజా, రూపలక్ష్మి, సాన్విత, కళ్యాణి రాజు, మహేంద్ర, డి.డి. శ్రీనివాస్ మరియు ఇతర సీనియర్ నటీ నటులు ఈ చిత్రంలో నటించారు! బొత్స సత్య దర్శ కత్వంలో కిషోర్ తాటికొండ, వెంకట్ రేగట్టే, ప్రహ్లాద్ బొమ్మినేని, మనోజ్ ఇందుపూరు ఈ చిత్రాన్ని నిర్మించారు. మైత్రీ మూవీస్ ద్వారా ఈ నెల 23న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ప్రీరీలీజ్ వేడుక మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ కథా నాయకుడు నారా రోహిత్ ముఖ్య అతిథిగా విచ్చేయగా, నిర్మాత సాహు గారపాటి, దర్శకుడు వీఎన్ ఆదిత్యలు విశిష్ట అతిథిలుగా విచ్చేశారు. ఈ సందర్భంగా నారా రోహిత్ మాట్లాడుతూ, ఈ సినిమా కథనాకు తెలుసు. ఇదొక ఇంట్రెస్టింగ్ అండ్ ఫీల్‌గుడ్ ఫిల్మ్. ఇదొక ఓ అబ్బాయి లైఫ్ జర్నీ. ఆర్టిస్టులు, టెక్నిషియన్స్ ఎంతో ఎఫర్ట్ పెట్టారు. సినిమా మీద పాషన్‌తో యూఎస్‌లో జాబ్ చేస్తూ ఈ సినిమా నిర్మించారు. ఈ సినిమాతో అందరికి మంచి సక్సెస్ ఇవ్వాలని కోరుకుంటున్నాను. సినిమా పట్ల ఎంతో పాషన్‌తో ఉన్న హీరో బాలు. బాలు పర్‌ఫార్మెన్స్ అందర్ని అలరిస్తుంది. అందరూ ఈ సినిమా తప్పకుండా చూడాలని కోరుకుంటున్నాను. అందరికి ఓ మంచి బ్యూటిఫుల్ సినిమాను చూశామన్న అనుభూతి కలుగుతుంది అన్నారు. వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ, ఈ సినిమా నిర్మాతలతో నాకు మంచి జర్నీ ఉంది. ఈ సినిమా నేను చూశాను. ఈ సినిమా చూసిన వారందరూ హీరో బాలు ప్రేమలో పడతారు. బాలుకు నటుడిగా మంచి భవిష్యత్ ఉంది. నిర్మాతలు ఎంతో నిజాయితీగా ఓ మంచి అటెంప్ట్ చేశారు. సినిమాను ఎలా తీయాలో నేర్చుకుని వచ్చి నిర్మాతలు ఈ సినిమా తీశారు. ఇది ఫ్యామిలీ డ్రామానేకాదు. ఓ మంచి యూత్‌ఫుల్ సినిమా అందర్ని అలరిస్తుంది అన్నారు. సాహు గారపాటి మాట్లాడుతూ ఈ సినిమా అందరి డ్రీమ్స్‌ను నేరవేరుస్తుందనే నమ్మకం ఉంది. హీరో అన్నింట్లో శిక్షణ తీసుకుని చేశారు. అన్ని ఎలిమెంట్స్ ఈచిత్రంలో ఉన్నాయి. తప్పకుండా ఈ చిత్రం అందరికి శుభారాంభాన్ని ఇస్తుందనే నమ్మకం ఉంది అన్నారు. నిర్మాత మనోజ్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి వచ్చేసిన అందరికిథ్యాంక్స్. సినిమా చేసిన వాళ్లంతా టెక్నిషియన్స్ వర్క్‌ను కూడా అప్రిషియేట్ చేస్తారు. అందరూ సినిమాకు బెస్ట్ ఇచ్చారు. అందరూ ఎంజాయ్ చేస్తూ ఈ సినిమా మేకింగ్ ప్రాసెస్‌ను ఫీల్ అయ్యాం అన్నారు.





ప్రమాదంలో నుజ్జు నిజ్జయిన కారు. మృతి చెందిన చంద్రసేనా రెడ్డి, త్రినాథ్ రెడ్డి, వర్షిత్ రెడ్డి(ఫైల్)

## డిసిఎంను ఢీకొన్న కారు
# ముగ్గురు యువకుల దుర్మరణం

**హైదరాబాద్ (హయత్‌నగర్), మే 21 ప్రభాతవార్త:** హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి కుంట్లూరులో బుధవారం ఉదయం ఘోరరోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంతో అదుపు తప్పిన కారు ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యానును ఢీ కొన్న సంఘటనలో ముగ్గురు యువకులు మృతి చెందగా మరో యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం కుంట్లూరు గ్రామానికి చెందిన పినిశెట్టి శ్రీనివాస్ రెడ్డి కుమారుడు చంద్రసేనా రెడ్డి (24),మంద జంగారెడ్డి కుమారుడు త్రినాథ్ రెడ్డి (24), మంద శ్రీనివాస్ రెడ్డి కుమారుడు వర్షిత్ రెడ్డి (23), ఎలిమినేటి శ్రీనివాస్ రెడ్డి కుమారుడు పవన్ కళ్యాణరెడ్డి (24)నలుగురు మంచి స్నేహితులు. వీరు మంగళవారం రాత్రి కారు(ఎం హెచ్ 02 డీజీ 0771)లో రెసిప్షన్‌కు వెళ్లారు. రెసెప్షన్ అనంతరం పసుమాముల సమీపంలోని ఫామ్ హౌస్‌కి వెళ్లి తెల్లవారుజామున 5.45 గంటలకు కుంట్లూరు తిరిగి వస్తున్నారు. కుంట్లూరు సమీపంలోని నారాయణ ఐటిటీ కళాశాల(జానసర్యాంపస్) సమీపంలో మలుపువద్ద వీరి కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్(టీఎస్ 07 యుకె 2664)ను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు కాగానే కారులోని చంద్రసేనా రెడ్డి, త్రినాథ్ రెడ్డి, వర్షిత్‌రెడ్డిలు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన పవన్ కళ్యాణ్ రెడ్డిని స్థానికులు చికిత్సనిమిత్తం హయత్‌నగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు.

## విమానంలో ఎమర్జెన్సీ డోర్‌ను ఓపెన్ చేసిన మహిళ

**శంషాబాద్. మే 21. ప్రభాతవార్త:** రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం శంషాబాద్ నుంచి భువనేశ్వర్ వెళుతున్న విమానంలో మహిళప్రయాణి కురాలు హాల్ చల్ చేసింది. హైదరాబాద్ నుండి విమానం భువనేశ్వర్ కు బయలుదేరే సమయంలో విమానం ఎమర్జెన్సీ డోర్ తీయడానికి ప్రయత్నిం చింది. దీనిని గమనించిన పైలట్ వెంటనే అప్రమత్తమై ఆమెను అడ్డుకున్నారు. ఎమర్జెన్సీ డోర్ తీస్తానని బెదిరింపులకు దిగడంతో ఆ ప్రయాణికురాలిని అదుపులో తీసుకుని పోలీసులకు అప్పగించగా విచారిస్తున్నట్లు సమాచారం.

## నాగం పిటిషన్‌ను కొట్టి వేసిన సుప్రీం

**హైదరాబాద్,మే 21,ప్రభాతవార్త:** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో అక్రమాలపై సిబిఐ దర్యాప్తు చేయాలని నాగం జనార్దన్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ ను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. హైకోర్టు ఆదేశాలలో జోక్యం చేసుకోలేమని విచారణ జరిపిన జస్టిస్ బివి.నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ధర్మాసనం స్పష్టం చేసింది. నాగం తరపు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు .ప్రభుత్వ ఖజానాకు 2426 కోట్ల రూపాయల నష్టం జరిగింది తెలిపారు. ప్రభుత్వం ఆమోదించిన ప్రకారం 65 శాతం పంపులు, మోటార్ల కోసం బిహెచ్ఈఎల్ కు చెల్లింపులు చేయాలని కానీ 35 శాతం సివిల్ వర్క్స్ కు మేఘాకు చెల్లింపులు చేయాలి కానీ,అంతర్గత ఒప్పందం ప్రకారం బిహెచ్ఈఎల్ కు 65 శాతం నుంచి 20 శాతా నికి తగ్గించారు. మెఘాకు 80 శాతం చెల్లింపులు జరిగాయి అని 65:35 నుంచి 20:80కు ఎలా మారింది ఇందులో భారీ ఎత్తున అవినీతి జరిగింది ముకుల్ రోహిత్గీ సీనియర్ న్యాయవాది మేఘా తరపున వాదనలు వినిపించారు. తెలంగాణ హైకోర్టులోదీనికి సంబందించిన 5పిటిషన్లు కొట్టివేశారు ఇందులో ఎలాంటి ఫ్రాడ్ లేదని స్పష్టంచేసింది.సివిసికూడా ఇందులో ఏమిలేదని తేల్చింది ఎస్టిమేషన్ పెంచడాన్ని తప్పుపడుతున్నారు బిహెచ్ఈఎల్ కూడా ఇందులో ఫిర్యాదుచేయలేదు ఏదో ఒక డాక్యుమెంట్ తెచ్చి కేసులు వేస్తున్నారని ముకల్ రోహిత్గీ తెలిపారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్ట్ బాగా పని చేస్తోందని వాదించారు.

## మావోయిస్టుల అంతమే లక్ష్యంగా పని చేస్తున్న కేంద్రం
### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకటరెడ్డి

**హైదరాబాద్,మే 21,ప్రభాతవార్త** :బిజెపి ఎన్డీఏ ప్రభుత్వంలోని ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షాలు మావోయిస్టుల, వామపక్ష భావజాలాన్ని అంతం చేయడం లక్ష్యంగా ఆపరేషన్ కగార్ చేపట్టి విచ్చలవిడిగా మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లు చేయడం పట్ల సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదుల కంటే దారుణంగా మన దేశ పౌరులైన మావోయిస్టులపై సీత కన్ను ప్రదర్శిస్తున్నారని అన్నారు. మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధమని ఒక నెల రోజులు క్రింద ప్రకటించినా చర్చలు జరపకుండా మావోయిస్టుల ఏరువేత లక్ష్యంగా ఏన్‌కౌంటర్ల పరంపర కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్లు పౌరహక్కులను కాలరాయడమే అవుతుందని, వెంటనే మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని చాడ డిమాండ్ చేశారు.

## ఏకపక్షంగా ఎన్‌కౌంటర్లు సరికాదు
### సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్,మే 21 ,ప్రభాతవార్త:** శాంతి చర్చలకు సిద్ధమేనని మావోయిస్టులు ప్రకటించినా కేంద్రం పట్టించుకోకుండా ఏకపక్షంగా ఎన్ కౌంటర్లు చేయడం అప్రజాస్వామికమని సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంభశివరావు ఒక ప్రకటనలో విమర్శించారు.ఛత్తీస్‌ఘడ్ లో సిపిఐ మావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో సహ మరో 27 మంది మావోయిస్టులను ఎన్ కౌంటర్ చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమాజంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాస్వామిక వాదులు, అభ్యుదయ వాదులు, మేధావులు రచయితలు తక్షణమే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరుతున్నప్పటికీ కేంద్రం మొండివైఖరి ప్రదర్శించడాన్నీ ఆయన తప్పుపట్టారు.ఎలాంటి సమస్యకైనా చర్చల ద్వారానే సమస్యకు పరిష్కారం లభిస్తుందని చరిత్ర రుజువు చేస్తుందన్నారు. తక్షణమే ఆపరేషన్ కగారు నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరిపి శాంతిని నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలన్నారు.

## లొంగిపోవడమే నక్సలిజం సమస్యకు పరిష్కారం
### విశ్రాంత డిజిపి హెచ్‌జెదొర వెల్లడి

**హైదరాబాద్, మే 21,ప్రభాతవార్త:** ఛత్తీస్‌ఘడ్‌లోని బీజాపూర్ జిల్లాలో బుధవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నాంబాల కేశవరావు సహా 27 మంది నక్సలైట్లు మరణించడం సంచలనం రేపింది. ఈ ఎన్‌కౌంటర్‌పై ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలు తమ స్పందనను వెల్లడిస్తూ వచ్చే ఏడాది మార్చి నాటికి నక్సలైట్ల సమస్య లేకుండా చేస్తామని తెలిపారు. ఇదే అంశంపై ఉమ్మడి ఎపికి ఐదేళ్లకు పైగా డిజిపిగా పనిచేసిన ఐపిఎస్ అధికారి హెచ్.జె దొర మీడియాతో మాట్లాడుతూ నక్సలైట్లు లొంగిపోవడం ఒక్కటే సమస్యకు పరిష్కారం అవుతుందని ఆయన తెలిపారు. నక్సలైట్లతో కేంద్ర ప్రభుత్వం శాంతిచర్చలు జరపాలని పౌర హక్కుల సంఘాల నాయకులు మాట్లాడడంపై దొర వ్యాఖ్యానిస్తూ ఎదురు కాల్పుల్లో పోలీసులు మరణించిన సమయంలో,అమాయక గిరిజనులను ఇన్‌ఫార్మర్ల పేరిట నక్సలైట్లు కాల్చి చంపినపుడు వీరంతా ఎక్కడ వున్నారని ప్రశ్నించారు. ఎంతసేపు నక్సలైట్ల తరపున వకాల్త పుచ్చుకోవడం తప్పించి వేరేవ్యవహారం లేనట్లుగా వుందని ఆయన తెలిపారు. నక్సలైట్ల వరకు వస్తే మా వోయిస్టు పార్టీలో ఇటీవల కాలంలో కొత్త భర్తీలు జరగడం లేదని, ఇందుకు జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రధానకారణంగా ఆయన తెలిపారు. ఒకపుడు మావోయిస్టు పార్టీకి పట్టుగా వున్న ప్రాంతాలలోనూ యువత ఆ పార్టీలో చేరడం లేదని ఆయన తెలిపారు.నక్సలైట్ల తరపున భారీ నష్టం వాటిల్లినపుడు, కొత్తగా మళ్లీ పుంజుకునే అవకాశాలు లేనపుడు శాంతి చర్చల మంత్రం జపిస్తారని దొర తెలిపారు.మావోయిస్టులు శాంతి చర్చలు ఎవరితో జరుతారని, ఎలా జరుపుతారని ఆయన ప్రశ్నించారు. ఆయుధాలు వీడకుండా ఎలాంటి చర్చలైనా సాధ్యం అయ్యేది కాదని ఆయన స్పష్టం చేశారు.

### పుష్కరాలకు వెళ్లి వస్తూ అనంత లోకాలకు..
# కారును ఢీకొట్టిన టిప్పర్: తల్లి,కొడుకు మృతి
### మరొకరి పరిస్థితి విషమం ముగ్గురికి స్వల్ప గాయాలు



**కొత్తగూడెం క్రైమ్, మే 21 ప్రభాతవార్త:** వారంతా దైవదర్శనానికి బయలుదేరారు ఒకే కుటుంబానికి చెందిన తల్లి తండ్రి కొడుకు కోడలు ఇద్దరు మానవులతో కలిసి వారి సొంత వాహనంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం చిరుతపుడి గ్రామానికి చెందిన మామిడి శెట్టి వెంకటపతి కుటుంబ సభ్యులంతా ఈనెల 19వ తేదీన కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాలకు బయలుదేరారు అక్కడ పుష్కర స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేసిన తర్వాత 20వ తేదీన తిరుగు ప్రయాణంలో భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు దర్శనమానంతరం మంగళవారం తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుచుపల్లి మండలం పెనగడప పంచాయతీ పరిధిలోని చంద్రుకుంట బైపాస్ రోడ్డు వద్ద వారు వెళుతున్న కారును సత్తుపల్లి జేవిఆర్‌ఓసి నుంచి ఆర్ సి హెచ్ పి కి బొగ్గులోడుతో వస్తున్న టిప్పర్ లారీ ఎదురుగా వచ్చి బలంగా ఢీ కొట్టింది ఈ ప్రమాదంలో వెంకటపతి భార్య కనకదుర్గ అక్కడికక్కడే మృతి చెందారు కారు నడుపుతున్న వారి కుమారుడు మామిడిశెట్టి వెంకటరత్నం ముందు భాగంలో ఇరుక్కుపోవడంతో సుమారు రెండుగంటల పాటుపోలీసులు లారీ డ్రైవర్లు కష్టపడి బయటకు తీశారు. రెండు కాళ్లు పూర్తిగా నుజ్జుకావడంతో అతని వెంటనే కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి విజయవాడకు తరలిస్తుండగా కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సమీపంలోకి చేరుకోగానే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అదే కారులో ప్రయాణిస్తున్న వెంకటపతి మన వరాలు దీక్షిత తలకు తీవ్రమైన గాయం కావ డంతో ఆమెను ఖమ్మం తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమా దంలో మామిడి శెట్టి వెంకటపతి అతని కోడలు జ్యోతి స్వరూపమనువడు చేతన్ శిరీష్‌లకు గాయాలయ్యాయి. ఈ సంఘటనపై టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# పోలీసు శాఖలో 52 మందికి రివార్డులు



విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఓ అధికారికి అవార్డు అందజేస్తున్న సిఐడి డిజి శిఖా గోయెల్. చిత్రంలో డిజిపి జితేందర్, శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్ తదితరులున్నారు.

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు శాఖ గడచిన కొన్నేళ్లుగా జాతీయ స్థాయిలో సాధించిన అనేక అవార్డులకు కారకులైన క్షేత్రస్థాయి అధికారులను డిజిపి జితేందర్ సన్మానించారు. బుధవారం డిజిపి కార్యాలయంలో ఇందుకు సంబంధించి ఓ కార్యక్రమం జరిగింది. గత ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా వివిధ అంశా లకు సంబంధించి ఉత్తమ ప్రతిభ కనబరచి పోలీసు శాఖకు మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చిన 52 మందికి ఈ సందర్భంగా జితేందర్ నగదు రివార్డులతో పాటు సర్టిఫికేట్లను అందజేశారు. బహుమతులు అందుకున్న వారిలో కానిస్టేబుల్ నుంచి ఎస్‌పి స్థాయి వరకు అధికారులున్నారు. ఈ సందర్భంగా డిజిపి జితేందర్ మా ట్లాడుతూ గడచిన కొన్నేళ్లుగా తెలంగాణ పోలీసు జాతీయ స్థాయిలో అనేక అంశాలకు సంబంధించి మొదటి స్థానంలో వుందని, ఇందుకు సమిష్టి కృషి కారణమని అన్నారు. ఇటీవలే సెల్‌ఫోన్ల రికవరీలో తెలంగాణ పోలీసు మొదటి స్థానం సాధించిందని ఆయన తెలిపారు. 2025 ఇండియా సోషల్ జస్టిస్ నివేదికలో కూడా తెలంగాణపోలీసు విభాగానికి అగ్రస్థానం దక్కిందని ఆయన తెలి పారు. అవార్డులు అందుకున్న వారు భవిష్య త్తులో మరింతగా కష్టపడి పోలీసు శాఖకు పేరు ప్రతిష్టలు తేవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నిఘా విభాగం అధిపతి శివధర్ రెడ్డి, సిఐడి, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిజి శిఖా గోయల్, ఎస్‌పిఎఫ్ డిజి అనిల్‌కుమార్, ఐజిలు రమేష్, చంద్రశేఖర్, డిఐజినారాయణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉత్పత్తి 2 వేల మెగావాట్లకు పెంపు
### సింగరేణి సిఎండిబలరామ్

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** సింగరేణి ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు సంస్థ సిఎండి ఎన్ బలరామ్ తెలిపారు. ప్రస్తుతం 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పాదన జరుగుతుండగా, దానికి అదనంగా మరో 800 మెగావాట్ల కొత్త ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా 2000 మెగావాట్లకు పెంచుతున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ ఒడిశాలో మరో 1600 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. తద్వారా రాష్ట్రంలో అత్యధిక థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి సంస్థగా సింగరేణి నిలవబోతుందన్నారు. కాగా సంస్థ ఆర్థిక స్థితిగతులు, భవిష్యత్తు ప్రణాళికలు, వ్యాపార విస్తరణ తదితర వాటిపై పట్టు సాధించాలని సూచించారు. సింగరేణి ప్రస్తుత బొగ్గు ధర దేశంలో ఏ ఇతర బొగ్గు కంపెనీల కన్నా చాలా ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వినియోగదారులు తక్కువ ధరకు బొగ్గు లభించే వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కనీసం టన్నుకు వెయ్యి రూపాయలు తగ్గించే విధంగా ఉత్పత్తి వ్యయం తగ్గించాలన్నారు. అదే సమయంలో ఉత్పాదకత కూడా పెంచాలని సూచించారు. పాత గనులు కొన్ని మూతబడుతున్న నేపథ్యంలో, ఒడిశా, కొత్తగూడెం, ఇల్లందు, బెల్లంపల్లిలోని వివిధ గనుల నుండి ఈ ఏడాది బొగ్గు ఉత్పత్తి ప్రారంభించనున్నామని, తద్వారా 20 మిలియన్ టన్నుల అదనపు ఉత్పత్తి సాధించగలమని చెప్పారు. దీంతో ఈ ఏడాది నిర్దేశిత 76 మిలియన్ టన్నుల బొగ్గు లక్ష్యాలు సాధించే అవకాశం ఉందన్నారు. అలాగే ఇతర రాష్ట్రాలలో కూడా బొగ్గు బ్లాకులు చేపట్టడానికి ముమ్మరంగా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా కీలక ఖనిజాల ఉత్పత్తి రంగంలోకి అడుగు పెట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనికోసం మూడు ఏజెన్సీలను కూడా నియమించడం జరిగిందన్నారు. అవసరమైతే ఇతర కంపెనీలతో కలిసి జాయింట్ వెంచర్‌గా ముందుకు వెళ్తామని వెల్లడించారు. ఇప్పటికే సింగరేణి ఓవర్ బర్డెన్ నుంచి ఇసుక తయారీ యూనిట్లను ఏర్పాటు చేసిందని, అలాగే ఫ్లై యాష్ నుండి, కార్బన్ డయాక్సైడ్ నుండి ఇతర ఉత్పత్తులు సాధించడానికి రంగం సిద్ధమైందన్నారు. అలాగే సింగరేణి ప్రాంతంలో జియో కెమికల్ లేబరేటరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

# నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే21:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నేటి(మే 22) నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు 29 వరకు సాగనున్నాయి. ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండ్ ఇయర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయి. మే 25న ఆదివారం కూడా పరీక్షలు యథావిధిగా జరగుతాయని, సెలవు ఉండదని అధికారులు స్పష్టం చేశారు. అలాగే అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానించినట్లు తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన ఫర్నీచర్, ఫ్యాన్లు, వెలుతురు, మంచినీటి సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మే 22 నుంచి జరిగే ఈ పరీక్షలకు విద్యార్థులు పరీక్ష కేంద్రాల్లోకి ఫోన్‌లు తీసుకురాకూడదని, అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ శాఖ పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశారని చెప్పారు. విద్యార్థులు ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లతో నేరుగా పరీక్షలకు హాజరుకావచ్చని, హాల్‌టికెట్లపై ముద్రించిన క్యూఆర్ కోడ్ ఆధారంగా విద్యార్థులు పరీక్ష కేంద్రాల పూర్తి వివరాలను తెలుసుకోవచ్చని ఆయన వివరించారు. ఇక పరీక్షల పర్యవేక్షణకు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తుంటాయని తెలిపారు. 2,66,207 మంది ఫస్ట్ ఇయర్ పరీక్షలు,1,47,390 మంది సెకండ్ ఇయర్ పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి కనీసం 30 నిమిషాల ముందుగా చేరుకోవాలని అధికారులకు సూచించారు.

# కాస్మోటిక్ చార్జీల చెల్లింపుల కోసం డెబిట్ కార్డు
### ఉన్నత స్థాయి సమీక్షలో సిఎస్ రామకృష్ణారావు నిర్ణయం



బుధవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సిఎస్ రామకృష్ణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే21:** గౌరవ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణారావు రాష్ట్రంలోని సోషల్ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీల చెల్లింపులను నేరుగా విద్యార్థుల అకౌంట్‌లలో జమ చేసే విధి విధానాలపై సమీక్ష చేశారు. దీనికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం డా.బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ జూన్ మాసంలో పాఠశాలలు పునఃప్రారంభమవగానే విద్యార్థుల ఆధార్, ఫోటోలను సంబంధిత బ్యాంక్ బ్రాంచీలకు అనుసంధానించి వారి బ్యాంక్ అకౌంట్‌లకు డెబిట్ కార్డు మంజూరు చేయించాలని అన్నారు. జూన్ మాసాంతం నాటికి రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థుల అకౌంట్‌లలో కాస్మోటిక్ చార్జీల చెల్లింపులు జరిగే విధంగా తగు కార్యాచరణ చేపట్టాలని పేర్కొన్నారు. దాదాపు 6లక్షల విద్యార్థులకు ఈ సదుపాయం అందించబడుతుందని అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు రాష్ట్ర మంత్రివర్యులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు డిబిటి ద్వారా చెల్లింపులు జరిగే విధంగా కార్యక్రమం రూపొందించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా డెబిట్ కార్డు తరహాలో ఒక స్మార్ట్ కార్డును అందించి విద్యార్థులు వారికి కావాల్సిన సబ్బులు, కాస్మోటిక్ వస్తువులు కొనుగోలు చేసుకోవడానికి మహిళా సంఘాలు నిర్వహిస్తున్న మొబైల్ విక్రయకేంద్రాల ద్వారా కొనుగోలుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సిఎస్ సూచించారు.

ఈ సమీక్ష సమావేశంలో రాజీవ్ యువ వికాసం, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ చెల్లింపులు తదితర అంశాలపై సమీక్ష చేశారు. ఈ సమావేశంలో ఎస్‌సి డెవలప్‌మెంట్ ముఖ్యకార్యదర్శి ఎన్ శ్రీధర్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ఎ. వర్షిణి, బిసి వెల్ఫేర్ కార్యదర్శి ఇ.శ్రీధర్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

## దివాల అయ్యింది తెలంగాణ ఆర్థిక వ్యవస్థకాదు..
### సిఎం రేవంత్ రెడ్డి ఆలోచనలు: హరీశ్ రావు విమర్శ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే21:** తెలంగాణ రాష్ట్రం ఆర్థిక రంగంలో అసాధారణ విజయం సాధించిందని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. 2015లో తలసరి జీఎస్‌వీపీ (పర్ క్యాపిటా గ్రాస్ స్టేట్ వాల్యూ యాడెడ్)లో 9వ స్థానంలో ఉన్న తెలంగాణ, 2024 నాటికి దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని ఐసీఆర్ఏ స్టేట్ ఎకనామిక్ ట్రెండ్స్ – మే 2025 నివేదిక వెల్లడించిందని చెప్పారు. ఈమేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తలసరి ఆదాయం రూ. 1.25 లక్షల నుంచి రూ. 3.5 లక్షలకు రెట్టింపు కాగా 6.8 శాతం సీఏజీఆర్‌తో ఈ పురోగతి సాధ్యమైందన్నారు. ఈ విజయం వెనుక కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులు, వ్యవసాయ విధానాలు, బలమైన పారిశ్రామిక వృద్ధి ఉన్నాయని, ఇది సమర్థవంతమైన పాలన, ధీటైన ఆర్థిక వ్యూహాలతో తెలంగాణను దేశంలో అభివృద్ధి చిహ్నంగా నిలిపిన సాక్ష్యం అన్నారు. అయినప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని దివాలా రాష్ట్రంగా చిత్రీకరిస్తూ వస్తున్నారని, వాస్తవంగా దివాలా అయింది ఆర్థికవ్యవస్థ కాదు, ఆయన ఆలోచనలే అని ఆయన పేర్కొన్నారు.



### అమెరికాలో భారతసంతతి
# వ్యాపారవేత్త దారుణ హత్య

**టెక్సాస్, మే 21:** అగ్రరాజ్యం అమెరికాలో భారత సంతతికి చెందిన ఓ వ్యాపారవేత్త దారుణ హత్యకు గురయ్యాడు. టెక్సాస్‌లోని ఆస్టిన్ ప్రాంతంలో బస్సులో ప్రయాణిస్తున్న అతడిపై మరో భారతీయుడు కత్తితో పొడిచి చంపేశాడు. ఆస్టిన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భారత సంతతికి చెందిన అక్షయ్ గుప్తా (30) హెల్త్ టెక్ స్టార్టప్ కంపెనీకి సహ వ్యవస్థాపకుడిగా ఉన్నారు. అతను మే 14వ తేదీన ఆస్టిన్‌లో బస్సులో ప్రయాణిస్తున్నాడు. ఆ సమయంలో 31 ఏళ్ల దీపక్ కండెల్ అనే భారతీయుడు గుప్తాను కత్తితో పొడిచి హతమార్చాడు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని అక్షయ్ గుప్తాను ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే గుప్తా ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు నిర్ధారించారు. గుప్తా మెడపై నిందితుడు కత్తితో పొడిచినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న ఆస్టిన్ పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని పట్టుకున్నారు. అక్షయ్‌గుప్తా ఈ మామలా కనిపించడంతోనే తాను అతడిని కత్తితో పొడవాలని నిందితుడు పోలీసులకు తెలిపాడు. అక్షయ్ పెన్‌స్టేట్ యూనివర్సిటీనుంచి మాస్టర్స్ పూర్తిచేసారు. తన కొత్తప్రాజెక్టుకు సంబంధించి ఇటీవల మైక్రోసాఫ్ట్ సిఇఒ సత్య నాదెళ్లను కూడా కలిసారు.

### అత్యంత ప్రభావశీల దాతృత్వ ప్రముఖుల్లో
# ముఖేశ్,నీతా అంబానీలు టాప్



**న్యూయార్కు, మే 21:** ప్రపంచ వ్యాప్తంగా దాతృత్వంలో మిన్నగా ఉంటున్న అత్యంత ప్రభావశీలురైన 100మందితోకూడిన జాబితాను టైమ్స్ మ్యాగజైన్ విడుదల చేసింది. ఆ జాబితాలో భారత్‌నుంచి ముకేశ్ , నీతా అంబాని దంపతులు, విప్రో మాజీ ఛైర్మన్ అజీమ్‌ప్రేమ్‌జీ, జెరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్‌కామత్‌లున్నారు. ఫౌండేషన్లు, లాభాపేక్షలేని సంస్థలను స్థాపించిన వారు ఎంతో ఉదారంగా అవసరంలో ఉన్నవారిని ఆదుకున్నారని దటైమ్ 100 అత్యంత ప్రభావితశక్తిమంతులైన భూరిదాతలు2025 జాబితాలో వెల్లడించింది. నీతా ముకేష్ దంపతులు 2024లో రూ.407 కోట్లు విరాళంగా ఇచ్చారు. వీరి వ్యాపార సామ్రాజ్యం 110 బిలియన్ డాలర్లుగా ఉంది. రిల యన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఛైర్మన్‌గా నీతా అంబాని పలు దాతృత్వ కార్యక్రమాలుచేపట్టారు. ఇక విప్రో అజీంప్రేమ్‌జీ 2013లో గివింగ్ ప్లెడ్జ్‌పై సంతకం పెట్టిన తొలిభారతీయుడు విప్రో అజీమ్‌ప్రేమ్‌జీ. 25 ఏళ్లకిందట ఫౌం డేషన్‌పెట్టి 29 బిలియన్ డాలర్లకుపైగా విలువైన షేర్లను తన కంపెనీనుంచి ఫౌండేషన్‌కు బదిలీచేసారు. 2023-24లో సంప్రదాయ విరాళాలతోపాటు 109మిలియన్ డాలర్లను విద్య, ఆరోగ్యం, తదితర రంగాల్లోని 940 సంస్థలకు ఇచ్చారు.జెరోధా సహవ్యవస్థాపకుడు నిఖిల్ కామత్, పర్యావరణ విద్యాప్రాజెక్టులకు భారీ స్థాయిలో నిధులసాయంచేసారు. బ్రిటన్ ఫుట్‌బాల్ ఆటగాడు డేవిడ్ బెక్‌హాం, అమెరికా అపర కుబేరుడు వారెన్ బఫెట్‌తో పాటు మిలిం డాగేట్స్ బ్రిటన్‌కు చెందిన ప్రిన్స్ విలియమ్, ప్రిన్సెస్ ఆఫ్ వేల్స్ కేథరిన్ తదితరులున్నారు.

# ప్రాణాపాయస్థితిలో హమ్‌జా



**లాహోర్, మే 21:** పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత ఉగ్ర సంస్థ లష్కరే తోయిబా సహ వ్యవస్థాపకుడు అమీర్ హమ్‌జా ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు తెలి సింది. లాహోర్ లోని తన నివాసంలో జరిగిన ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. లష్కరే తోయిబా 17 మంది వ్యవస్థాపక సభ్యుల్లో హమ్‌జా ఒకరు. అతను తన ఇంటి లోపల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడినట్లు సం బంధిత వర్గాలను ఊటంకిస్తూ వార్తలు వెలువడ్డాయి.ప్రస్తుతం అతడు ఆసు పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పేర్కొంది. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమం గానే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే సోషల్ మీడియాలో అతనిపై కాల్పులు జరిగినట్లుగా వార్తలు వస్తున్నాయి. కానీ,ఆ ఊహాగానాలన్నీ అబద్ధమని దర్యా ప్తులో తేలింది. లష్కరే తోయిబాలో అమీర్ హమ్‌జా కీలక వ్యక్తి. నిధుల సేక రణ, రిక్రూట్ మెంట్ వంటి అంశాల్లో కీలకంగా వ్యవహరించాడు. లష్కరే కేంద్ర సలహా కమిటీ సభ్యుడిగా, హాఫీజ్ సయీద్ నాయకత్వంలోని ఇతర ఉగ్రవాద గ్రూపులతో సంబంధాలను మెరుగుపరచడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. 2018లో లష్కరే తోయిబా అనుబంధ స్వచ్ఛంద సంస్థలైన జమాత్ ఉద్‌దవా, ఫలాహ్‌ఎఇన్సానియత్ ఫౌండేషన్‌లపై పాకిస్థాన్ అధికారులు ఆర్థికంగా ఆంక్షలు విధించిన తర్వాత హమ్‌జా లష్కరేని వీడాడు. ఆ తర్వాత జైషే మన్ ఖఫా అనే ఉగ్రవాద సంస్థను స్థాపించాడు.

## దుంప కూరగాయల సాగుకు కార్యాచరణ
### వ్యవసాయ పరిశోధన అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ సుధాకర్

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా దుంప కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు కార్యాచరణను రూపొందించనున్నట్లు భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సుధాకర్ పాండే వెల్లడించారు. రాజేంద్రనగర్ ఉ ద్యాన కళాశాల వేదికగా రెండ్రోజుల పాటు జరిగిన దుంప కూరగాయలపై అఖిల భారత సమన్వయ పరిశోధన పథకం సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలను క్లస్టర్లుగా చేసి దుంప పంటల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేయాలని సూచించారు. కందలో డ్రిప్ ఇరిగేషన్, దూదిపురుగు నియంత్రణ పద్ధతులపై పరిశోధనలను ముమ్మరం చేస్తామని వివరించారు. వచ్చే ఐదేండ్లలో దుంపకూరల జనక రకాలను సేకరించి పరిశీలించాలని శాస్త్రవేత్తలకు సూచించారు. కాగా తెలంగాణలో జూన్, జూలైలో విత్తుకోవడానికి అనుకూలంగా ఉండే శ్రీకిర రకాన్ని పరిశీలించాలని సిఫార్సులో పేరొన్నారు. ఈ సదస్సులో కేంద్రీయ దుంపకూరల పరిశోధన సంస్థ డైరెక్టర్ జీ బైజు, అనితకుమారి, కళాశాల అసోసియేట్ డీన్ పీ ప్రశాంత్‌తో పాటు పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# వానాకాలంలో సన్నాలపైనే గురి
### అన్ని పంటలు 1.34 కోట్ల ఎకరాల్లో సాగు
### గతం కంటే పెరగనున్న 4 లక్షల ఎకరాలు
### వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** వచ్చే నెల నుండి ప్రారంభమయ్యే వానాకాలం సాగు సీజన్‌లో సన్న రకం వరి ధాన్యం సాగు వైపే రైతులు మొగ్గుచూపే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 1.34 కోట్ల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని తాజాగా ప్రతిపాదించింది. గత వానాకాలం సీజన్‌తో పోలిస్తే ఈ సారి సాగు విస్తీర్ణం సుమారు 4లక్షల ఎకరాలకుపైగా పెరిగే అవకాశం ఉన్నట్టు అంచనా. కూరగాయలు, ఇతర ఉద్యానవన పంటలు కలిపి 10లక్షల ఎకరాల వరకు ఉండొచ్చని వ్యవసాయ శాఖ భావిస్తోంది. ఈ మేరకు వానాకాలం సీజన్ సాగు ప్రణాళికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపింది. ఈ మొత్తం విస్తీర్ణంలో అన్ని పంటల కంటే అత్యధికంగా 66.80 లక్షల ఎకరాల్లో వరిని సాగు చేస్తారని పేర్కొంది. క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వడంతో సన్నాలకు గిరాకీ పెరుగుతున్న దృష్ట్యా వీటి సాగు 60 నుంచి 70 శాతానికి పైగా ఉండొచ్చని అంచనా వేసింది. పత్తి సాగు 50 లక్షల ఎకరాలతో రెండోస్థానం ఉంటుందని వెల్లడించింది. వీటికి అనుగుణంగా విత్తనాలు, ఎరువులను వ్యవసాయ శాఖ సిద్ధం చేస్తోంది. వచ్చే వానాకాలంలో 16.70 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమని పేర్కొంది. ఇందులో ఇప్పటికే 75లక్షల ఎకరాలకు సరిపడా విత్తనాలను అందుబాటులో ఉంచింది. వాటిలో సీడ్స్ కార్పొరేషన్ 17,790 క్వింటాళ్లు, నేషనల్ సీడ్ కార్పొరేషన్ 9,500 క్వింటాళ్లను సిద్ధం చేసింది. ఇక ప్రయివేటు సంస్థలు 18.52 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చాయి. అలాగే 45వేల క్వింటాళ్ల పత్తి విత్తనాలకుగాను ప్రయివేటు కంపెనీలు 1.34 లక్షల క్వింటాళ్ల బీటీ విత్తనాలను సిద్ధంగా ఉంచాయి. మొక్కజొన్న ఆరు లక్షల ఎకరాల్లో సాగైతే, అందుకు 48వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని తేల్చింది. ఇవి కాకుండా కందులు, పెసలు, మినుములు, జొన్నలు, వేరుశనగ, ఆముదం, నువ్వులు తదితర పంటల విత్తన ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేసింది.

## ఫ్రెంచ్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో..
# భారత్ నంబర్ వన్ సుమిత్ శుభారంభం



**న్యూఢిల్లీ:** ఫ్రెంచ్ ఓపెన్ గ్లాండ్‌స్లామ్ టెన్నిస్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో భారత్ నంబర్ వన్ సుమిత్ నగాల్ శుభారంభం చేశాడు. పారిస్‌లో జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 170వ ర్యాంకర్ సుమిత్ 6-1, 6-1తో వరల్డ్ 141వ ర్యాంకర్, అమెరికాకు చెందిన మిచెల్ క్రెగెర్‌పై గెలుపొందాడు. 74 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ ఒక ఏస్ సంధించి, ఒక డబుల్ ఫాల్ట్ చేశాడు. తన సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోని సుమిత్ ప్రత్యర్థి సర్వీస్‌ను 5 సార్లు బ్రేక్ చేశాడు. సుమిత్ నెగ్గిన మొత్తం 59 పాయింట్లలో 22 విన్నర్స్ ఉన్నాయి. 14 అనవసర తప్పిదాలు చేసిన సుమిత్ నెట్ వద్దకు 10 సారులన దూసుకొచ్చి 8 సార్లు పాయింట్లు గెలిచాడు. రెండో రౌండ్‌లో ప్రంచ 225వ ర్యాంకర్, ఆస్ట్రేలియాకు చెందిన జురిజ్ రొడియోనోవ్‌తో సుమిత్ తలపడనున్నాడు. 27 ఏళ్ల సుమిత్ తన కెరీర్‌లో ఎనిమిదిసారులన గ్రాండ్‌స్లామ్ టోర్నీలో మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మూడు సార్లు, ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్‌లో ఒక్కసారి, యూఎస్ ఓఎన్‌లో మూడు సార్లు అతను మెయిన్ డ్రాలో పోటీ పడ్డాఉ. 2020 యూఎస్ ఓపెన్‌లో, 2024 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండో రౌండ్‌కు చేరడం సుమిత్ గ్రాండ్‌స్లామ్ కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శనగా ఉంది.

# బ్యాడ్మింటన్ టోర్నీ నుంచి సింధు నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** మలేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2025లో డబుల్ ఒలింపిక్ పతక విజేత పివి సింధు మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించింది. అయితే పురుషుల సింగిల్స్‌లో మాత్రం హెచ్‌ఎస్ ప్రణయ్, సతీష్ కరుణాకరన్ అద్భుతమైన విజయాలు సాధించి రెండో రౌండ్‌కు చేరుకున్నారు. బుధవారం జరిగిన సూపర్ 500 టోర్నమెంట్‌లో తొలి రౌండ్‌ను క్లియర్ చేయడంలో విఫలమైన సింధు పేలవమైన ఫామ్ కొనసాగింది, వియత్నాంకు చెందిన న్గుయెన్ తుయ్ లిన్హ్ చేతిలో 11-21, 21-14, 15-21 తేడాతో ఓడిపోయింది. కాగా ఈ టోర్నమెంట్‌లో 1 గంటా 22 నిమిషాల పాటు జరిగిన హోరాహోరీ పోరులో ప్రణయ్ మొదటగా కోర్టులో జపాన్‌కు చెందిన ఐదవ సీడ్ కెంటా నిషిమోటో ఢీకొని అతడిని 19-21, 21-17, 21-16 తేడాతో ఓడించాడు. కరుణాకరన్ చైనీస్ తైపీకి చెందిన మూడో సీడ్ చౌ టియెన్ చెన్‌ను 21-13, 21-14 తేడాతో కేవలం 39 నిమిషాల్లో ఓడించడం ద్వారా కూడా నిరాశపరిచాడు. అలాగే కెనడాకు చెందిన బ్రియాన్ యాంగ్‌ను 20-22, 21-10, 21-8 తేడాతో ఓడించిన భారత్‌కు చెందిన ప్లేయర్ ఆయుష్ శెట్టి కూడా పురోగతి సాధించాడు.






## వరల్డ్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ ఫైనల్స్
# ముగిసిన భారత్ పోరాటం

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక టేబుల్ టెన్నిస్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో భారత సింగిల్స్ ఆటగాళ్ల పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్‌లో మనిక బాత్రా, దివ్యతో పాటు పురుషుల సింగిల్స్‌లో మానవ్ టక్కర్ రెండో రౌండ్‌కే వెనుదిరిగారు. ఖతార్‌లోని దోహాలో జరిగిన మహిళల రౌండ్ ఆఫ్ 64 మ్యాచ్‌లో రిపబ్లిక్ ఆఫ్ కొరియాకు చెందిన గా హ్యోన్ పార్క్ చేతిలో భారత్ స్టార్ ప్యాడ్లర్ మానికా బాత్రా ఓటమి చెందింది. దీంతో మానికా ప్రపంచ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ ఫైనల్స్-2025 నుండి నిష్క్రమించింది. వరల్డ్ ర్యాంక్‌లో 46వ స్థానంలో ఉన్న మానికా తన తొలి రౌండ్ మ్యాచ్‌లో నైజీరియాకు చెందిన ఫాతిమో బెల్లోను ఓడించింది. అయితే తదుపరి మ్యాచ్‌లో హ్యోన్ పార్క్ చేతిలో 4-0 (11-8, 11-7, 11-5, 11-8) తేడాతో ఓడిపోయింది. 144వ ర్యాంక్‌లో ఉన్న పార్క్ 35 నిముషాలకు పైగా కనసాగిన మ్యాచ్‌లో మానికాను ఓడించింది. అలాగే దియా చిటాలే 64వ రౌండ్‌లో చైనీస్ తైపీకి చెందిన మూడుసార్లు ఒలింపియన్ చెంగ్ ఐ చింగ్ చేతిలో ఓటమిపాలైంది. తొలి మూడు గేముల్లో వెనుకబడిన చిటాలే టోర్నమెంట్‌నుండి నిష్క్రమించింది. మొదటి మూడు గేమ్‌లలో ఓడిన తర్వాత నాల్గవ గేమ్‌లో పుంజుకుంది. అయితే చెంగ్ ఐదవ గేమ్‌లో 4-1 (11-3, 11-7, 11-6, 6-11, 11-15)తో చిటాలేను ఓడించింది. కాగా పురుషుల మ్యాచ్‌లో 48వ ర్యాంకర్ మానవ్ 2-4 (11-13, 3-11, 11-9, 6-11, 11-9, 3-11)తో హరిమొటొ తొమొకజు (జపాన్) చేతిలో పోరాడి ఓడాడు. మ్యాచ్ ఓడినా మానవ్ పోరాటం ఆకట్టుకుంది. మరో పోరులో దివ్య 1-4 (3-7, 7-11, 6-11, 11-6, 5-11)తో చైనీస్ తైపీ అమ్మాయి చెన్ ఐ చింగ్‌కు తలవంచింది. ఈ ఓటములతో సింగిల్స్ ఈవెంట్‌లో భారతదేశం యొక్క సవాలు ముగిసింది.

# ఐపిఎల్ స్టార్లకు లక్

## టీమిండియాలో చోటు.. అనుకోని ప్లేయర్ల అద్భుత ప్రదర్శన













**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025, సీజన్ 18 గుర్తింపులేని ఆటగాళ్లకు వెలుగులోకి వచ్చేందుకు అత్యుత్తమ వేదికగా నిలిచింది. అనుకోని ఆటగాళ్లు అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. కొందరు శక్తివంతంగా మెరిస్తూ, జాతీయ జట్టులోకి ఎక్కి తమ స్థానం పటిష్టం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఐపీఎల్ చివర దశలోకి చేరుతున్న సందర్భంగా, త్వరలోనే భారత టి20 జట్టులో చోటు సంపాదించే అవకాశం కలిగి అద్భుత ప్రదర్శనలు చేస్తున్న నాలుగు ఆటగాళ్లు ఉన్నారు. శుభ్‌మన్ గిల్ టి20 ఫార్మాట్‌లో తన స్థిరతతో ఆకట్టుకుంటున్నాడు. అశుతోష్ శర్మ అత్యుత్తమ ఫినిషర్‌గా ఎదిగిపోతున్నాడు. నేహల్ వాధెరా కష్టకాలంలో ఆటను నిలబెట్టే అంకర్‌గా గుర్తింపు పొందాడు. ప్రసిద్ధ్ క్రిష్ణ బౌలింగ్‌లో శక్తివంతమైన పరిణామాన్ని చూపించి టి20 వరల్డ్ కప్ కోసం గట్టిగా పోటీ పెడుతున్నాడు. గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ టెస్ట్ కెప్టెన్సీకి ప్రధాన అభ్యర్థిగా ఉన్నాడు. రోహిత్ శర్మ ఒడిఐల నుండి రిటైర్ అయితే, ఆ ఫార్మాట్‌కు కూడా గిల్ నాయకత్వ బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో 12 మ్యాచ్‌ల్లో 601 పరుగులు, 155 స్ట్రైక్ రేట్, 60 సగటుతో గిల్ అదరగొట్టాడు. గత మూడు సీజన్లలో 483, 890, 426 పరుగులతో గిల్ తన స్థిరతను నిరూపించాడు. అతని క్లాసిక్ షాట్లు మరియు స్ట్రోక్‌ప్లే టఫ్ కండిషన్లలో ఇండియాకు ప్లస్ అవుతాయి. ఇక అశుతోష్ శర్మ ఒక ప్రత్యేకమైన ఫినిషర్. కఠిన పరిస్థితుల్లో వచ్చినా మ్యాచ్‌ని తిరగరాయగల సామర్థ్యం అతనిలో ఉంది. 2024లో పంజాబ్ కింగ్స్ తరపున 11 మ్యాచ్‌ల్లో 189 పరుగులు, 167.2 స్ట్రైక్ రేట్‌తో ఉన్నాడు. ఇప్పుడు ఢిల్లీ క్యాపిటల్స్‌కు కీలక ఆటగాడిగా ఎదిగాడు. ఈ ఐపీఎల్‌లో 11 మ్యాచ్‌లలో 187 పరుగులు 167.5 స్ట్రైక్ రేట్. ఈ స్థిరత అతన్ని భారత టి20 జట్టులో నెం.5 లేదా 6 స్థానానికి సరిపోయే ఆటగాడిగా నిలబెడుతుంది. అలాగే పంజాబ్ కింగ్స్ ఘనమైన ఐపీఎల్ ప్రదర్శనకు ప్రధానంగా టాప్ ఆర్డర్‌లో శ్రేయాస్ అయ్యర్, ప్రభ్‌సిమ్రన్ సింగ్, ప్రియాంశ్ ఆర్యలు ఉన్నా, మధ్యలో బాటింగ్‌ను నిలబెట్టినది నేహల్ వాధెరానే. బెంగళూరులో టఫ్ పిచ్‌లో 19 బంతుల్లో 33 నాటౌట్, 206 లక్ష్యాన్ని ఛేధించే సమయంలో 4 వికెట్లు కోల్పోయిన తరువాత 62(41), అలాగే రాజస్థాన్‌పై 70(37) ఇన్నింగ్స్‌లు అతని సామర్థ్యాన్ని చూపించాయి. అతని స్థిరత మరియు ప్రశాంతత కారణంగా అతనికి త్వరలోనే నేషనల్ కాల్‌అప్ రావచ్చు. ఇక ఈ ఐపీఎల్‌లో ప్రసిద్ధ్ క్రిష్ణ తన కెరీర్‌లో జాష్ హాజిల్‌వుడ్ లాంటి ట్రాన్స్‌ఫర్మేషన్ చూపించాడు. అతను వేగాన్ని, లెంగ్త్‌ను, లైన్‌ను తగినట్లు మార్చుకుంటూ బౌలింగ్ చేస్తున్నాడు. ప్రస్తుతం బిగి టేబుల్ టాపర్‌గా ఉన్నా, అతను 12 మ్యాచ్‌లలో 21 వికెట్లు తీసి పర్పుల్ క్యాప్ హోల్డర్‌గా ఉన్నాడు. 17 సగటుతో అతని ఫార్మ్ అద్భుతంగా ఉంది. అతని లైన్లు మరియు లెంగ్త్ అతన్ని గి20 వరల్డ్ కప్ 2026కు అర్హుడిగా నిలబెడుతున్నాయి.








## మాస్టర్స్ వరల్డ్ టోర్నీలో..
# శ్రీకాంత్ ముందంజ
### మెయిన్ డ్రాకు అర్హత.. తరుణ్, అన్‌మోల్ ఓటమి

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్న ప్రపంచ మాజీ నంబర్ వన్, భారత్ అగ్రశ్రేణి షట్లర్ కిడాంబి శ్రీకాంత్ మళ్లీ ఫామ్‌లోకి వస్తున్నాడు. కౌలాలంపూర్‌లో ప్రారంభమైన మలేషియా ఓపెన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీలో శ్రీకాంత్ మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. క్వాలిఫయింగ్ దశలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన శ్రీకాంత్ మెయిన్ డ్రాలోకి అడుగు పెట్టాడు. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 65వ స్థానంలో ఉన్న శ్రీకాంత్ తొలి రౌండ్‌లో 21-8, 21-13తో చైనీస్ తైపీకి చెందిన కువో కువాన్ లిన్‌పై గెలుపొందాడు. అనంతరం రెండో రౌండ్‌లో 9-21, 21-12, 21-6తో చైనీస్ తైపీ హువాంగ్ యి కాయ్‌పై నెగ్గి క్వాలిఫయర్ హోదాలో మెయిన్ డ్రాలోకి ప్రవేశించాడు. మెయిన్ డ్రా తొలి రౌండ్‌లో ఆరో సీడ్, చైనా ప్లేయర్‌లు గ్వాంగ్ జు తో శ్రీకాంత్ తలపడతాడు. ఇక గత వారం థాయ్‌లాండ్ ఓపెన్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్ వరకూ దూసుకెళ్లిన హైదరాబాదీ ప్లేయర్ మన్నెపల్లి తరుణ్ ఈ టోర్నీలో నిరాశ ఎదురైంది. క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగాడు. తరుణ్ 13-21, 21-23తో థాయ్‌లాండ్‌కు చెందిన పనిత్ చఫోన్ తీరారత్‌సకుల్ చేతిలో ఓడిపోయాడు. భారత్‌కే చెందిన మరో ప్లేయర్ శంకర్ ముత్తుస్వామి 20-22, 20-22తో చైనాకు చెందిన జు జువాన్ చెన్ చేతిలో పరాజయం పాలయ్యాడు. కాగా మహిళల సింగిల్స్‌లో భారత్ రైజింగ్ స్టార్ అన్‌మోల్ ఖరబ్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. అన్‌మోల్ 14-21, 18-21తో చైనీస్ తైపీకి చెందిన హుంగ్ యి టింగ్ చేతిలో ఓటమి చవిచూసింది. మిక్స్‌డ్ డబుల్స్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో మోహిత్-లక్షిత జగ్లాన్ ద్వయం 15-1, 16-21తో చైనీస్ తైపీ మింగ్ యాప్ టూ-లీ యు షాన్ జంట చేతిలో ఓడిపోయింది.

# వాణిజ్యం

# యుఎస్ టారిఫ్‌ల ప్రభావాన్ని తట్టుకునే స్థితిలో భారత్: మూడీస్




**వాషింగ్టన్, మే 21:** అమెరికా సుంకాల ప్రభావం, ప్రపంచ వాణిజ్య అంతరాయాల ప్రతికూలతలను తట్టుకునే స్థితిలోనే భారత్ ఉందని ప్రముఖ రేటింగ్ సంస్థ మూడీస్ తెలిపింది. దేశీయ వృద్ధికి ప్రోత్సాహకాలు, ఎగుమతులపై తక్కువ ఆధారపడటం తదితర అంశాలే అందుకు కారణమని వివరించింది. భారత్‌లో తయారీ సామర్థ్యాన్ని విస్తరించడానికి, ప్రైవేట్ వినియోగాన్ని పెంచడానికి, మౌలిక సదుపాయాల కల్పనపై వ్యయాన్ని పెంచడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు దోహదం చేస్తున్నాయని మూడీస్ వెల్లడించింది. ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం, ఆర్థిక వ్యవస్థను మరింత ప్రోత్సహించడానికి వడ్డీ రేట్ల తగ్గింపు లాంటి చర్యలు చేపడుతోందని తెలిపింది. అమెరికా సుంకాలు, ప్రపంచ వాణిజ్య అంతరాయాలను ఎదుర్కో వడానికి ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల కంటే.. భారత్ మెరుగైన స్థానంలో ఉంది. దీనికి బల మైన అంతర్గత వృద్ధి, గణనీయమైన దేశీయ ఆర్థిక వ్యవస్థ, ఇతర దేశా లపై తక్కువ ఆధారపడటం వంటివి దోహదం చేస్తు న్నాయి అని మూడీస్ తన నివేదికలో పేర్కొంది. భారత్ కంటే పాకిస్థాన్ వృద్ధిపైనే ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తా యని మూడీస్ వెల్లడించింది. పాకిస్థాన్‌తో భారత్‌కు ఆర్థిక సంబంధాలు తక్కువ స్థాయి లో ఉన్నాయి. సరిహద్దుల్లో ఉద్రికత్తలు పెరిగినప్ప టికీ.. భారత ఆర్థిక కార్యకలాపాలకు పెద్ద అంతరాయాలు ఉండవని మేం ఆశిస్తు న్నాం. మరోవైపు భారత్‌లోని వ్యవ సాయ, పారిశ్రామిక రంగాల్లో ఎక్కువ ఉత్పత్తి చేసే ప్రాంతా లు ఘర్షణ ప్రాంతాలకు దూరంగా ఉన్నాయి అని మూడీస్ వివరించింది. అయితే అధిక రక్షణవ్యయం భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభా వం చూపే అవకాశం ఉందని తెలిపింది. వాణిజ్య చర్చలు ఫలవంతమైతే భారత ఉత్పత్తులు అమెరికాకు భారీగా ఎగుమతి అవుతాయని అంచనా వేసింది.

# మూడు రోజుల నష్టాలకు బ్రేక్..

**ముంబై, మే 21:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. వరుసగా మూడు ట్రేడింగ్ సెషన్ల నుంచి నష్టాలు చవిచూసిన సూచీలు.. నేడు ఓ మోస్తరు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఓ దశలో 800 పాయింట్ల మేర లాభపడింది. రియల్టీ, ఫార్మా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఆటో, బ్యాంక్, ఎఫ్ఎంసీజీ షేర్లు కూడా రాణించడం సూచీలకు కలిసొచ్చింది. అయితే, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలపై ఆందోళన కొనసాగు తోంది. మార్కెట్లు మరింత పైకి వెళ్లేందుకు ఇవి అడ్డంకిగా మారొచ్చన్న విశ్లేషణలు వినవస్తున్నాయి. సెన్సెక్స్ ఉదయం 81,327.61 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 82,021.64 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 410 పాయింట్ల లాభంతో 81,596.63 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 129.55 పాయింట్ల లాభంతో 24,813.45 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.64గా ఉంది. బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా స్టీల్, సన్‌ఫార్మా, టెక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్ షేర్లు




ప్రధానంగా లాభ పడ్డాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఐటీసీ, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 66.17 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,314 డాలర్ల వద్ద స్థిరపడింది.

# 15వేల ఉద్యోగులకు యాక్సెంచర్ ప్రమోషన్లు

**ముంబై, మే 21:** ప్రముఖ ఐటీ సేవల సంస్థ యాక్సెంచర్ గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ ఉద్యో గుల్లో 50 వేలమందికి ప్రమోషన్లు ఇవ్వ నుంది. భారత్‌లోని 15 వేల మంది ఉద్యోగులకు ఉద్యోగోన్నతి కల్పించనుంది. కన్సల్టింగ్ సేవలకు డిమాండ్ తగ్గుముఖం పట్టడంతో ఇప్పటికే ప్రమోషన్లు ఆరు నెలలు వాయిదా పడ్డాయి. ఉద్యోగుల్లో మనోస్థైర్యాన్ని నింపేం దుకు జూన్‌లో ప్రమోషన్లు ఇవ్వ నుంది. ఈ మేరకు ఇంటర్నల్ మెమోలు పంపుతోందని ఒక నివేదిక పేర్కొంది. భారత్‌లో 15 వేలు, యూరప్‌లో 11 వేలు, పశ్చిమాసియా, ఆఫ్రికాలో కలిపి 11వేలు, అమెరికాలో 10 వేల మంది చొప్పున ప్రమోషన్లు ఇవ్వనున్నట్లు కంపెనీ తమ సిబ్బందికి పంపిన అంతర్గత సమాచారంలో తెలిపింది. ప్రస్తుతం యాక్సెంచర్‌లో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 8 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. మొత్తం సిబ్బందిలో జూన్‌లో 6 శాతం మంది సిబ్బంది ప్రమోషన్లు అందుకోనున్నారు. వాస్తవానికి డిసెంబర్‌లోనే ప్రమోషన్ల ప్రక్రియ జరగాల్సి ఉంది. కీలక విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు బేస్ పే పెరగనుంది. అయితే బోనస్, పని తీరు ఆధారిత ఈక్విటీపై డిసెంబర్‌లో నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించింది. కొవిడ్ సమయంలో ఐటీ సేవలకు వచ్చిన డిమాండ్‌కు అనుగుణంగా యాక్సెంచర్ కూడా ఇతర కంపెనీల తరహాలో పెద్ద సంఖ్యలో ఉద్యోగుల్ని నియమించుకుంది. ఐటీ సేవలకు ఆశించిన స్థాయిలో డిమాండ్ లేకపోవడంతో 2023లో ఏకంగా 19 వేల మందిని తొలగించింది.





# వ్యాపారంలో తొందరపాటు వద్దు: విశాల్ మార్ట్

**చెన్నై, మే 21:** కోల్‌కతాలోని ఒక సాధారణ కుటుంబంలో జన్మించిన రామ్ చంద్రఅగర్వాల్ నాలుగేళ్ల వయసులో పోలియో బారిన పడ్డాడు. అతని శరీరంలోని ఒక కాలు పనిచేయడం మానేసింది, నడకకు చెక్క కర్రలే ఆధారంగా మారాయి. కానీ రామచంద్ర ఓటమిని అంగీకరించే మన స్తత్వం కాదు. చదువు పూర్తి చేసినా 9 నుండి 5 గంటల ఉద్యోగం తనతో కాదని తెలుసుకున్నాడు. దీంతో అప్పుగా తీసుకున్న డబ్బుతో కోల్‌కతాలో ఒక చిన్న ఫోటో స్టూడియో షాపు ప్రారంభించాడు.ఒక సంవత్సరం పాటు ఫోటో స్టూడియో నడిపినా అది అతనికి సంతృప్తి ఇవ్వలేదు. కూల్ డ్రింక్స్ అమ్మాడు కానీ పెద్దగా లాభాలు రాలేదు. అప్పుడు అతని దృష్టి ఫాబ్రిక్ వ్యాపారం వైపు మళ్లింది. కోల్‌కతాలో చిన్న బట్టల వ్యాపారం ప్రారంభించాడు. దాదాపు 15 సంవత్సరాలు బట్టల వ్యాపారం చేసినా అతని మనసు ఏదైన పెద్దగా చేయాలని కోరుకునేది. అందుకే, అన్నింటినీ వదిలేసి ఢిల్లీకి వచ్చాడు. 2001-02 సంవత్సరంలో రామ్ చంద్ర అగర్వాల్ ఢిల్లీ నుండి తన డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన విశాల్ మెగా మార్ట్ను ప్రారంభించాడు. దేశంలోని మధ్యతరగతి, పేద ప్రజలే లక్ష్యంగా ఒక కొత్త స్టోర్ సృష్టించాడు. కేవలం రూ.99కే నిత్యావసర వస్తువులు, బట్టలు అమ్మడం ద్వారా విశాల్ మెగా మార్ట్ ప్రజల హృదయాల్లో మంచి స్థానం సంపాదించుకుంది. దీంతో విశాల్ మార్ట్ వేగంగా విస్తరించింది. 414 నగరాల్లో 645 స్టోర్లు, 2,50,000 చదరపు అడుగుల రిటైల్ స్థలం, ఐదు గోడౌన్లు విశాల్ మార్టును రోజురోజుకు ముందుకు నడిపించాయి. 2007లో కంపెనీ రూ.2000 కోట్ల విలువైన ఐపీఓను ప్రారంభించింది. స్టాక్ మార్కెట్‌లో కూడా విశాల్ మెగా మార్ట్ పేరు చేరింది. అయితే వేగంగా అభివృద్ధి చెందాలనే పోటీ, తొందరపాటుతో తీసుకున్న తప్పుడు నిర్ణయాలు విశాల్ మెగా మార్ట్‌ను నష్టాల్లోకి నెట్టాయి. ఎటువంటి అంచనా లేకుండానే స్టోర్లు, గోడౌన్లు తెరవడం వల్ల కంపెనీపై అప్పుల భారం పెరిగింది. దానికి తోడు 2008 ఆర్థిక మాంద్యం కంపెనీని తీవ్రంగా దెబ్బతీసింది. స్టాక్ మార్కెట్‌లో వచ్చిన ప్రకంపనలను విశాల్ మెగా మార్ట్‌కు భారీ నష్టాలను కలిగించింది. దీంతో కంపెనీపై అప్పుల భారం రూ.750 కోట్లకు చేరుకుంది. 2011లో విశాల్ మెగామార్ట్ ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయింది. రూ.750 కోట్లకు పైగా అప్పులు పేరుకుపోయాయి. బ్యాంకులకు, అప్పు ఇచ్చినవాళ్ళకి కట్టడానికి కూడా డబ్బు కొరత ఏర్పడింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో విశాల్ మెగా మార్ట్‌ను కాపాడటానికి అగర్వాల్ కంపెనీని అమ్మాలని నిర్ణయించుకున్నాడు. రూ.1100 కోట్ల విలువైన కంపెనీని కేవలం రూ.70 కోట్లకే శ్రీరామ్ గ్రూప్ అండ్ టిపిజి కేపిటల్‌కు అమ్మేసాడు.




# భారత్‌లో ఫాక్స్‌కాన్ రూ.12,500 కోట్ల పెట్టుబడులు

**ముంబై, మే 21:** తైవాన్‌కు చెందిన టెక్ దిగ్గజం ఫాక్స్‌కాన్ మరోసారి భారత్‌లో భారీగా పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. ఐఫోన్ తయారీకి కీలక సరఫరాదారుగా ఉన్న ఈ సంస్థ, తాజాగా 1.5 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 12,500 కోట్లు) పెట్టుబడిని భారత్‌లో చేసినట్లు తెలిపింది. ఈ పెట్టుబడిని ఫాక్స్‌కాన్ యొక్క సింగపూర్ కేంద్రితయూనిట్, భారత ఉపకంపెనీ అయిన యూజాన్ టెక్నాలజీ ఇండియాలో 12.7 బిలియన్ షేర్ల కొనుగోలు రూపంలో పెట్టినట్లు వెల్లడించింది. ఇప్పటికే తమిళనాడులో స్మార్ట్‌ఫోన్లకు అవసరమైన విడి భాగాలను తయారు చేస్తోంది. ఆపిల్ సంస్థ కోసం ఐఫోన్ భాగాలను తయారు చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ యూనిట్‌కి ఇప్పుడు మరింత విస్తరణపై దృష్టి సారించింది. చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్‌ను తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న ఆపిల్ వ్యూహంలో భాగంగానే ఈ భారీ పెట్టుబడులను ప్రకటించింది. కాగా గత వారం ఫాక్స్‌కాన్- హెచ్‌సిఎల్ గ్రూప్ జాయింట్ వెంచర్‌కు నోయిడా విమానాశ్రయం సమీపంలో సెమీకండక్టర్ ప్లాంట్ నిర్మాణానికి భారత ప్రభుత్వం అనుమతిని మంజూరు చేసింది. రూ.3,700 కోట్లతో నిర్మించనున్న ఈ ఫ్యాక్టరీలో మొబైల్ ఫోన్లు, ల్యాప్టాప్లు, ఆటోమొబైల్, పీసీలు మొదలైన పరికరాల కోసం డిస్‌ప్లే డ్రైవర్ చిప్‌ల తయారీకి కీలక కేంద్రంగా మారనుంది. ఈ ఫ్యాక్టరీ ప్రతినెల 20,000 వెఫర్లు తయారు చేయగలదు. నెలకు 36 మిలియన్ యూనిట్ల అవుట్‌పుట్ సామర్థ్యం గల కెపాసిటీతో ఉంది. ఇది భారత్‌లో సెమీకండక్టర్ రంగంలో వస్తున్న వేగవంతమైన పురోగతికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ప్రస్తుతం భారతదేశ వ్యాప్తంగా 5 సెమీ కండక్టర్ యూనిట్లు చివరి దశలో ఉన్నాయి. ఫాక్స్‌కాన్ ఈ 6వ యూనిట్‌ను ప్రారంభించడంతో, భారత్ టెక్నాలజీ స్వావలంబన దిశగా మరింత ముందడుగు వేయబోతుందని తెలుస్తోంది. వీటితో




పాటు మెర్క్,లిండే, ఎయిర్ లిక్విడ్, ఐకాక్స్ వంటి కెమికల్, గ్యాస్ సరఫరాదారులు కూడా భారత్‌లో తమ సామర్థ్యాన్ని విస్తరిస్తున్నాయి.ఇక విద్యా, స్టార్టప్ రంగాల్లో శేష చైతన్యం కనిపిస్తోంది.

# టెలిగ్రామ్ సిఇఒ దేశం విడిచి వెళ్లడానికి వీల్లేదు.. ఫ్రాన్స్

**ముంబై, మే 21:** ముందస్తు అనుమతి లేకుండా టెలిగ్రామ్ సిఇఒ పావెల్ దురోవ్ ఫ్రాన్స్ విడిచి వెళ్లేందుకు అధికారులు నిరాకరించాయి. ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్‌తో చర్చల కోసం అమెరికా వెళ్లాని దురోవ్ ఇటీవల అధికారులను విజ్ఞప్తి చేశారు. అయితే ఆయన అభ్యర్థనను పారిస్ ప్రాసిక్యూటర్ కార్యాలయం తోసిపుచ్చింది. పొలిటికో తెలిపిన వివరాల ప్రకారం, దురోవ్ ప్రతిపాదిత యుఎస్ పర్యటనను ఉటంకిస్తూ ఫ్రెంచ్ ప్రాసిక్యూటర్లు ఈ పర్యటనకు కచ్చితంగా వెళ్లాలనేలా ఎలాంటి కారణాలు లేవు అని ఇటీవల తీర్పు ఇచ్చారు. 2024 ఆగస్టులో ఫ్రెంచ్ విమానాశ్రయంలో అరెస్టయినప్పటి నుంచి దురోవ్ ఎదుర్కొంటున్న న్యాయపరమైన అడ్డంకులను అనుసరించి ఈ నిర్ణయం తీసుకున్నారు. అరెస్టు చేసినప్పటి నుంచి ఆయనను కఠినమైన చట్టపరమైన నియంత్రణలో ఉంచారు. దురోవ్ సహ వ్యవస్థాపకుడిగా ఉన్న టెలిగ్రామ్‌లో జరుగుతున్న చట్టవ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన తనపై ఆరు క్రిమినల్ అభియోగాలు మోపారు. టెలిగ్రామ్ సిఇఒపై వచ్చిన అనేక అరోపణల్లో ప్రధానంగా టెలిగ్రామ్‌ను మనీలాండరింగ్, పిల్లలపై లైంగిక వేధింపులు వంటివి ఉన్నాయి. రష్యాలో జన్మించిన పారిశ్రామికవేత్త దురోవ్‌కు ఫ్రాన్స్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రెండింటిలోనూ పౌరసత్వం ఉంది. నిర్దిష్ట అనుమతులు లేకుండా ఫ్రాన్స్ విడిచి వెళ్లడానికి వీల్లేదని నిషేధం విధించారు. ఫ్రాన్స్ అధికారులు 2024 ఆగస్టులో ఫ్రెంచ్ విమానాశ్రయంలో దురోవ్‌ను అరెస్టు చేశారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.